# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

**అధికార నివేదిక**

OFFICIAL REPORT

శుక్రవారం, జూన్ 20,2014

**FRIDAY, 20TH JUNE, 2014**

14వ శా.స. 1 వ సమావేశం, వాల్యూం-I నంబరు-2

**14TH L.A. I – SESSION, VOL-I NO.-2**

శక సంవత్సరం-1936, జ్యేష్ఠ -30

**30-**Jyeshta**, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ

### ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి(ప్రొటెం) | ః | శ్రీ పతివాడ నారాయణస్వామి నాయుడు |
| కార్యదర్శి(ఇంచార్జ్) | ః | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

---

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**

**(మొదటి   సమావేశము ః  రెండవ  రోజు )**

**శుక్రవారం, జూన్ 20, 2014**

**సభ ఉ.గం.09.00. లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభా సమావేశం (ఉ.గం.9.00.) | ..... | 5 |
| 2. | సభ్యుల ప్రమాణ స్వీకారం | ..... | 5 |
| 3. | సభాపతి ఎన్నిక ప్రక్రియ (పేరు ప్రతిపాదన మరియు ఎన్నిక ప్రకటన) | ..... | 6 |
| 4. | సభ్యుల అభినందన ప్రసంగములు | ..... | 6-13 |
| 5. | ఉపసభాపతి ఎన్నిక ప్రకటన | ..... | 13 |
| 6. | అభినందన ప్రసంగాలు కొనసాగింపు | ..... | 13-63 |
| 7. | సభ్యుల ప్రమాణ స్వీకారం | ..... | 63 & 64 |
| 8. | గౌరవ ప్రతిపక్ష నాయకుని పేరు ప్రకటన | ..... | 64 |
| 9. | సభ వాయిదా (మ.గం.1.08 ని.) | ..... | 64 |

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

## Friday, the 20th June 2014

* * *

### (THE HOUSE ASSEMBLED AT 9-00 AM WITH HON'BLE SPEAKER (PRO TEM) IN THE CHAIR)

మిస్టర్ స్పీకర్ (ప్రొటెం) ః నిన్న ప్రమాణస్వీకారం చేయని సభ్యుల పేర్లను ఇపుడు పిలుస్తారు. వరుసగా వచ్చి ప్రమాణస్వీకారం చేయవలసిందిగా కోరుతున్నాను.

<table>
<tr><th>Sl.No.</th><th>Name of the Member</th><th>Name of the Constituency</th><th>Language in which Oath was Administered (Telugu/English)</th></tr>
<tr><td></td><td>Sri G.V. Anjaneyulu<br>శ్రీ జీ.వి. ఆంజనేయులు</td><td>Vinukonda<br>వినుకొండ</td><td rowspan="3">not available<br>అందుబాటులో లేరు</td></tr>
<tr><td></td><td>Sri Bandaru Satyanarayana Murthy<br>శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి</td><td>Pendurthi<br>పెందుర్తి</td></tr>
<tr><td></td><td>Sri Gouthu Shyam Sundar Sivaji<br>శ్రీ గౌతు శ్యాంసుందర్ శివాజి</td><td>Palasa<br>పలాస</td></tr>
<tr><td>01</td><td>Sri Jyothula Nehru<br>శ్రీ జ్యోతుల నెహ్రూ</td><td>Jaggampet<br>జగ్గంపేట</td><td>Telugu<br>తెలుగు</td></tr>
<tr><td>02</td><td>Sri Pochimareddy Ravindranath Reddy<br>శ్రీ పోచిమరెడ్డి రవీంద్ర రెడ్డి</td><td>Kamalapuram<br>కమలాపురం</td><td>Telugu<br>తెలుగు</td></tr>
</table>

మిస్టర్ స్పీకర్ (ప్రొటెం) ః సభను పది నిమిషాల పాటు వాయిదా వేయడమైనది.

(సభ ఉ.9.07 ని.లకు వాయిదా పడింది)

విరామానంతరం సభ తిరిగి ఉదయం 9.17 గం.లకు ప్రారంభమైంది.

గౌరవ సభాపతి (ప్రొటెం) అధ్యక్ష స్థానంలో ఉన్నారు.

**--XX--**

## సభాపతి ఎన్నిక

మిస్టర్ స్పీకర్ (ప్రొటెం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్య విధాన కార్యక్రమ నిర్వహణ నియమావళి లోని ఏడవ నియమమును అనుసరించి సభాపతి పదవికి సక్రమంగా నామ నిర్దేశం చేయబడిన సభ్యుల పేర్లను, ప్రతిపాదకుల పేర్లను సభకు నేను తెలియచేస్తున్నాను.

| క్రమ సంఖ్య | అభ్యర్థి | ప్రతిపాదకుని పేరు |
|---|---|---|
| 1. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ నారా చంద్రబాబు నాయుడు |
| 2. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి |
| 3. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు |
| 4. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ నిమ్మకాయల చినరాజప్ప |
| 5. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ పితాని సత్యనారాయణ |
| 6. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ బి.చిరంజీవులు |
| 7. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ జి.వి.ఆంజనేయులు |
| 8. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ ఆర్.కిషోర్ బాబు |
| 9. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ నక్కా ఆనందబాబు |
| 10. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ ఎం.వేణుగోపాల్ రెడ్డి |
| 11. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ ఏ.సత్య ప్రసాద్ |
| 12. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు |
| 13. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ |
| 14. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ టి.శ్రవణ్ కుమార్ |
| 15. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ యరపతనేని శ్రీనివాసరావు |
| 16. | శ్రీ కోడెల శివప్రసాద రావు | శ్రీ కె.శ్రీధర్ |

సక్రమంగా నామ నిర్దేశం చేయబడిన అభ్యర్థి శ్రీ కోడెల శివప్రసాద రావు గారు ఒక్కరే అయినందున సభాపతి పదవికి శ్రీ కోడెల శివప్రసాద రావు గారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినట్లు

**ప్రకటించుచున్నాను. శ్రీ కోడెల శివప్రసాద రావు గారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తూ సభాపతి స్థానమును అలంకరించవలసిందిగా వారిని కోరుచున్నాను.**

**శ్రీ కోడెల శివప్రసాద రావు గారిని సభాపతి స్థానమునకు తీసుకు రావలసినదిగా సభా నాయకుని మరియు ఇతర పార్టీల నాయకులను కోరుతున్నాను.**

(సభాపతిగా ఎన్నికైన శ్రీ కోడెల శివప్రసాద రావు గారిని సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య గౌరవ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనాయకులు సగౌరవముగా తోడ్కొని వెళ్లి అధ్యక్ష స్థానములో ఆసీనులను గావించారు. )

(అనంతరం కొంత మంది అధికార పార్టీ సభ్యులు గౌరవ సభాపతి వద్దకు వెళ్లి అభినందనలు తెలియచేశారు.)

మిస్టర్ స్పీకర్ః గౌరవ సభ్యులు దయచేసి కూర్చోవలసిందిగా కోరుతున్నాను. సభా నాయకులు గౌరవ ముఖ్యమంత్రి గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష నాయకులతో సహా వారి పార్టీకి చెందిన సభ్యులు గౌరవ సభాపతి వద్దకు వెళ్లి అభినందనలు తెలియచేశారు)

దయచేసి సభ్యులందరూ తమ స్థానాల్లో కూర్చుని సభా కార్యక్రమాన్ని కొనసాగించడానికి సహకరించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడుః అధ్యక్షా, ఈరోజు మీరు శాసనసభ అధ్యక్షులుగా నూతన రాష్ట్రానికి ఎంపిక కావడం, అందులోనూ మొదటి సభాపతిగా ఎంపిక కావడం మా కందరికీ గర్వ కారణం. ఇది ఒక చరిత్ర. ఈ సభలో ఉండే ఒకరిద్దరు సభ్యులు తప్ప మిగతా అందరి కంటే మీరు సీనియర్ నాయకులు. మీరు గుంటూరు జిల్లా నకరేకల్ మండలం కండ్లగుంట గ్రామంలోని మధ్య తరగతి కుటుంబంలో మీరు జన్మించారు. మీరు అంచలంచెలుగా ఏ విధంగా మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకున్నారో అందరికీ ఒక ఉదాహరణ. మీరు ఒక సాధారణ కుటుంబంలో పుట్టారు. బాగా చదువుకున్నారు. సిరిపురంలో పియుసి చేశారు. విజయవాడలో ఎంబిబిఎస్ చేశారు. కర్నూలులో ఎం.ఎస్.చేశారు. ఆరుసార్లు శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. మీరు 14 సంవత్సరాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక రకాల మంత్రి పదవులు చేపట్టారు. హోంశాఖా మంత్రిగా, భారీ నీటిపారుదల శాఖామాత్యులుగా,

పంచాయతీరాజ్ శాఖామాత్యులుగా, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాల శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ ఇలాంటి వివిధ శాఖల్లో పనిచేసిన అనుభవం అపారంగా ఉంది. ఒక వైద్యుడిగా, శాసనసభ సభ్యుడిగా, మంత్రిగా, రైతు నాయకుడిగా మీరు ఎనలేని కృషి చేశారు. సమాజం శ్రేయస్సు కోసం అన్ని విధాలుగా మీరు ప్రయత్నం చేశారు. నాకు మీతో బాగా సన్నిహిత సంబంధం ఉంది.

1983వ సంవత్సరం నుండి నేను మీతో అన్ని విధాలుగా కలిసి పని చేసాను. ఎవరైతే ఈ రాష్ట్రానికి, తెలుగు జాతికి ఆత్మ గౌరవాన్ని తీసుకు వచ్చారో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు గారితో చాలా సన్నిహితంగా ఉండే వారు. మీరంటే ఆయన చాలా అభిమానంగా ఉండేవారు. మీరు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చారు. అలాంటి ఒక ఉన్నతమైన వ్యక్తి స్పీకర్ కావడం చాలా సంతోషకరం. నేను చాలాసార్లు మీతో కలిసి పనిచేసాను. మిమ్మల్ని ఒక ఆర్గనైజేషన్‌లో చూసాను. ఎక్కడికక్కడ సమర్ధవంతంగా, ఏ పనైనా దానికి వన్నె తెచ్చే విధంగా బాగా పనిచేశారు. ప్రభుత్వంలో కూడా మిమ్మల్ని చూసాను. ఏ పని అప్పజెప్పినా చిన్న పని గానీ, పెద్ద పని గానీ ఆ పని సమర్ధవంతంగా చేసుకుంటూ ముందుకు వెళ్లారు. మీలో ఒక ఆలోచన ఎప్పుడూ ఉంటుంది. ప్రజలకు న్యాయం జరగాలి. ఈ పేదరికం పోవాలి. సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో మీరు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. కొంత మంది అధికారం ఉంటేనే చేస్తామని అనుకుంటారు గానీ అధికారం లేకపోయినా ఏమి చేయగలుగుతారో మీరు చేసి చూపించారు.

ఈరోజు ఎన్.టి.ఆర్ బసవతారకం హాస్పటల్, క్యాన్సర్ ఇన్టిట్యూట్. ఎవరైతే మా అత్తగారు ఎన్.టి.రామారావు గారి సతీమణి, ఆ రోజు కేన్సర్‌తో చనిపోవడం, మనం ఎన్.టి.రామారావు గారి దగ్గర కూర్చున్నప్పుడు ఒక చర్చ వచ్చింది. ఈ మాదిరిగా చనిపోయింది, నేను అమెరికాకు పంపించాను, ఎక్కడెక్కడో ఆసుపత్రులకు కూడా పంపించాను, చాలా ఇబ్బంది పడింది, సఫర్ అయ్యింది, ఈ రోజు ఎవరైనా ముందుకొచ్చి ఒక కేన్సర్ ఆసుపత్రి పెడితే బాగుంటుందంటే మీరు ముందుకొచ్చారు. ఆ రోజు ఎన్.టి.రామారావు గారు ల్యాండ్ మీకు ఇస్తామని చెప్పి ఒక్క ల్యాండ్ ఇచ్చారు. ఆ తర్వాత మీరు ఎన్ని విధాలా కష్టపడ్డారో ప్రపంచం మొత్తం తిరిగి డబ్బులు మెబిలైజ్ చేసి ట్రస్ట్‌ను బ్రహ్మాండంగా రన్ చేసిన పరిస్థితి. ఈరోజు అక్కడ ఆ ట్రస్ట్ ద్వారా ఆసుపత్రి అయితే హైదరాబాద్‌లోనే కాకుండా దేశంలోనే one of the best Cancer Hospital గా తయారయ్యిందంటే ఆ రోజు మీరు చూపించిన చొరవ, మీరు వేసిన ఫౌండేషన్ తప్ప మరొకటి కాదు. దాంట్లో నేను కూడా మీతో అసోసియేట్ అయ్యాను. అది కూడా, మీరు ఏ విధంగా చేస్తున్నారు, దానికి నేను మిమ్మల్ని పూర్తిగా ప్రోత్సహించాను. ఏదైతే రాష్ట్ర విభజన జరిగినప్పుడు మీరు పడిన ఆందోళన నేను చాలాసార్లు

మిమ్మల్ని దగ్గరగా కూడా చూశాను. మీరు ఒక్కటే బాధ పడ్డారు. ఏమిటి ఇవన్నీ జరుగుతున్నాయి, అన్యాయం జరుగుతోంది. ఇంత అన్యాయం జరిగితే మనం ఏమి చేయలేమా అని ఎంతో తపన పడ్డారు, ఆవేద పడ్డారు. అలాంటి మనస్తత్వం మీది. ఎక్కడ పేదరికం ఉంటే అక్కడ మీరు ఉండే వారు. ఎప్పుడు కూడా ఒక అయిదు నిమిషాలు టైమ్ దొరికితే మీరు అదే పనిగా గ్రామీణ ప్రాంతాల ప్రజలతో మమేకమయ్యే వారు.

రైతు ఇబ్బంది వచ్చింది, నేను మిమ్మల్ని దగ్గరగా చూశాను. నేను ఒక బాధ్యతను మీకు అప్పగించి ప్రసాద్ గారు మీరు ఈ పని చేయమంటే ఆ రైతుల కోసం ఎంత తపన పడ్డారో, నేను దగ్గరగా మిమ్మల్ని చూసిన సందర్భాలు ఉన్నాయి. అదే మాదిరిగా ఆ రైతుల కోసం ఒక కమిటీని వేస్తే ఇక్కడే కాకుండా కేంద్ర ప్రభుత్వం మీద కూడా ఒత్తిడి తేవడం కోసం అన్ని విధాలుగా మీరు ప్రయత్నం చేశారు. అంతేకాకుండా నేను రైతు పోరుబాట కార్యక్రమాన్ని ప్రవేశపెడితే ఆ రైతు పోరుబాటలో నాతో కూడా 22 జిల్లాలో ఆ రోజు మీరు పర్యటించారు. మీకు కాలు బాగోలేకపోయినా ఇబ్బంది పెడుతున్నా, డాక్టర్లు ఒద్దన్నా ఏ మాత్రం వినకుండా మీరు నడుస్తుంటే నేను నడవకుండా ఉంటే కరెక్ట్ కాదని మీరు నాతో కూడా నడిచారు. అదీ కాకుండా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు, వారికి ఒక స్ఫూర్తినియ్యాలి, ఒక ధైర్యాన్ని ఇవ్వాలి, వాళ్ల సమస్యలను హైలెట్ చేయాలనే ఉద్దేశంతో ఆ రోజు మీరు ముందుకొచ్చి నాతో కూడా నడిచి రైతుల సమస్యలను అధ్యయనం చేశారు. రైతుల కోసం అనేక విధాలుగా, ఈ రోజు రైతులకు మనం ఋణ మాఫీ చేస్తున్నామంటే అనేకసార్లు మీరు ఒత్తిడి తీసుకొచ్చి, రైతాంగం చాలా ఇబ్బందుల్లో ఉంది ఈ సమస్యలను పరిష్కారించాలని చొరవ తీసుకున్నారు. ఆరోజు ఆంధ్రప్రదేశ్ కలిసున్నప్పుడే మీరు ఈ కార్యక్రమాలన్నీ చేసి ఎట్టిపరిస్థితుల్లో కూడా రైతుల్ని ఆదుకోవాలి వ్యవసాయం లాభసాటిగా తయారు కావాలని అనునిత్యం మీరు ఆలోచించే వారు. అవన్నీ ఇప్పటికీ నాకు గుర్తున్నాయి.

మీరు ఎప్పుడు కూడా, ఎవ్వరికీ వ్యతిరేకంగా చేయాలనేది, ఎవ్వరికీ అన్యాయం చేయాలనేది మీ మనస్తత్వం కాదు. ప్రతిసారి మీరు ఆలోచించేది, హుందాగా ఉండాలి, నీతి నిజాయితీగా ఉండాలి, విలువలతో కూడిన రాజకీయాలను చేయాలని మీరు ఆలోచించారు. ఇది నాకెంతో గర్వకారణం. ఈరోజు ఎన్నో అరోపణలు ఎంతో మంది మీద వచ్చాయి. కానీ ఎక్కడా ఇంత సుధీర్ఘ రాజకీయ జీవితంలో, 14 సంవత్సరాలు మీరు మంత్రిగా ఉన్నారు, మీకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. అదే మాదిరిగా రాష్ట్రంలో అనేక పదవుల్లో మీరు ఉన్నారు. ఎవ్వరు కూడా వేలెత్తి చూపని విధంగా, ఎవ్వరు కూడా ఒక చిన్న ఆరోపణ చేయని విధంగా, ఎవ్వరు కూడా ఒక అవినీతి అరోపణ మీ మీద చేయని విధంగా మీరు ప్రవర్తించారు. ఇది మా అందరికీ గర్వకారణమని నేను మీకు తెలియజేస్తున్నాను.

అయితే, ఈ రోజు మనం ఒకసారి చూస్తే క్రొత్త రాష్ట్రం ఏర్పడింది బోలెడన్ని సమస్యలున్నాయి. ఇటు ఈ హౌస్‌ని చూస్తే నాకు జ్ఞాపకం వస్తోంది. 1978లో నేను ఎమ్మెల్యే అయినప్పుడు ఫస్ట్ టైమ్ ఈ హౌస్‌లోకి వచ్చాను. మళ్లీ ఈ సారి ముఖ్యమంత్రిగా రెండవసారి ఈ హౌసులోకి రావాల్సి వచ్చింది. అంటే 1985 తర్వాత క్రొత్త అసెంబ్లీ ఉంటే మళ్లా 1978లో ఉండే అసెంబ్లీకి వచ్చాము. సభ్యులకు ఇన్‌కన్వీనియన్స్ ఉంది. మనకందరికీ ఇన్‌కన్వీనియన్స్ ఉంది. అదే మాదిరిగా ఫీల్డ్‌లో చూస్తే రాజధాని ఎక్కడ ఉంటుందో తెలియదు, ఇంకా చాలా సమస్యలు. ఇంకా కేడర్ ఆఫీసర్స్‌ని కూడా ఇచ్చే పరిస్థితిలో లేరు. అంటే మొత్తం ఒక సంక్షోభంలో మీరు వచ్చారు. ఈ హౌస్ ద్వారా ఒక డైరెక్షన్ కూడా రాష్ట్రానికి ఇచ్చి, తద్వారా ఏదైతే సమస్యలు ఉన్నాయో ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ సభ కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందులో అధ్యక్షులుగా మీకు కీలకమైన బాధ్యత ఉంటుంది. మీరు ఏదైతే మంచిది అనుకుంటారో పూర్తిగా మీరు ముందుకు వెళ్లండి, అన్ని విధాలుగా మేము సహకరిస్తాం. సభ హుందాగా నడవడమే కాకుండా, సభ గౌరవంగా నడిచి భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ బ్రహ్మాండంగా నడుస్తోంది, విలువలతో కూడిన శాసనసభ అనే పేరు తీసుకువస్తారనే ఒక నమ్మకం ఉంది. దానికి కారణం గత అనుభవాలు మీకు ఉన్నాయి. ఒక చరిత్ర ఉంది. మీరు ఎప్పుడు కూడా క్రమశిక్షణతో ఉన్నారు. ఎక్కడా కూడా క్రమశిక్షణను ఉల్లంఘించిన దాఖలాలు లేవు. వ్యక్తిగత క్రమశిక్షణ ఉంది అర్గనైజేషన్‌లో క్రమశిక్షణతో ఉన్నారు. ఇలాంటి వ్యక్తి స్పీకర్ కావడం ఒక అరుదైన అనుభవం. అందుకని భగవంతుడు అన్ని రకాలుగా శక్తిసామర్థ్యాలను మీకు ఇవ్వాలని, అన్ని విధాలుగా సహకరించాలని ఆశిస్తున్నాను. ఎంతో మంది స్పీకర్లు వచ్చారు, కొంత మంది స్పీకర్లే చరిత్రలో మిగిలిపోయారు. మీరు కూడా అలాంటి స్పీకర్లలో మీరొకరు కావాలని మనస్పూర్తిగా ఆశిస్తూ, అన్ని విధాలా భగవంతుడు మీకు సహకరించాలని చెప్పి మనస్పూర్తిగా కోరుకొంటే మరొక్కసారి మీరు స్పీకరైన సందర్భంగా మనస్పూర్తిగా తెలుగుదేశం పార్టీ తరఫున వ్యక్తిగతంగా నా తరఫున కూడా మీకు అభినందనలు తెలియజేసుకుంటూ ధన్యవాదాలతో ముగిస్తున్నాను.

శ్రీ వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి : పెద్దలు డా.కోడెల శివప్రసాదరావు గారు అపారమైన రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి, ఈ సభలో ఎమ్మెల్యేగా సుదీర్ఘ అనుభవం గల నాయకులు. గతంలో మంత్రిగా కూడా పని చేశారు. ఇటువంటి అనుభవం కలిగిన మీలాంటి వారిని స్పీకర్‌గా ప్రపోజ్ చేయడం కొరకు యనమల రామకృష్ణుడు గారు వచ్చి ప్రపోజ్ చేస్తున్నాము ప్రపోజల్‌కి మీ మద్దతు కావాలని తను అడిగినప్పుడు, ఒక్క నిమిషం కూడా హెజిటేషన్ అనేది లేకుండా మా పార్టీ తరఫున యునానిమస్‌గా స్పీకర్ పదవి మీకు దక్కేలా మా పార్టీ తరఫున పూర్తిగా మీకు సహకారాన్ని అందించాము. ఇక్కడ ఒక చిన్న విషయం మాత్రం చెప్పాలి. కారణమేమంటే

మామూలుగా స్పీకర్ అయిన వ్యక్తి కేవలం అధికార పక్షం నుండి వచ్చి ఆ కుర్చీలో కూర్చున్న వ్యక్తి అనే భావనను దయచేసి మీ మనస్సులో నుండి తీసేయాలి. కారణమేమంటే స్పీకర్ అయిన వ్యక్తికి అటువంటి భావన రాకూడదనే ఒకే ఒక్క కారణంతో మా పార్టీ సంపూర్ణంగా, ఇది యునానిమస్‌గా జరిగే విధంగా చూడాలని, స్పీకర్ అనే వ్యక్తి మా పార్టీకి సంబంధించిన వ్యక్తి కూడా అని చెప్పడానికి మీకు యునానిమస్‌గా మేము మద్దతు తెలపడం జరిగింది.

ఇక్కడ ఒక చిన్న కొటేషన్‌ను నేను చదువుతాను. మొట్టమొదటి లోక్‌సభ స్పీకర్ G.V.Mavalankar గారు చెప్పిన విషయాన్ని మీ దృష్టికి తీసుకురాదల్చుకున్నాను. ఆయన ఈ విధంగా అన్నాడు. "The essence of the matter is that the Speaker has to place himself in the position of a judge, he should not become a participant so as to avoid unconscious bias for or against any particular view and instill confidence in the minds of all sections of the House about his integrity and impartiality".. నాకు ఖచ్చితంగా నమ్మకం ఉంది. మీరు ఖచ్చితంగా ఆ గొప్ప జెడ్జ్‌లా ఉంటారని, రాష్ట్ర మొట్టమొదటి స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మీరు రాబోయే తరాలకు మర్చిపోలేని స్పీకర్‌గా నిలబడతారన్న నమ్మకం విశ్వాసం నాకున్నది. ఇక్కడ ప్రజాస్వామ్యం అనేది ఒక బండి అయితే పాలకపక్షం ఒక చక్రమైతే ప్రతిపక్షం రెండవ చక్రం. అలాంటి బండికి స్పీకర్ ఒక ఇరుసులాంటి వారని సుదీర్ఘ అనుభవం ఉన్న మీకు నేను వేరే చెప్పనవసరం లేదు. ఖచ్చితంగా మీరు అలాగే ఉంటారనే నమ్మకం విశ్వాసం కూడా మాకుంది. ప్రజాస్వామ్యం అన్నది, మరీ ముఖ్యంగా రాష్ట్రం విడిపోయి కష్టాల మధ్యలో క్రొత్త రాష్ట్రం ఏర్పడుతున్న ఈ సమయంలో ప్రజా సమస్యలు చాలా ఉంటాయి. అలాంటి ప్రజా సమస్యలను మీ ద్వారా పాలకపక్షం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం చాలా ఉంటుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార పక్షానికి తెలియజేయాల్సిన అవసరం ప్రతిపక్షానికి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీ "we represents voice of the voice less".అంటే ఎవరైతే సమస్యల గురించి ప్రభుత్వానికి తెలియజెప్పలేని వారుంటారో అటువంటి అట్టడుగు వర్గాలకు అండగా ఉండేందుకే మేం శాసనసభకు రావడం జరిగింది. ప్రజా తీర్పును గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధానంగా మా బాధ్యత కూడా ప్రతిపక్షంగా అదే. కాబట్టి నేను అభ్యర్థిస్తున్నదొకటే. ఇవాళ ఈ సభలో ఉన్నవి రెండే రెండు రాజకీయ పార్టీలు. వేరే ఏ రాజకీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులు ప్రస్తుత సభలో లేరు. ఒకవైపున పాలకపక్షం మరో వైపున ప్రతిపక్ష స్థానంలో

మేమున్నాం. గతంలో ఇంకా చిన్న చిన్న రాజకీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులు ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

డాక్టర్ కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, జాతీయ పార్టీ అయినటువంటి బి.జె.పి. సభ్యులుగా మేమున్నాం.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి: అధ్యక్షా, ప్రస్తుతానికి మీ పార్టీ అధికారపక్షానికి భాగస్వామ్యులుగా ఉంటూ ప్రభుత్వంలో బాధ్యత వహిస్తున్నారు కాబట్టి మళ్లీ మీ భాగస్వామ్యం ఇటు ప్రతిపక్షం వైపుకు వచ్చే వరకు మీరు అటువైపే ఉన్నారని మేం భావించాల్సి వస్తుంది. కనుక ప్రస్తుతం సభలో ఉండేవి రెండే రెండు పార్టీలు. అందులో ఒకటి ప్రతిపక్షం రెండవది పాలకపక్షం.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, జగన్మోహన్ రెడ్డి గారు కూడా మొన్నటి వరకు కలలు కన్నారు. ఇప్పుడు కూడా బహుశా కలలు కంటున్నట్టున్నారు. కలలు ఎప్పుడు కలిసి రావు. కాబట్టి మీరు ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉంటారు. మేం ఎప్పుడూ పాలకపక్షం వైపే ఉంటారు. ఇది నిజం.

డాక్టర్ కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, బి.జె.పి. జాతీయ పార్టీకి చెందిన సభ్యులం సభలో ఉన్నాం.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి: అధ్యక్షా, రామకృష్ణుడు గారు అంటున్నట్టుగా ఎవరు పాలక పక్షం వైపు ఎవరు ప్రతిపక్షం వైపు ఉంటారనేది నిర్ణయించాల్సింది ఆ దేవుడు. గతంలో 1999వ సంవత్సరంలో కూడా ఇటువంటి సభే జరిగింది. నాకు ఇంకా ఆ సభ గుర్తుంది. మా తండ్రి గారు ప్రతిపక్షం వైపున ఇటు ఉన్నారు. ఆనాడు పాలకపక్షం వైపు మీరున్నారు. అప్పుడు కూడా మీరు ఇదే నమ్మకంతో ఉన్నారు. కానీ అప్పుడు దేవుడు వేరే రకంగా దయదలిచాడు. కథ మారింది. కాబట్టి ఆ సంగతి గురించి దేవుడి పైనే వదిలేద్దాం, ప్రజల పైన వదలేద్దాం. ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో ఎవరు ఉండరనేది నిర్ణయించాల్సింది ఆ దేవుడే.

అధ్యక్షా, ఇవాళ ఇక్కడ మాత్రం గౌరవ సభాపతి గారికి చెప్పేదొకటే. ప్రజాస్వామ్యమనేది మానవాళికి భగవంతుడు ప్రసాదించిన వరమైతే ఈ ప్రజాస్వామ్య దేవాలయానికి పరిరక్షకుడిగా గౌరవ సభాపతి గారు ఉంటారనే దాన్ని మేం గట్టిగా నమ్ముతున్నాం. మీ నుంచి మేం అదే ఆశిస్తున్నాం. కచ్చితంగా సభలో మా గొంతును మీరు వినిపిస్తారని, సభలో ఉన్నవి రెండే రెండు

పక్షాలు కాబట్టి ప్రతిపక్షానికి ఆ అవకాశం ఏ తేడా లేకుండా కల్పిస్తారనే నమ్మకంతో మీకు, అదే విధంగా ఇవాళ ఆస్థానంలో కూర్చున్న మీకు మనస్ఫూర్తిగా మీకు అభినందనలు తెలుపుకుంటూ మా సహకారం ఎల్లప్పుడు మీకు ఉంటుందని తెలియజేస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. థ్యాంక్యూ.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి: అధ్యక్షా, నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరువాత తొలి శాసనసభకు గౌరవ సభాపతిగా ఎన్నికైన మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. గుంటూరు జిల్లా నరసరావుపేటలో వైద్య వృత్తిలో ఉండి ప్రజల మన్ననలు పొందిన మీకు ఆరోజున మిమ్మల్ని స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నారు. అప్పటి నుంచి ప్రజలతో మమేకమై ఆరు పర్యాయాలు శాసనసభలో సభ్యులుగా మీరు అడుగుపెట్టారు. సీనియారిటి మరియు సిన్సియారిటీ కలపోతగా ఏర్పడినటువంటి నేతగా మీరు ప్రజల మన్ననలు పొందారనే విషయాన్ని కూడా నేను సభాముఖంగా తెలియజేస్తున్నాను. మీకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా ఒక హత్యా ఉదంతంలో నైతిక బాధ్యత వహించి హోం శాఖామాత్యులుగా బాధ్యత వహిస్తున్న ఆనాడు పదవికి రాజీనామా చేయడం వంటి ఒక విలక్షణమైన మనస్తత్వం కల్గిన వ్యక్తిగా మిమ్మల్ని అభివర్ణించకతప్పదు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు. ఏ శాఖామాత్యులుగా ఉంటే ఆ శాఖకు వన్నె తెచ్చారు. తద్వారా చాలా మంచి పేరు ప్రతిష్టలు మీకు తెచ్చిపెట్టాయి. అంతేగాకుండా మీరు రాజకీయాల్లో ఉంటూ ఒక డాక్టర్‌గా ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి చైర్మన్‌గా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారు. అందుకు కూడా నేను మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ సుదీర్ఘ రాజకీయకీయ పరిపాలనలో మీరు గౌరవ సభాపతి స్థానంలో కూడా చాలా మంచి పేరు ప్రతిష్టలు గడిస్తారనే పూర్తి విశ్వాసం నాకుంది. ప్రజాస్వామ్యంలో సిద్ధాంతాలకు విలువనిచ్చే నాయకత్వం కూడా మీలో ఉందని నేను నమ్ముతున్నాను. ఏ విధంగా మీరు రాజకీయాల్లో రాణించారో అదే విధమైన వైఖరిని మీరు సభాపతి స్థానంలో కూడా ప్రదర్శిస్తారని నేను భావిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పెద్ద జిల్లా అయిన గుంటూరు జిల్లా నుంచి వచ్చిన మీకు ఈరోజున మీకు పోటీ పెట్టకుండా గౌరవ సభాపతిగా ఏకగ్రీవంగా మిమ్మల్ని ఎంపిక చేసినందుకు నా సహచరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. అదే విధంగా మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని గౌరవ సభాపతి గారి స్థానంలో కూర్చోబెట్టినందుకు ప్రత్యేకంగా వారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ మీరు గౌరవ సభాపతి స్థానంలో కూడా మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని సభ్యులందరి మన్ననలు పొందాలని మీకు మనవి చేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

**ANNOUNCEMENT**

MR. SPEAKER: I am to announce to the House that under Rule 8 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly, the election of the Deputy Speaker will be held at 11.00 A.M. on 23rd of June 2014.

The nomination paper for the election of Deputy Speaker shall be delivered to the Secretary at any time between 10.30 A.M. and 5.00 P.M. on 20th June, 2014 either by the Proposer or the Candidate nominated. The nomination papers are available with the Secretary to Legislature.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు: స్పీకర్ సార్, ఈ ప్రజాస్వామ్యానికే అత్యంత వైభవాన్ని, వన్నె తీసుకువచ్చే ఆ మహత్తర స్థానంలో గౌరవ సభాపతిగా కూర్చున్నే అవకాశం మీకు కల్గినందుకు హృదయపూర్వకమైన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఆ అవకాశం కల్పించిన మన నాయకులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు తొలి సభాపతిగా మీకు అవకాశం రావడం ఎంతో సంతోషదాయకం. మీ గురించి సహచర మిత్రులు చెప్పినప్పటికీ, నాకు కూడా మీ గురించి కాస్తో కూస్తో తెలుసు. మీతో మంత్రిగా బాధ్యతలు నిర్వహించే మహత్తర అవకాశం నాకు 1985-89 మధ్యకాలంలో లభించింది. మీరు స్వతహాగా వైద్యులు. వైద్యుడిగా ఈ సమాజంలో స్థిరపడినటువంటి వారు మీరు. మనందరికీ తెలుసు. "వైద్యో నారాయణో హరి" మనుషులు కష్టాల్లో, ఆపదలో ఉన్నప్పుడు, దీర్ఘ అనారోగ్యాలతో బాధపడుతున్న సందర్భంలో సహజంగానే భగవంతుడిని తలుస్తుంటారు. కానీ ప్రత్యక్షంగా మనలాంటి మానవ ఆకారం కల్గినటువంటి ఆ వైద్య వృత్తిలో వైద్యుడు చేసినటువంటి సహాయ సహకారం వల్ల మనిషి బ్రతుకుతాడు. ఆ విధంగా బ్రతికినటువంటి మనిషిలో ఉన్నటువంటి మొట్ట మొదటి మానవతా మూర్తి ఆ వైద్యుడు. అందుచేతే "వైద్యో నారాయణో హరి" అంటారు. మీరు మాకు హరి లాంటి వారు, దేవుడి లాంటి వారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం. మన దేశంలో మన రాష్ట్రానికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రత్యేక స్థానం ఉంది. శాసనసభ్యులుగా, రాజకీయ నాయకులుగా మనమేదైనా ఇతర ప్రాంతాలకు గానీ, దేశాలకు గానీ వెళ్లుతున్నప్పుడు మనం రాజకీయ నాయకులుగా భారత దేశం నుంచి వచ్చామనే విషయం

అక్కడ ఉన్న మన తెలుగు వారి ద్వారా అక్కడి వారికి తెలిసినప్పుడు మనల్ని ఎంతో గౌరవిస్తారు. ఎందుకంటే లక్షలాది కులాలు, లక్షలాది మతాలు, భిన్నమైన అభిప్రాయాలు కల్గిన మన భారత దేశంలో భిన్నత్వంలో నుంచి ఏకత్వం కొన్ని విభిన్నమైన ఆలోచనలతో ఏకవచనం ద్వారా ఈ దేశాన్ని నడిపించే మహత్తరమైనటువంటి శక్తి ఈ ప్రజాస్వామ్యం. దానికి పునాది రాజ్యాంగం.

అలాంటి రాజ్యాంగం ద్వారా సంక్రమించినటువంటి ఈ చట్టసభలో మీరు కూర్చోవడం మా అందరికీ గర్వంగా, సంతోషంగా ఉంది. త్వరలోనే ఆంధ్రప్రదేశ్, ప్రపంచ దేశాల్లోనే ఒక గొప్ప ప్రజాస్వామికమైన, కులాలకు, మతాలకు, రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతయమైన ఒక గొప్ప రాష్ట్రంగా మీ నాయకత్వంలో తప్పకుండా ఆ విధమైన మాటను మనం దక్కించు కుంటామని నేను మనవి చేస్తున్నాను. ముఖ్యంగా 1987వ సంవత్సరంలో మనందరం శ్రీ ఎన్.టి.రామారావుగారి నాయకత్వంలో ఎన్.డి.ఎ. మీటింగ్‌కు మద్రాసు వెళ్తున్నప్పుడు చాలా నీరసంగా ఉందని హైదరాబాదులో ఇంజక్షన్ చేయించుకున్నాను. ఆ ఇంజక్షను సెప్టిక్ అయి ట్రైయిన్‌లో రాత్రంతా బాధపడ్డాను. 1991వ సంవత్సరంలో శ్రీ డి.వి.ఎస్.రాజుగారి ఇంట్లో బాధతో ఉంటే మీరు నా దగ్గరకు వచ్చి వాచిపోయిన ఆ జబ్బను చూసి, వెంటనే మీరు చాలా బాధపడుతున్నారనే మాట చెప్పడం, ఒక ట్యాబ్లెట్ పేరు రాసి, ఇది వేసుకో సూర్యారావు అన్నా రు. ఆ విధంగా మీ వైద్య వృత్తిని, ఆ వృత్తిలో నాకున్న బాధని తగ్గించడమే కాకుండా, ఆ క్షణాన మీరు దేవుడిలా వచ్చారు. తెల్లవార్లూ బాధపడ్డాను అధ్యక్షా, అలాంటి గొప్ప మానవతా మూర్తులు మీరు. మంచి సంస్కారం, సభ్యత, ఎదుటివారిని గౌరవించే మంచి భావన కలి గినవారు మీరు. మరి మీ గురించి, నా జిల్లాకు ఉన్న ఒక అనుబంధం గురించి ఒక్క మాట మన వి చేయాలనుకొంటున్నా అధ్యక్షా. 150 సంవత్సరాల క్రితం కాటన్ మహాశయులు నిర్మించిన ధవళేశ్వరం బ్యారేజీ కింద ఉన్న కోనసీమ ప్రాంతం మాది. 150 సంవత్సరాలకు ముందు మాకు సరైన ఆహారం, వ్యవసాయ భూములు లేని, ఒక భయంకరమైన ప్రాంతం. ఈ ప్రాంతమంతా ఎప్పుడూ వర్షాలు పడుతూ, నదీజలాలతో, వరదలతో బీభత్సంగా ఉంటూ, కేవలం ప్రకృతి సహకారంతో వెలసిన కొబ్బరిచెట్లు, తాటిచెట్లు ద్వారా వచ్చే ఫలాలు తిని బతికే జీవన విధానం ఉండేది. అలాంటి ప్రాంతంలో ఆమధ్య గడిచిన ప్రభుత్వంలో కోనసీమ రైతాంగం అంతా అత లాకుతలమై స్వచ్ఛంధంగా 'బ్రతికుంటే బలుసాకు అయినా తిని బతకొచ్చు', మాకు బతకడం కావాలి. మేం వ్యవసాయం జోలికి పోలేం అని స్వచ్ఛందంగా క్రాప్ హాలిడే ప్రకటించుకున్న సందర్భంలో సుమారు 85,000 రైతు కుటుంబాలను మీరు స్వయంగా వచ్చి, ఆదుకొని, ఆనాటి ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను కలిసి, సానుభూతిని ప్రకటించ డమే కాకుండా, మా జిల్లాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో మేం ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని మీ చేతుల మీదుగా ఇచ్చి, మీరు ప్రోత్సహించడమే కాకుండా తూర్పుగోదావరి జిల్లా రైతాంగాన్ని ఆదుకున్న గొప్ప ఆదర్శవంతులని మీకు మనవి చేస్తున్నాను. ఇలా మీ విష

యాలు ఎన్నో ఉన్నాయి. ఇవాళ ఇది ఒక గొప్ప మంచి ప్రజాస్వామ్య దేశం. ఈ రాష్ట్రం కూడా అనేక సందర్భాల్లో మనం అనేక గౌరవాలు పొందే సందర్భాలున్నాయి. స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావుగారు ఈనాడు తెలుగు ప్రజలకు, తెలుగు జాతికి దేశ దేశాల్లోనే ఒక ఖ్యాతిని, గౌరవాన్ని తీసుకొచ్చిన సభగా, ఈ సభ ఒకప్పుడు మనకందరకూ గర్వకారణంగా ఉండేది. మళ్లీ మీ ద్వారా పూర్వ వైభవాన్ని తెలుగు జాతికి, తెలుగు ప్రజలకు, ఈ నూతన రాష్ట్రానికి తీసుకొస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా మీకు ఇలాంటి గౌరవాన్ని ఇచ్చిన మా సభానాయకులను హృదయపూర్వకంగా గౌరవిస్తూ, మీకు కూడా ఎప్పుడూ శుభాలు జరగాలని, మంచి పేరు, ప్రఖ్యాతులు, తద్వారా మా అందరికి కూడా ఈ రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులు మరియు ప్రజలందరికీ ప్రయోజనాలు చేకూరాలని కోరుకుంటూ మరొకసారి నా ధన్యవాదాలు మీకు తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః పెద్దిరెడ్డి గారి రామచంద్రారెడ్డి గారు.

శ్రీ పెద్దిరెడ్డిగారి రామచంద్రా రెడ్డిః అధ్యక్షా, ఈరోజు మీరు ఏకగ్రీవంగా సభాపతి కావడం చాలా సంతోషంగా ఉంది. మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. గతంలో మీరు చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్నప్పుడు శాసనసభ్యునిగా అప్పట్నుంచి మీతో పరిచయం ఉంది. అప్పుడు మేం సంఖ్యా పరంగా కాంగ్రెస్ పార్టీనుంచి తొమ్మిది మంది శాసనసభ్యులుగా ఉన్నా కాని, అందరికీ మీరు సమీక్షా సమావేశాల్లో సమాన అవకాశాలు ఇచ్చారు. మా అందరి సమస్యలను పార్టీరహితంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాంటి వ్యక్తి ఈరోజు స్పీకర్ కావడం నిజంగానే మా జిల్లా వాసులం, శాసనసభ్యులమంతా సంతోషంగా ఉన్నాం. తప్పకుండా అదే పంథాలో మీరు స్పీకర్‌గా విధులు నిర్వర్తించి, రాబోయే తరాలకు ఆదర్శవంతంగా నిలుస్తారని నేను విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను. తప్పకుండా మీరు ఈ పదవికి వన్నె తెచ్చేవిధంగా వ్యవహరిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరొక్కసారి అభినందిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః జలీల్‌ఖాన్ గారు.

శ్రీ జలీల్‌ఖాన్ః అధ్యక్షా, దాదాపు ఇరవై సంవత్సరాల నుంచి మీతో నాకు పరిచయాలున్నాయి. మీరు గుంటూరు జిల్లా వాసి అయినప్పటికీ, కృష్ణా జిల్లా నుంచి కూడా అంతే ప్రాధాన్యత ఉంది. మీరు మంచి వైద్యులే కాకుండా నర్సరావుపేటలో దాదాపుగా నాకున్న పరిచయాల్లో కులాలకు, మతాలకు అతీతంగా, అందరికీ న్యాయం చేశారు. మీరు తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికి కూడా ఉన్నత స్థాయి పదవులు అనుభవించినప్పటికి, తెలుగుదేశం పార్టీలో

రాజకీయంగా ఇబ్బంది వచ్చినా, కొన్ని సమస్యలపైన తేడా కనిపించినప్పుడు నిర్మొహమాటంగా మాట్లాడిన, మనస్తత్వం కలిగిన నాయకులు మీరు. మీ విషయాల్లో నేను చాలా సందర్భాల్లో చూశాను. ఈ రాష్ట్రం విడిపోయినప్పుడు కూడా మీరు అందరికన్నా ఎక్కువగా కష్టపడ్డారు, బాధపడ్డారు, ఆవేదన చెందారు. నేను మీ స్నేహితుడిగా ఈ స్పీకర్ పదవిలో మంచి పేరు సంపాదించుకొంటారని, అది తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, అపోజిషన్ పార్టీ అని ఆలోచించకుండా ప్రజా సమస్యల మీద, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల మీద మేం మాట్లాడేటప్పుడు పూర్తి న్యాయం చేస్తారని మీ వైపు నుంచి నేను ఆశిస్తున్నాను. మీరు గుంటూరుజిల్లావాసి అయినప్పటి కూడా నేను కృష్ణాజిల్లా వాసిగా మీరు స్పీకర్ అయినందుకు నేనెంతో ఆనందపడుతూ, అభినందనలు తెలియజేస్తున్నాను. మీ మనస్తత్వం నాకు దాదాపు 25 సంవత్సరాల నుంచి తెలుసు, మీరు న్యాయం చేస్తారు. ఎంతటి నాయకునితోనైనా మీరు న్యాయంగా మాట్లాడే మనస్తత్వం మీకుంది. స్పీకర్ పదవికి కూడా మీరు న్యాయం చేస్తారని పూర్తి విశ్వాసంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యునిగా మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఇందాక సభ్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారు ఒక విషయం చెప్పారు. ఇది పర్మినెంటు అని. ఎన్ని కష్టాలతో, ఎన్ని ఎత్తు చిత్తులతో, ఎంత తేడాతో అధికారంలోకి వచ్చారనేది కూడా సభ్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారు తెలుసుకోవలసిన అవసరం ఉంది. త్వరలోనే మీ పడవ చాలా తక్కువ నీళ్లలోనికి ప్రవేశిస్తుంది. తొందరలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మీకు మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః ప్రత్తిపాటి పుల్లారావు గారు.

శ్రీ పి.పుల్లారావు ః అధ్యక్షా డా.కోడెలశివప్రసాదరావు గారు సభాపతిగా ఎన్నిక కావడం గుంటూరు జిల్లా ప్రజలందరికీ సంతోషకరం. రైతు కుటుంభంలో జన్మించి, రైతుల కష్టాలు తెలిసిన వారుగా, రైతు పక్షపాతిగా రైతుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన మంచి నాయకులు డా.కోడెలశివప్రసాదరావుగారు. మంచి వైద్యునిగా గుర్తింపు పొందారు. అదేవిదంగా రాజకీయాలలోకి వచ్చి మంచి శాఖలు చేపట్టి ప్రజాదరణ పొందిన వ్యక్తిగా కూడా ఉన్నారు. అనాటి నుండి ఈ నాటి వరకు మంచి పేరు ప్రతిష్టలు ఉన్న నాయకుడు డా.కోడెలశివప్రసాదరావు గారు. గతంలో హోం, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్, పౌరసరఫరాల శాఖలు కూడా నిర్వహించిన నాయకులు. మీరు ఏ శాఖలో పనిచేసినప్పటికీ ఆ శాఖకే వన్నె తెచ్చారు. తద్వారా రాష్ట్ర ప్రయోజనాలు చేకూరే విదంగా పనిచేశారు. అదేవిదంగా ఎన్‌టి.రామారావు గారు క్యాన్సర్ హస్పటల్ నిర్మాణాపు బాధ్యతను అప్పగిస్తే, దేశ, విదేశాలు పర్యటించి, ఎన్ఆర్ఐలను సంప్రదించి క్యాన్సర్ హాస్పటల్‌ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్రను నిర్వహించారు.

అదేవిధంగా  పేదలపట్ల, ప్రజా సమస్యలపట్ల స్పందించడం, వారిపక్షాన పోరాటం చేయడం వంటి మంచి పనులు చేపట్టారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని ఉద్యమం చేపట్టారు. గుంటూరు జిల్లాను  అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర వహించారు. గుంటూరు జిల్లాలో ఉన్న కోటప్పకొండను ప్రసిద్ధ శైవక్షేత్రంగా తీర్చిదిద్దిన ఘనత కూడా డా.కోడెల శివప్రసాదరావు గారిది. అదే విధంగా  గుంటూరు జిల్లాను అభివృద్ధిలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి సభాపతిగా ఎన్నిక కావడం, గుంటూరు జిల్లా ప్రజానీకంతో పాటు, రాష్ట్ర ప్రజలందరికి సంతోషకరమైన విషయం. అంతేకాకుండా భవిష్యత్‌లో ఒక ఆదర్శవంతమైన సభాపతిగా ఉండాలని మా ఆకాంక్ష. మీరు ఏ పదవి చేపట్టినా ఆ పదవిని  అవకాశంగా మలచుకొని ఆదర్శవంతంగా పనిచేయడం మీకు మీరే సాటి అని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఈ సభను నిష్పక్షపాతంగా నడిపించడంలో కానీ, ఈరోజు కష్టాల్లో ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి వైపు నడిపించడంలో కానీ కీలకపాత్ర వహించగలరని ఆకాంక్షిస్తూ, తమకు మరొకసారి అభినందనలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి ఆర్.కె.రోజా : అధ్యక్షా, గతంలో మీతో పనిచేసిన  అనుభంతో రాజకీయంగా ఎలా మెలగాలి అని నేర్చుకున్నాను. మీరు ప్రజల పక్షాన నిలబడి పోరాడిన పోరాటాల్లో నేను కూడా మీతో కలిసి పనిచేశాను. మీరు ఈ రోజు ఒక ఉన్నతమైన సభాపతి బాధ్యతలు చేపట్టడం సంతోదాయకం, అభినందనీయం. ప్రజల సమస్యలపై స్పందించేందుకు మాకు కూడా అవకాశం ఇస్తారని ఆశిస్తూ, నాకు ఈ  అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు : అధ్యక్షా మీరు ఏకగ్రీవంగా సభాపతిగా ఎన్నికైనందుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసుకుంటున్నాను.  ఆనాడు మీరు ప్రజాసేవలో భాగమై ఒక వైద్యునిగా పనిచేస్తున్న మిమ్మల్ని 1982వ సంవత్సరంలో ఎన్‌టీ.రామారావు గారు పార్టీలోకి ఆహ్వానించాలంటూ స్వయంగా అన్నమాటలు  నాకు బాగా గుర్తున్నాయి. ఆనాటి నుండి ఈనాటి వరకు కూడా పార్టీలోనూ మరియు ప్రభుత్వంలోనూ మీరు చేసినటువంటి సేవలు మనందరకు తెలుసు. ఆ క్రమంలో ప్రజల మన్ననలను పొందుతూ 6పర్యాయాలు ఎంఎల్ఏగా ఎన్నికై వివిధ శాఖల మంత్రిగా చక్కగా పనిచేసి నీతివంతమైన పాలనను అందించారన్న గుర్తింపు మీకు ఉంది. మంచి వ్యక్తిగా నీతివంతమైన పరిపాలనతో అందరికీ న్యాయం చేకూరుస్తారనే నమ్మకం ఉంది.

రైతు సమస్యలపై శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమంలో మీరు చేసిన కృషి అందరికీ తెలిసినదే. అదేవిధంగా ఎన్‌టి.రామారావు గారి సతీమణి క్యాన్సర్ వ్యాధితో మరణించగా రాష్ట్రంలో మరెవ్వరూ క్యాన్సర్ వ్యాధితో మరణించకూడదనే సత్‌సంకల్పంతో బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ నిర్మించడం జరిగింది. అందుకోసం మీరు బాధ్యత తీసుకొని అన్నీ ప్రాంతాలు పర్యటించి ఎన్ఆర్‌ఐ.లను చైతన్యపరచి హాస్పిటల్ నిర్మాణంలో భాగస్వాములు అయ్యారు. అదేవిధంగా గుంటూరు జిల్లా కోటప్పకొండను టూరిస్ట్ ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఆ కృషిని ప్రజలు ఎన్నటికీ మరచిపోరని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. స్పీకరుగా మీరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు అభినందిస్తూ స్పీకరుగా తమకు మంచి పేరు రావలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జ్యోతుల నెహ్రూ : అధ్యక్షా నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికై సభాధ్యక్ష స్థానాన్ని అలంకరించిన తమరు నిష్పక్ష పాతంగా, ప్రతిపక్షం, అధికార పక్షం అన్న తేడా లేకుండా సమాన దృక్పధంతో మరియు సత్ సాంప్రదాయాలతో వ్యవహరిస్తారన్న అచంచలమైన నమ్మకం, విశ్వాసంతో మీకు ఈ అవకాశం కల్పించారు. ఇది మీ వ్యక్తిత్వానికి గీటురాయని నేను భావిస్తున్నాను. మీలో ఉన్నటువంటి నిబద్ధత, నిర్మొహమాటం రెండూ కూడా సభలో సత్‌సాంప్రదాయాల్ని కొనసాగించడానికి తోడ్పతాయని మరియు ప్రజావసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తారని భావిస్తున్నాను. ప్రజలు అధికారపక్షం వారికి ఇచ్చిన ఈ అవకాశాన్ని శాసనసభ ద్వారా పరిస్థితుల్ని సమన్వయం చేసే వేదికగా ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దుతారని, ఈ శాసనసభను ఒక గీటురాయిగా ఉండేటట్లుగా మలుస్తారని కోరుకుంటున్నాను.

మా నాయకుడు ప్రస్తావించినటువంటి తొలి లోక్‌సభ స్పీకర్ యొక్క విధానాన్ని అనుసరిస్తూ, ఈ శాసనసభకే చక్కని నిర్వచనం పలికే విధంగా మీ పాత్రను నిర్వహిస్తారనే పరిపూర్ణ హృదయపూర్వక నమ్మకంతో మా నోటినుండి పిలిచే " అధ్యక్షా " అనే పిలుపుకు పరిపూర్ణతను ఆపాదిస్తారని ఆశిస్తున్నాను. నిర్మొహమాటంగా మీరు వ్యవహరించేతీరు అతి దగ్గరగా తెలిసిన వ్యక్తిగా నేనెరుగుదును.

మా నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము చేయకుండా, ప్రతిపక్షం వైపు ఎక్కువగా చూసి ప్రజాసమస్యల పోరాటానికి సహకరిస్తూ, అధికార పక్షం ఆ సమస్యలను పరిష్కరించే విధంగా మావంతు పాత్రను మేము నిర్వహించడానికి, ఎక్కువ సమయాన్ని మాకు కేటాయించాలని

సవినయంగా మనవి చేసుకుంటూ, మరొక్కసారి మీకు వచ్చినటువంటి ఈ అవకాశానికి మనస్ఫూర్తిగా మిమ్మల్ని అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

గౌరవ సభాపతిః ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గారూ...

శ్రీ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు తొలి స్పీకర్‌గా మీరు ఎన్నికైనందుకు మనస్ఫూర్తిగా మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే గుంటూరు జిల్లా వాసిగా, ఈ స్పీకర్ పదవిని గుంటూరు జిల్లా వారికి ఇచ్చినందుకు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే, మా తండ్రి గారూ, మీరూ సమకాలీకులుగా రాజకీయాల్లో ఉన్నారు. మా తండ్రిగారు చనిపోయిన తరువాత నేను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత, నేను మీతో కలసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. అదేవిధంగా శాసనసభ్యునిగా, మంత్రిగా సుదీర్ఘంగా పనిచేసిన మీరు, వివిధ శాఖలను ఏవిధంగానైతే సమర్థవంతంగా నిర్వర్తించారో, అదేవిధంగా ప్రజాసమస్యల పరిష్కారానికి ఈ సభ వేదికయ్యే క్రమంలో మీ యొక్క చొరవని చూపాలని నేను కోరుతున్నాను. స్పీకర్‌గా మీరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంలో సహకరించిన శాసనసభ్యులందరికీ, ప్రతిపక్షపార్టీల సభ్యులందరికీ నేను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా మీకందరకూ తెలుసు. మీరు గతంలో అధికార పక్షంలో ఉన్నారు. మాలాంటి వాళ్ళం గత పదేళ్ళుగా ప్రతిపక్షంలో ఉన్నాము. గత పది సంవత్సరాలలో ఈ శాసనసభ జరిగిన తీరుగానీ, సభ జరిపిన తీరుగానీ, సభలో వచ్చిన మార్పులు గానీ, సభ్యుల అవకాశాలు గానీ, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని సభని నడపాలని కూడా నేను మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఏదైనా అందరికీ నా విజ్ఞప్తి ఒక్కటే, నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగిన తరువాత సభ్యులుగా ఉన్న మనందరి మీద ఒక గురుతరమైన బాధ్యత ఉందని మనమందరం కూడా గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్ నవనిర్మాణానికి ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు నేతృత్వం వహించడం జరుగుతూ ఉంది. కాబట్టి, ఆంధ్రప్రదేశ్ నవ నిర్మాణంలో, నవ శకానికి నాంది పలికేందుకై శాసనసభ్యులుగా మనమందరం కూడా సహకరించి, ప్రజలు మనమీద ఉంచిన ఆశలు, ఆకాంక్షలు ఏవైతే ఉన్నాయో, వాటిని తీర్చేందుకై సభ్యులుగా మనందరి సహకారాన్ని, సభానాయకుడికి, గౌరవ స్పీకర్ గారికి అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మరొక్కసారి మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

గౌరవ సభాపతిః రాజన్న దొర గారూ...

శ్రీ పి.రాజన్న దొర: అధ్యక్షా, తమరు వైద్యులుగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా మంచి పరిపాలనాదక్షుడిగా పేరు తెచ్చుకున్నారు. అటువంటి మీరు మన నవ్యాంధ్రకు మొదటి స్పీకర్‌గా ఎన్నికైనందుకు మీకు నా శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. అధ్యక్షా, నేను గత రెండు శాసనసభల్లో కూడా, గిరిజన శాసనసభ్యునిగా ఉంటూ, గిరిజనులకు సంబంధించిన అనేక సమస్యలను ప్రస్తావించేవాడిని. నేను ప్రభుత్వపక్షంలో ఉన్నప్పటికీ కూడా, ప్రజా సమస్యల విషయం వచ్చేసరికి ఎటువంటి రాజీ పడలేదు. అప్పటి మా నాయకుడు శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు కూడా 'తప్పులేదు, మాట్లాడు, మేమేమీ అనుకోము, మాట్లాడు' అని చెప్పేవారు. అదేవిధంగా అటువంటి ప్రజాప్రభుత్వం కావాలి. ఇక్కడ అందరూ కూడా ప్రజాపక్షం కావాలి. ఆ రెండూ సరిగ్గా చూసే బాధ్యత తమరిమీద ఉంది అధ్యక్షా. విజయనగరం జిల్లా నుండి పశ్చిమగోదావరి జిల్లా వరకు రోజూ, ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుంది. ఎక్కడ సమస్యలున్నా, లేకపోయినా, గిరిజన గూడేల్లో, గిరిజన తండాల్లో, గిరిజన కొండ ప్రాంతాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమౌతూనే ఉంటాయి. అటువంటి సమస్యలన్నింటినీ కూడా తమరి ముందుకు తీసుకువస్తాము. కాబట్టి, మా గిరిజన ఎమ్మెల్యేలకు అవకాశమివ్వండి. నేను సభ దృష్టికి తీసుకువచ్చే సమస్యలన్నీ ఎక్కువగా ప్రశ్నల రూపంలోనే వుంటాయి. ఈ శాసనసభలో కూడా రాబోయే బడ్జెట్ సెషన్స్ నుండే వివిధ జిల్లాలకు సంబంధించిన గిరిజనుల సమస్యలు ఎక్కువగా మీముందు వుంచుతాను. ప్రజాసమస్యలు, ప్రజల గొంతుకతో వినిపించడానికి మామీద దయతో మాకు ఎక్కువ అవకాశం ఇవ్వవలసినదిగా కోరుతున్నాను. ప్రజలు పడుతున్న బాధలు మానుంచే ప్రభుత్వానికి తెలుస్తాయి. అప్పుడే ప్రభుత్వం దానిని సులభంగా పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుంది. ఈ నవ్యాంధ్రప్రదేశ్‌లో నవకాంతులు వెదజల్లాలంటే తమరి సహకారం మాకుండాలని, తప్పకుండా ఆవిధంగానే తమరు సహకరిస్తారని కోరుకుంటూ మరొక్కసారి తమకు శుభాభినందనలు తెలియజేసుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

గౌరవ సభాపతి: అచ్చెన్నాయుడు గారూ...

శ్రీ కె.అచ్చెన్నాయుడు : అధ్యక్షా, సుదీర్ఘమైన 32 సంవత్సరాల మీ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పదవులు అధిరోహించారు. అవన్నీ ఒక ఎత్తైతే, రాష్ట్రం విడిపోయిన తరువాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయిన రోజు, ఈరోజని తెలియజేస్తూ, సభానాయకుడు, సభలో ఉన్నటువంటి సభ్యులందరూ కూడా మీపై అచెంచలమైనటువంటి విశ్వాసంతో ఏకగ్రీవంగా స్పీకర్ పదవికి ఎన్నుకొన్నందుకు మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, చరిత్రలో

నిలిచిపోయే తొలి శాసనసభాపతిగా ఒక నమ్మకాన్ని, ఒక విశ్వాసాన్ని కలిగించేందుకు మీకు ఈ అవకాశం ఇచ్చిన సభానాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీరు వైద్య వృత్తిలో ఉంటూ, ఆరోజు శ్రీ నందమూరి తారకరామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టిన తరువాత, పార్టీలోనికి మిమ్మల్ని పిలిచి, మీకు సముచితమైన స్థానమిచ్చారు. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని, మీరు అంచెలంచెలుగా ఈ స్థానానికి రావడం, చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తూ, మీరు ప్రభుత్వంలో అనేకమైన పదవులు నిర్వహించడమే కాకుండా, 30 సంవత్సరాల పైగా ఈ సభలో ఉండి, సభను ఏవిధంగా నడపాలి, సభను ఈ దేశంలోనేఒక అత్యున్నతమైన శాసనసభగా తీర్చిదిద్దడానికి మనందరం కృషిచేయాలి. దానికి మేము కూడా సహకరిస్తామని మీకు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, నేను కూడా ఈ శాసనసభలోనికి నాలుగవ పర్యాయము అడుగుపెట్టాను. గత మూడు పర్యాయాలు చూస్తే అనేకమైన రాజకీయ పార్టీలు ఉండేవి. ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కొక్క విధంగా ఉండేది. ఈరోజు శాసనసభలో రెండేరెండు పార్టీలున్నాయి. ఈరోజు అనేకమైన సవాళ్ళు మన ముందు ఉన్నాయి. ఈ క్రొత్త ప్రభుత్వం అనేక సవాళ్ళను ఎదుర్కోవాల్సిన ఈ పరిస్థితిలో, ప్రతిపక్షం కూడా ఒక నిర్మాణాత్మకమైన బాధ్యతను నిర్వహించాలి. ప్రతీ విషయాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా, కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని అన్నివిధాలుగా ముందుకు తీసుకువెళ్ళాలి. పరిపాలన చేయడానికి ఒక రాజధాని లేదు. నిన్నటిరోజున ఈ శాసనసభకు వస్తే, ఏంటి మన పరిస్థితి? ఇక్కడ మనమున్నామా– అని ఒకరకమైన బాధ కలిగిన పరిస్థితి. కాబట్టి, ఈరోజు ప్రతిపక్షం, అధికారపక్షం అందరం కలసి రాజకీయాలను పక్కనబెట్టి, ప్రజలు ఒక నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఇచ్చారనే విషయాన్ని గుర్తుపెట్టుకొని వ్యవహరించాల్సిన అవసరముంది. ఏ నాయకుడైతే ఈ ప్రభుత్వాన్ని పరిపాలన చేస్తాడో, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఏనాయకుడైతే ముందుకు తీసుకువెళతాడు అనే విషయాన్ని ఆలోచించి, ఒక నమ్మకంతో శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమిచ్చారు. మీరుకూడా చక్కనైన సలహాలివ్వడం ద్వారా, అందరం కలసికట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను వీలైనంత తొందరగా ఒక నిర్మాణాత్మకమైన ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయడానికి, అన్నివిధాలా, అందరూ సహకరించాలని మీద్వారా కోరుకుంటూ మీకు మరొకసారి హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేసుకుంటూ, ఏ స్పీకరూ చేయనటువంటి సంస్కరణలు చేసి, ఈ శాసనసభను ఈదేశంలోనే ఒక అత్యున్నతమైన శాసనసభగా తీర్చిదిద్దాలని కోరుతూ, దానికి ఆ భగవంతుడు మీకు అన్నివిధాలా సహకరించాలని కోరుతూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ జి.బుచ్చయ్య చౌదరిః అధ్యక్షా, మీరూ, నేను సహచరులుగా 1983లో యువకులుగా మొట్టమొదటిగా ఈ శాసనసభలో ప్రవేశించాము. సుధీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు మీరు నేర్చుకున్నారు. గుంటూరు జిల్లాలో 'పల్నాటిపులి'గా పేరు తెచ్చుకున్నారు. ఈ పదవి మీకు సంకెళ్లు వేసినట్లని భావిస్తున్నాను. ఏ సమస్యపై అయినా స్పష్టమైన విధానాలతో నిర్భయంగా మాట్లాడే మీకు, ఇటు అధికారపక్షాన్ని, అటు ప్రతిపక్షాన్ని సమన్వయం చేసుకొనే అవసరమున్నదని నేను భావిస్తున్నాను. ఇప్పటివరకు చాలా పదవులు అలంకరించారు. గుంటూరు జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరు అందించడంలో, ఎత్తిపోతల పథకాల నిర్మాణంలో మీ భాగస్వామ్యాన్ని మేము గమనించుకుంటూ వచ్చాం. సభ్యులు చెప్పినట్లుగా పవిత్రమైన కోటప్పకొండని ఏ విధంగా తీర్చిదిద్దారో మేము కళ్లారా చూశాం. తూర్పు గోదావరి జిల్లాతో మీ అనుబంధం పెనవేసుకుపోయిన విషయం మాకు తెలుసు. మూసివేసిన అల్లురామలింగయ్య హోమియో కాలేజీని పునఃప్రారంభించాలని, అనేక నిబంధనలు అడ్డువచ్చినా కాదని చెప్పి, కేంద్రం నుంచి కోటి రూపాయలు తెచ్చి ఆ కాలేజీని నిర్మాణం పూర్తి చేయించినందున వేలాది మంది డాక్టర్లు తయారై ప్రజలకు సేవ చేస్తున్నారు.

ఎన్.టి.ఆర్. ట్రస్టు, ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మీ భాగస్వామ్యం మరచిపోలేం. స్వర్గీయ ఎన్.టి.రామా రావు తలపెట్టిన ఆ కార్యక్రమాన్ని శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో, శ్రీ నందమూరి బాలకృష్ణ గారి ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ స్థాయికి తీసుకొని వెళ్లిన ఫలితంగా లక్షలాది నిరుపేదలకు ఏ విధంగా వైద్యం అందుతోందో మేము కళ్లారా చూస్తున్నాం. చావే గతి అనుకున్న వారికి మీరు ప్రాణ భిక్ష పెట్టడానికి కారకులైయ్యారు. వైద్య వృత్తిలో మీ అనుభవాన్ని జోడించి హాస్పిటల్‌ని ప్రథమ స్థాయికి చేర్చినందుకు మిమ్మల్ని అభినందించాలి.

ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక రకమైన ఇబ్బందికర, దయనీయమైన పరిస్థితులలో ఉన్నారు. స్వరాష్ట్రంలోనే కాందిశీకులుగా బ్రతకాల్సిన పరిస్థితి వస్తుంది. పునాదుల నుంచి మన రాష్ట్రాన్ని మనం అభివృద్ధి చేసుకోవాలి. దీనికి అధికారపక్షం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తారని నేను భావిస్తున్నాను. ఎందుకంటే నిర్మాణాత్మకమైన విమర్శలతో ప్రభుత్వానికి సూచించవలసిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. కేంద్రంలోని ఎన్.డీ.ఏ ప్రభుత్వం మోడీ గారి నాయకత్వంలో మనకు సహాయసహకారాలు అందించాల్సి ఉంది. గత పాలకుల తప్పుడు విధానాల వల్ల సీమాంధ్ర ప్రాంతం తీవ్రంగా నష్టపోయింది. దీన్ని సరిచేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. సభలో సక్రమంగా చర్చ జరిగి, చర్చల సారాంశాన్ని కేంద్రానికి నివేదించి సాధించుకోవలసింది చాలా ఉంది. తెలుగు జాతి ఔన్నత్యం కోసం, సీమాంధ్ర ప్రయోజనాల

కోసం మనం పాటుపడాలి. ఎందుకంటే సభలో అధికారపక్షం నుంచి, ప్రతిపక్షం నుంచి చాలా మంది యువకులులొచ్చారు.

సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ గారు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వెళ్ళారు. సభ్యులు పార్టీలు మారడం సహజమే. ఆయన భావనలు ఎలా ఉన్నా ఎవరైనా అధికారంలోకి రావాలని కోరుకుంటారు.

(సభ్యులు బుచ్చయ్య చౌదరి తన పేరు ప్రస్తావించినందున తనకు మాట్లాడే అవకాశమివ్వాలని సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ గారు గౌరవ సభాపతిని కోరారు)

తమ రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీలో మొదలుపెట్టి, మీ పార్టీలోకి చేరినవారు చాలా మంది ఉన్నారు.

(సభకు అంతరాయం)

శ్రీ జలీల్ ఖాన్ః అధ్యక్షా, సభా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వెళ్లినవారే. శ్రీ బుచ్చయ్య చౌదరి గారు కూడా నాకు తెలుగుదేశం తరఫునుంచి సీటు వచ్చేలా లేదు, మా పార్టీలోకి వస్తానని ప్రస్తావించారు. మా మధ్య చాలా సన్నిహిత సంబంధాలు, పరిచయాలున్నాయి. అంతమాత్రాన నా పేరు ప్రస్తావించడం భావ్యం కాదు. (బుచ్చయ్య చౌదరి గారిని ఉద్దేశించి) మీరు సిగ్గుపడాల్సిన అవసరముంది. ఈ శాసనసభలో మీ పక్షం నుంచి ఒక్క మైనారిటీ సభ్యుడు లేకుండా చేసుకున్న తెలుగుదేశం పార్టీని రాబోయే రోజుల్లో మైనారిటీ ప్రజలు ఊరుకోరనేది కూడా సభాముఖంగా తెలియజేస్తున్నాను.

(సభ్యులు శ్రీ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మైక్ కావాలని గౌరవ సభాపతిని కోరసాగారు)

శ్రీ జి.బుచ్చయ్య చౌదరిః జలీల్ ఖాన్ గారూ, మీరు ఎన్ని పార్టీలు మారారో మీకే తెలియదు. మీకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. మీ పార్టీలోకి వస్తానని నేను చెప్పానా? 1983లో తెలుగుదేశం జెండా రూపకల్పన నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నాను. నా రక్తం నరనరాల్లో తెలుగుదేశం పార్టీ ఉన్న విషయం మరచిపోవద్దు. పార్టీలు మార్చే దుర్గతి, సీట్లు అడగాల్సిన కర్మ నాకు పట్టలేదు. మా నాయకుడు స్వర్గీయ నందమూరి రామరావు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నేనడక్కుండానే అసెంబ్లీ సీటిచ్చారు.

స్పీకర్ ః బుచ్చయ్య చౌదరి గారూ, సబ్జెక్ట్ డీవియేట్ కానివ్వద్దండి.

శ్రీ జి.బుచ్చయ్య చౌదరిః అధ్యక్షా, సభకు అనేక మంది కొత్త యువతీయువకులొచ్చారు. వారికి చట్టాల మీద అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంటుంది. దయచేసి వారి కోసం రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించి, సభలో ప్రొసీడింగ్స్ మీద, చట్టాల మీద అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. తెలుగు బాష సరళీకృతమైంది గాని, చట్టాలు సరళీకృతం కాలేదు. సభలో బిల్లులొచ్చినపుడు చదవాలన్నా కష్టమవుతుంది. సంస్కృత పదబంధాలు ఎక్కువగా ఉండి, ఆ చట్టం ఏ విధంగా వెళుతుందో తెలియని పరిస్థితులలో కొత్త సభ్యులుంటారు. వాటిని సరళీకృతం చేస్తే బాగుంటుందని మనవి చేస్తున్నాను. మీ అధ్యక్షతన ఈ శాసనసభ సజావుగా సాగగలదని, దానికి అందరూ సహకరిస్తారని, కష్టాల్లోనున్న సీమాంధ్ర అభివృద్ధిలో ఈ సభ అనేక కఠినమైన నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి పంథాలో నడిపించగలదని, మీ సేవలు రాష్ట్రానికి ఎంతో ప్రభావితం చేయగలదని భావిస్తూ మీకు మరొక్కసారి శుభాభినందనాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.రవీంద్రనాథ్ రెడ్డిః ఈ శాసనసభ మొట్టమొదటి స్పీకర్‌గా మిమ్ములను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన మేము కూడా బలపరిచాం. ఉన్నత భావాలు కలిగిన వ్యక్తిగా, నిరాడంబరుడిగా, మంచి వ్యక్తిగా, నిక్కచ్చిగా వ్యవహరించే వ్యక్తిగా మీరు నాకు బాగా తెలుసు. మీకు రైతులంటే ఎంతో అభిమానం. తెలుగుదేశం పార్టీ రైతు రుణాలపై వాగ్దానం ఇచ్చినట్లుగా ఎటువంటి నిబంధనలు విధించకుండా రైతు రుణాలను మాఫీ చేసే విషయంలో మీరు ప్రముఖ పాత్ర వహిస్తారని భావిస్తున్నాను.

అలాగే రైతుల పట్ల మీకున్న అభిమానం నాకు తెలుసు. తెలుగుదేశం పార్టీ వాగ్దానమైన రైతులరుణ మాఫీ కార్యక్రమాన్ని మీరు ఏ కండిషన్స్ లేకుండా అమలు చేయించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని నేను భావిస్తున్నాను. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయి చాలా కష్టాల్లో వున్న ఈ తరుణంలో ఈరాష్ట్రాన్ని అందరం కలిసి తప్పకుండా అభివృద్ధి చేసుకోవలసిన అవసరముంది. అట్లాగే రాష్ట్రాభివృద్ధి గురించి మనందరం భవిషత్ తరాలకు సమాధానం చెప్పుకోవలసిన అవసరముంది. రాష్ట్రం క్లిష్ట పరిస్థితులనెదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ప్రధాన ప్రతిపక్షం తప్పకుడా నిర్మాణాత్మకమైన సలహాలనూ, సూచనలూ చేస్తుంది. కాబట్టి మీరు నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి అందరికి సమానావకాశాలు కల్పించి ఈరాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవలసిందిగా మిమ్మల్ని కోరుకుంటూ, మీరు స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మరొకసారి అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.కళా వెంకట రావుః అధ్యక్షా, 1982లో ముఖ్యమంత్రి మరియు సభా నాయకుని ఎన్నిక సందర్భంగా మీపక్కన కూర్చోవటం, తదనంతరం నేను మంత్రిగా అయిన తరువాత మీ జిల్లాకు నేను మూడు సంవత్సరాలు ఇన్‌ఛార్జ్ మినస్టర్‌గా వున్న సందర్భలోనూ తదితర పార్టీ కార్యక్రమాలలో గత అనేక సంవత్సరాలుగా ఆ రోజు నుంచి ఈ రోజు వరకు మీతో కలిసి పని చేయటం జరిగింది. ఆ స్నేహభావం రోజు రోజుకూ వెల్లివిరుస్తూ వచ్చింది. అదేవిధంగా మైసూరులో మనందరం కలిసి ఒక నెల రోజులు ఒక హోటల్‌లో వున్నప్పుడు మీరు నిర్వహించిన పాత్ర మొదలైన వాటి విషయంలో అప్పటి నుండి ఇప్పటి వరకు మీరు మాతో స్నేహ పూర్వకంగా వుండటం, సన్నిహితంగా వుండటం గుర్తుకొస్తున్నాయి. అదే విధంగా ప్రజా సేవ విషయంలో కూడా మీరు నిర్వర్తించిన పాత్ర అపూర్వం. అప్పుడున్న నాయకుడు శ్రీ ఎన్.టి రామారావు గారు కాని, ఇప్పడున్న నాయకుడు శ్రీ చంద్ర బాబు నాయుడు గారు కాని ఏవైతే బాధ్యతలు మీ మీద పెట్టారో వాటన్నిటినీ మీరు చాలా సమర్థవంతంగా చాకచక్యంగా నిర్వర్తిస్తూ వచ్చారు. అలాంటి శక్తియుక్తులు మీలో వున్నాయి. వాటిని మరింత ముందుకు తీసుకెళ్లి మీ బాధ్యతలను మీరు నిర్వర్తించి మరింత పేరు తెచ్చుకోవాలని నేను కోరుకుంటున్నాను.

విభజన అనంతరం ఏర్పడిన ఈ కొత్త రాష్ట్రానికి మీరు మొట్టమొదటి సభాపతి కావడం మా అందరికీ చాలా సంతోషదాయకం. అందుకు మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సభలో అనేక మంది సభ్యులు కొత్తగా వచ్చారు. వారిని అనేక విధాలుగా ప్రోత్సహించి వారందరికీ సరియైన మార్గదర్శకత్వం వహించి వారందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో మీరు ఎంతో తోడ్పడగలరని నేను భావిస్తున్నాను. మీకు ఈ శాసన సభ సభాపతిగా పని చేయడానికి అవకాశం కల్పించిన సభానాయకుడికి, స్పీకర్‌గా ఎన్నికైన మీకు మరొకసారి అభినందనలు తెలియజేస్తూ రాబోయేటటువంటి కొత్త రాష్ట్ర నిర్మాణంలో ఈ సభకు కూడా ఒక ప్రముఖ పాత్ర కల్పించడంలో మీరు కీలకపాత్ర పోషించాలని, మనలను అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజల యొక్క సమస్యల పరిష్కారంలో కూడా మన సభ ప్రముఖ పాత్ర పోషంచేందుకు మీరు కూడా సభాపతిగా తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తూ అందుకు గాను సభా నాయకుడికి, మీకూ మేము కూడా సభ్యులుగా మా వంతు సహాయ సహకారాలను మీకు అందజేస్తామని తెలియజేస్తూ మీకు ఈ అవకాశాన్ని కల్పిచిన ఆ భగవంతుడు మీ విధి నిర్వహణలో అవసర మైన సహాయ సహకారాలను అందించాలని కోరుకుంటూ మరొకసారి మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పాలపర్తి డేవిడ్ రాజుః అధ్యక్షా, విభజన తరువాత ఏర్పడిన ఈ రాష్ట్ర అసెంబ్లీకి తొలి స్పీకర్‌గా ఎన్నికైనందుకు మీకు మనస్ఫూర్తిగా శుభాభినందనలు తెలియజేస్తున్నాను. స్పీకర్ స్థానం యొక్క గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని మా పార్టీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారు పోటీ పెట్టకుండా మీరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి మీకు మద్దతు తెలిపినందుకు మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారికి కూడా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. గత 25 సంవత్సరాలుగా మీతో సుదీర్ఘమైన సాన్నిహిత్యం, అనుబంధం నాకుంది. మీరు మంత్రిగానూ మరియు ఎన్నో ఇతర పదవులను డైనమిక్‌గా నిర్వహించడంతో పాటు మీ బాధ్యతలను ఎంతో ధైర్యంగా మీరు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రజానీకం యొక్క సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన చరిత్ర మీకుంది. రాష్ట్ర ప్రజానీకంలో కోడెల శివ ప్రసాద రావు గారంటే ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. అదేవిధంగా ఈ రోజు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన మీరు మంచి పేరు తెచ్చుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరు ఆ స్థానంలో అధికాం పక్షం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి అందరికీ సమానావకాశాలు కల్పించి అందరి మన్ననలు పొందడమే కాకుండా రాష్ట్ర ప్రజలు మన శాసన సభను ఎల్లప్పుడూ గుర్తుంచుకునే విధంగా విధులు నిర్వహిస్తారని, ఆ విధంగా మన రాష్ట్రంలో మీరు ఒక మంచి స్పీకర్‌గా గుర్తింపు, పేరు తెచ్చుకోవాలని నేను ఆశిస్తున్నాను. ప్రజాస్వామ్య విధానం మేరకు శాసనసభలో ప్రత్తిపక్షాలకు వున్న పాత్ర గురించి సుదీర్ఘమైన రాజకీయానుభవం వున్న మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అధికార పక్షం, ప్రతిపక్షం ఇరువురికీ మీరు సభలో సమాన అవకాశాలిస్తారని ఆశిస్తున్నాను. ప్రజాస్వామ్య విధానంలో ప్రతిపక్ష పార్టీగా మేం ప్రజా సమస్యల మీద ప్రభుత్వ వైఫల్యాల మీద మాట్లాడి, వాటి పరిష్కారం కోసం కృషి చేసే అవకాశం మాకు కల్పించాలని నేను ఈ సందర్భంగా మీకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు అధికార పక్షంలో వున్నా ప్రతిపక్షంలో వున్నా రైతుల పక్షపాతిగా, పేదల పక్షపాతిగా అనేక పోరాటాలు చేసిన నాయకులుగా మాకు తెలుసు. మీరు తొలసారి స్పీకర్‌గా ఎన్నికైన ఈ సందర్భంలో నేను మా ప్రకాశం జిల్లాకు సంబంధించిన ఒక ప్రధానమైన అంశాన్ని మీ దృష్టికి తీసుకురాదలచాను. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు గౌ.చంద్ర బాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా వున్న సందర్భంలో మీరు గుంటూరు జిల్లా నుంచి మంత్రి గానూ, స్వర్గీయ గొట్టిపాటి హనుమంత రావు గారు ప్రకాశం జిల్లా నుంచి మంత్రిగానూ వున్నప్పుడు, ప్రత్యేక చొరవ తీసుకొని వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంలో నేను ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్‌గానూ, అప్పటి మార్కాపురం ఎమ్మెల్యేగా వున్న జంకె వెంకట రెడ్డి గారు ఆ కార్యక్రమంలో పాల్గొన్నాము. అయితే దురదృష్టవశాత్తూ ఆ ప్రాజెక్టు పనులకు సంబంధించిన పురోగతిని మనం చూపించలేకపోయాము. కాని మహా నేత డాక్టర్ రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయడం వలన దాదాపు 75 శాతం పనులు పూర్తి

చేయడం జరిగింది. కాని ఆయన మరణించిన తరువాత ఆ ప్రాజెక్టు పనులు నత్తనడకన నడుస్తున్న విషయం మీకు తెలియనిది కాదు. ఆ రోజున ఆ ప్రాజెక్టు శంకుస్థాపన కోసం మీరు చూపించిన చొరవను దృష్టిలో పెట్టు కొని దాదాపు 75 శాతం వరకు పూర్తయిన ఆ ప్రాజెక్టును పూర్తి చేయించడానికి ఈ రోజున మీరు స్పీకర్‌గా శ్రద్ధ చూపించాలని ఆ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే ఆ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులన్నీ కూడా లభించాయి కాబట్టి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయించడం లో కూడా మీరు స్పీకర్‌గా చొరవ చూపించినట్లయితే కరువు కాటకాలతో అల్లాడుతున్న మా ప్రకాశం జిల్లాలోని మెట్టప్రాంతాలకు ఆ వెలిగొండ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకారి కాగలదని సభా ముఖంగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. గతంలో మీరు భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా వున్నప్పుడు మా జిల్లాలోని నాగార్జున సాగర్ చివరి ఆయకట్టు భూములకు సంబంధించిన మెట్ట ప్రాంతపు రైతుల ఆందోళనల గురించి కూడా మీకు బాగా తెలుసు. కాబట్టి ఈ వెలిగొండ ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేయించడానికి మీరు స్పీకర్‌గా తగిన చొరవ,శ్రద్ధ చూపించినట్లయితే మా ప్రకాశం జిల్లాలోని మెట్టప్రాంతపు రైతులకు న్యాయం జరుగుతుంది. కాబట్టి ఆ మేరకు ప్రభుత్వానికి తగు ఆదేశాలివ్వాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. అదే విధంగా ఈ నాడు రైతుల రుణ మాఫీ గురించి ప్రభుత్వ ప్రకటన కోసం రాష్ట్ర రైతాంగ మంతా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఎలాంటి జాప్యం, షరతులు లేకుండా వెంటనే రుణ మాఫీ విషయంలో ప్రభుత్వం ఒక ప్రకటన చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మిమ్మల్ని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. మరొకసారి మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా.కె.శ్రీనివాస్ః అధ్యక్షా, మీరు సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే ఇవాళ పేరుకు మాత్రం పాత రాష్ట్రమే అయినా కొత్త రాష్ట్రంగా ఏర్పడినపుడు ఉండే సమస్యలు ఉన్నందున ప్రజలు మన నుంచి చాలా ఆశిస్తున్నారు. ఇదివరకు సభలో వేరే సమస్యలు ప్రస్తావించడంతో సభలో చర్చ సక్రమంగా జరగకపోయేది. ఇవాళ అర్థవంతమైన చర్చ మీ నాయకత్వంలో జరిగి రాష్ట్రంలోని సమస్యలు పరిష్కారం చేసి ప్రజలకు న్యాయం చేయగలరని మాకు పూర్తిగా నమ్మకముంది. మీ గురించి అందరూ బాగా మాట్లాడారు. మీరు రాజకీయాలలో చాలా సీనియర్ నాయకులు. మీరు, నేను కలిసి మెడిసిన్ చేశాం. అలాగే మీ అబ్బాయి, మా అబ్బాయి కూడా సహాధ్యాయులు కావడంతో ప్రాణ స్నేహితులయ్యారు. మీ అబ్బాయి లేకుండా తాను చదవలేనని మా అబ్బాయి చెబుతుండేవాడు. మీ అబ్బాయి కోర్సు పూర్తి అయిన తరవాత వివాహం జరిగిన కొన్ని నెలల్లోనే రోడ్డు ప్రమాదంలో చనిపోయినందున మీరు ఆ బాధను భరించలేక రాజకీయాలలో చురుగ్గా పాల్గొనలేరని, విరమించుకుంటారని నేను భావించాను. ఆ విధంగా మీరు ఎంతో బాధ

పడుతున్నా కూడా వాటి నుంచి బయటికి వచ్చి ఇవాళ ఈ స్థానంలో ఉన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ లాంటి మంచి వ్యక్తి సభాపతిగా ఉంటే బాగుంటుందని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మిమ్మల్ని సభాధ్యక్ష స్థానానికి ప్రతిపాదించడం చాలా సంతోషంగా ఉంది.

అలాగే ఇక్కడ ఉన్న సభ్యులందరికీ ఒక మనవి చేస్తున్నాను. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. అదే విధంగా కేంద్రంలో మోడీ గారి నాయకత్వంలో ఎన్డీయేకు హిమాచల్‌ప్రదేశ్ నుంచి అస్సాం వరకు ఎన్డీయేతర పార్టీల మద్దతు అవసరం లేకుండా 335 సీట్లు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంది. ఇంతకు ముందు ఏ ప్రభుత్వమూ చూపించనంతగా ఎన్డీయే ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరవాత 24 గంటలలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బహుళ ప్రయోజనకరమైన పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ ఆర్డినెన్స్ జారీ చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించింది. ఈ సభలో భారతీయ జనతా పార్టీ నుంచి నలుగురు సభ్యులమే ఉండవచ్చు కానీ మా పార్టీ కేంద్రంలో బలమైన ప్రభుత్వంగా ఉంది. ఈ రెండు పార్టీల మధ్య సత్సంబంధాలు ఉన్నందున అవశేషాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా పోయింది. ప్రపంచంలోని దేశాలలో అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా ఎన్నికలలో ఒక ప్రాంతంలో ఒక్క సీటు కూడా గెలవకుండా ఉండలేదు. మన రాష్ట్రంలో 25 పార్లమెంటు సీట్లు ఉంటే వాటిలో ఒక్క సీటులో కూడా కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. ఒక్క శాసనసభ సీటు కూడా గెలవలేదు. శాసనసభకు పోటీ చేసినవారిలో ఇద్దరికి మాత్రమే డిపాజిట్లు దక్కాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వానికి మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సత్సంబంధాలు ఉన్నాయని మోడీ గారు, చంద్రబాబు నాయుడు గారు చూపించారు. రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వానికి కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంది. సభాపతిగా మీ సహకారం సభ్యులందరికీ కావాలి. సభలో అర్థవంతమైన చర్చ జరగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరవాత ఏర్పడిన కొత్త రాష్ట్రంలోని మొట్టమొదటి శాసనసభకు మీరు స్పీకర్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. మిమ్మల్ని సభాధ్యక్ష స్థానానికి ఎంపిక చేసినందుకు

గౌరవనీయ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీకు రాజకీయాలలో సుదీర్ఘ అనుభవం ఉంది. మీరు సేవాతత్పరులు, వైద్యవృత్తిలో ఉండి ప్రజాసేవకు అంకితమై మీరు రాజకీయాలలో ప్రవేశించిన తరవాత ప్రజా సమస్యల పట్ల ఎంతో నిజాయతీతో, నిబద్ధతతో పని చేశారు. అటువంటి మీరు సభాపతిగా ఎంపిక కావడం చాలా సంతోషం. రాష్ట్ర విభజన తరవాత మన రాష్ట్రం చాలా కష్టాలలో ఉంది. మైనస్ బడ్జెట్ నుంచి మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమయంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయడానికి మీరు మాకు, సభ్యులకు తగినంత సమయం కేటాయించి సహకరించాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రస్తుత సభకు చాలా మంది కొత్త సభ్యులు ఎన్నికైనారు. కొత్త వారందరికీ కూడా కాస్త సమయం కేటాయించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి కూడా చాలా మంది సభ్యులు కొత్తగా ఎన్నికైనందున వారికి కూడా సమయం కేటాయించాలని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా దేశంలోనే మీరు మంచి పేరుప్రతిష్టలు తెచ్చుకొనేలా మీరు మంచి నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నాను. సభను సజావుగా నిర్వహించేందుకు భగవంతుడు మీరు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నా హృదయపూర్వక నమస్కారాలు, ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆర్.వెంకట సుజయకృష్ణ రంగారావు: అధ్యక్షా, తమరు సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ముందుగా తమరికి అభినందలు తెలుపుతున్నాను. తమరు చాలా అనుభవజ్ఞులు కావున అవశేషాంధ్రప్రదేశ్ నిర్మాణానికి మంచి సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా మమ్మల్ని గైడ్ చేయాలని కోరుతున్నాను. ముఖ్యంగా 2004, 2009 ఎన్నికలలో నేను శాసనసభ్యునిగా ఎన్నికైనందున ఆయా సభా సమావేశాలు ఎలా జరిగాయో ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకు కలిగింది. ముఖ్యంగా 2009 నుంచి 2014 వరకు శాసనసభలో సభా సమయం వృథా కావడంతో నాలాంటి చాలా మంది సభ్యులు శాసనసభకు వచ్చి సమయం వృ థా చేయడం కన్నా మరొక పని చేసుకుంటే మేలనే ఆలోచన వచ్చే విధంగా అప్పుడు ఉంది. అది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. శాసనసభ్యులు సభకు వచ్చే ఉద్దేశం లేని పరిస్థితి ఎపుడూ రాకూడదు. ఆ విధంగా సభా సమయం వృథా కాకుండా రాష్ట్ర పునర్నిర్మాణానికి, ప్రజల సంక్షేమానికి పాటుపడేలా ప్రతి ఒక్క సభ్యునికి కూడా మాట్లాడే అవకాశం వచ్చే విధంగా తమరు వ్యవహరించాలని కోరుతున్నాను. అదే విధంగా సభ్యులకు సభ వెలుపల కూడా కొన్ని ప్రివిలెజ్స్ ఉంటాయి. వాటిని కాపాడే విధంగా మీరు వ్యవహరించాలని కోరుతున్నాను. ముఖ్యంగా ప్రివిలెజ్ ఉల్లంఘన ప్రతిపక్ష పార్టీల సభ్యులకు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి ప్రివిలెజ్ ఉల్లంఘన జరగకుండా చూడాలని కోరుతున్నాను. మీరు సభాపతిగా ఏకగ్రీవంగా

ఎన్నికయ్యేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా తమకు మద్దతు తెలిపింది కాబట్టి మీరు సభను నిష్పక్షపాతంగా వ్యవహరించి ఈ సభా గౌరవాన్ని పెంచే విధంగా వ్యవహరిస్తారని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా, మన మనోభావాలతో సంబంధం లేకుండా జరిగిన రాష్ట్ర విభజనవల్ల వేల కోట్ల రూపాయల అప్పులు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతోబాటు లక్ష కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ప్రాంతాన్ని కోల్పోయాం. రాష్ట్ర విభజన జరిగిన తరవాత ఆంధ్రప్రదేశ్‌కు మొట్టమొదటి శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎంపికైన మీకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నాను. 30 సంవత్సరాలుగా మీతో నాకు అనుబంధం ఉంది. రాజకీయాలలోకి ఉన్నత విద్యను అభ్యసించినవారు, డాక్టర్లు, లాయర్లు రావాలని ఎన్టీ రామారావు గారి పిలుపు మేరకు గుంటూరు జిల్లా నుంచి ఆరేడుగురు డాక్టర్లు ముందుకు వస్తే వారిలో ప్రజావైద్యుడుగా గుర్తింపు ఉన్న మిమ్మల్ని శాసనసభకు పోటీ చేయించడంతోబాటు మిమ్మల్ని ఎన్టీ రామారావు గారు గుర్తించి శాసనసభకు ఎన్నికైన తరవాత మిమ్మల్ని ఎన్టీ రామారావు గారు గుర్తించి మంత్రివర్గంలోకి తీసుకొన్నారు. ఆ తరవాత మీరు కీలకమైన హోం శాఖ మంత్రిగా కూడా పనిచేసి పాలనాయంత్రాగాన్ని నడిపించడంలో చాలా అనుభవం గడించారు.

పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగా సిపిడబ్ల్యూ స్కీము ద్వారా కృష్ణా నది ఒడ్డున ఎన్నో గ్రామాలకు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆరోజు మంచి నీళ్లిచ్చిన చరిత్ర కూడా గుర్తు చేస్తున్నాను. మీరు వైద్య, ఆరోగ్యశాఖా మంత్రిగా ఉన్నప్పుడు ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ప్రాణదాత స్కీముని పెద్దయెత్తున తిరుపతిలో ప్రారంభం చేసిన, ఆ కార్యక్రమం గానీ, పౌర సరఫరాల శాఖా మంత్రిగా పేద ప్రజలందరికీ న్యాయం జరగాలని మీరు పడ్డ తపన గానీ, ఇవన్నీ గుర్తు చేస్తున్నాను. ఇరిగేషన్ శాఖా మంత్రిగా ఆ రోజు మీరు వెలిగొండ ప్రాజెక్టు గానీ, ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులను పూర్తి చేయాలనే తపన గానీ, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలనే పట్టుదల గానీ, ఖచ్చితంగా కృష్ణా డెల్టా ప్రాంతంలో క్రింది ప్రాంతంలోని రైతాంగానికి నీళ్లిచ్చే విషయంలో గానీ, నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూముల్లోని కాలువలకు నీళ్లందని పరిస్థితుల్లో రైతు కోసం రోడ్డు మీద కూర్చుని మనం చేసిన పోరాటాలు గానీ గుర్తు చేస్తున్నాను. రాయలసీమ కరువు పీడిత ప్రాంతంలో గాలేరు– నగరి గానీ, హంద్రీనీవా గానీ, పిపిఆర్ గానీ చాలా రైతాంగం సమస్యల మీద గత దశాబ్ద కాలంలో పోరుబాటలో మనం అందరం కలిసి పనిచేశాం. పేరుకు గుంటూరు జిల్లా అయినప్పటికీ కృష్ణా జిల్లా పోరాటాల్లో మీతో కలిసి పనిచేసే అదృష్టం మాకు కలిగింది. నరేంద్ర గారు గానీ, కేశవ్ గానీ, నేను గానీ, రేవంత్‌రెడ్డి గానీ, నరేందర్ రెడ్డి గానీ మీ నాయకత్వంలో అందరం కలిసి పనిచేసాం.

రామారావు గారు ఏ విధంగానైతే మిమ్మల్ని గుర్తించి అవకాశం ఇచ్చారో అదే విధంగా ఇవాళ కొత్తగా ఏర్పడ్డ ఈ ఆంధ్రప్రదేశ్‌కు తొలి సభాపతిగా చంద్రబాబు నాయుడు గారు గొప్ప నిర్ణయాన్ని తీసుకుని సభాపతిగా పనిచేసే అదృష్టాన్ని ఇచ్చారు.

అదే విధంగా గత 15 సంవత్సరాల్లోని మొదటి 5 సంవత్సరాల్లో రామకృష్ణుడు గారు స్పీకర్‌గా ఉన్నప్పుడు కౌల్ అండ్ షక్దర్ అనుసరించడం గానీ, సభా నియమాలు గానీ, చర్చలు గానీ అర్థవంతంగా ఉండేవి. గత దశాబ్ద కాలంలో కౌల్ అండ్ షక్దర్ అంటే ఏమిటో, సభా నియమాలు ఏమిటో, చర్చ అంటే ఏమిటో అర్థం కాక కొత్తగా ఎన్నికైన మాలాంటి శాసన సభ్యులు చాలా బాధపడేవారు. ఇందుకా శాసన సభకు వచ్చిందని బాధపడ్డ రోజులు కూడా ఉన్నాయి. ఇవన్నీ గమనంలోకి తీసుకుని సమయపాలన పాటించి సభా సమయాన్ని వృధా చేయనివ్వకుండా క్రమశిక్షణగా మమ్మల్ని నడిపించాలని కోరుతున్నాను.

రామారావు గారి కల కేన్సర్ హాస్పిటల్. ఆ మహానుభావుడు పేద, మధ్య తరగతికి చెందిన మనల్ని అందర్నీ ఉన్నత స్థానానికి తీసుకుని వచ్చారు. రామారావు గారు గుర్తించిన వ్యక్తులు, చంద్రబాబు నాయుడు గారు గుర్తించిన వ్యక్తులు తెలంగాణా శాసన సభలో గానీ, ఆంధ్రప్రదేశ్ శాసన సభలో గానీ మూడొంతుల మంది ఉన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నా అందరం ప్రజాసేవ కోసమే ముందుకు వెళుతున్నాం. కాబట్టి ఏదైతే రామారావు గారి కల... బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌ని దేశ విదేశాల్లో ఉన్న అందరి స్నేహితులను కలుపుకుని, నందమూరి బాలకృష్ణ గారి నాయకత్వంలో బ్రహ్మాండంగా ముందుకు వెళుతున్నది. సభాపతిగా మీరు మమ్మల్ని అందర్నీ ముందుకు నడిపించాలని, మంచి పేరు తెచ్చుకోవాలని భగవంతుడు మీకు ఆ శక్తి సామర్థ్యాలను ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, నూతన ఆంధ్రప్రదేశ్‌లో తొలి శాసన సభకు మొట్ట మొదటిసారిగా స్పీకర్‌గా ఎన్నికైన మిమ్మల్ని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. అధ్యక్షా, ఇది ఒక అరుదైన, అపురూపమైన అవకాశం. ఇది అసెంబ్లీ చరిత్రలో ఒక రికార్డుగా, మైలురాయిగా నిలిచి పోతుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఎవరు ఏ పదవికి సూట్ అవుతారో, ఏ పదవి ఇస్తే వారు చక్కగా నిర్వహిస్తారో మా ప్రియతమ నాయకులు నారా చంద్రబాబు నాయుడు గారికి తెలిసినంతగా ఎవరికీ తెలియదని, మిమ్మల్ని స్పీకర్‌గా ఎంపిక చేయడం ద్వారా మరొకసారి స్పష్టమైంది.

తమరు గుంటూరు జిల్లాలో అతి సాధారణ కుటుంబంలో జన్మించి కృషి, పట్టుదల, కర్తవ్య పరాయణత, దీక్షాదక్షతతో, నిజాయితీ, చిత్తశుద్ధితో మీరు అహర్నిశలు కృషి చేసారు.

రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగి ఒక ఉన్నత శిఖరాన్ని అధిరోహించారు. ఇప్పుడు స్పీకర్‌గా కూడా ఎంపికయ్యారు. తమరు వైద్య విద్యలో అత్యున్నతమైన ఎం.ఎస్.డిగ్రీ పొందారు. నర్సరావుపేటలో వైద్య వృత్తిని చేపట్టారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్య సహాయం చేసి అందరి ఆదరాభిమానాలు, ఆప్యాయతలను చూరగొన్నారు. తరువాత రాజకీయ రంగంలోకి ప్రవేశించి ఆరు సార్లు ఎంఎల్‌ఏగా, 14 సంవత్సరాలు మంత్రివర్గంలో పని చేశారు. ఒక డాక్టర్‌గా, శాసన సభ్యునిగా, మంత్రిగా ఏ పదవి ఇచ్చినా ఆ పదవిని అత్యంత ప్రతిభా సామర్థ్యాలతో నిర్వహించి ఆ పదవికే వన్నె తెచ్చారు. ఒక రంగంలో రాణించడమే కష్టమైన ఈ కాలంలో వైద్య రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ రెండింటిలో రాణించిన ఘనత మీకు దక్కుతుంది. ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని యావత్ భారత దేశానికే చాటి చెప్పిన మహోన్నతమైన మానవతా వాది, మహా నాయకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి అభిమానం పొందడం, ఆయనతో సన్నిహితంగా మెలగడం మీకు వచ్చిన మంచి అవకాశం, అదృష్టమని ఈ సందర్భంగా మీకు గుర్తు చేస్తున్నాను.

1999 –2004 సంవత్సరాల కాలంలో మీరు మంత్రిగా ఉన్నారు. నేను అప్పుడు శాసన సభలో ప్రభుత్వ విప్‌గా ఉన్నాను. మీలో కొన్ని లక్షణాలను నేను పరిశీలించాను, కొన్నింటిని observe చేసాను. వాటిల్లో నాకు నచ్చిన అంశాలు ఒకటి. చాలా చక్కగా, సూటిగా, నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలు వెల్లడించడంలో మీకు మీరే సాటి. ఎవరేమనుకుంటారో అని అనుకోకుండా మీ అభిప్రాయాన్ని చక్కగా చెబుతారు. రెండవది వర్క్ కల్చర్, కష్టపడి పనిచేయాలనే ఒక ఆలోచన, తపన, ఉద్దేశం, లక్ష్యం మీలో బాగా కనపడ్డాయి. మీ సిన్సియారిటీని మేమందరం గుర్తు పెట్టుకోవాలి. మూడో అంశం మీకు ఇగో లేదు. చిన్న కార్యకర్త నుంచి మంత్రి వరకు కూడా అందరితో కలిసిమెలసి ఉంటారు. మీకు అహంభావం లేదనడంలో అతిశయం లేదు. అది శాసన సభ్యులకు ఆదర్శంగా నిలుస్తుంది. ఇంకొక విషయం ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన ఉండటం కూడా ఒక అద్భుతమైన విషయం. బసవ తారకం కేన్సర్ హాస్పిటల్‌లో మా హిందూపూర్ ఎంఎల్‌ఏ తెలుగు జాతి గర్వించే అగ్ర నటుడు శ్రీ బాలకృష్ణ గారితో కలిసి అక్కడ మీకు సేవ చేసే అవకాశం కలుగడం, సేవ చేస్తుండటం కూడా అందరూ గుర్తుంచుకోవలసిన అంశము. ఈ శాసనసభలో శాసన సభ్యులకు ఒక నమ్మకం ఉంది, విశ్వాసం ఉంది, మీ మీద గౌరవం ఉంది. దేశంలోనే ఈ శాసన సభ యొక్క కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయడంలో మీరు కృషి చేస్తారనే విషయంలో ఏ మాత్రం సందేహం లేదు. కొత్తగా వచ్చిన శాసన సభ్యులకు బిజినెస్ రూల్స్ గానీ, సాంప్రదాయాలు గానీ, ఏ విధంగా సమయ పాలన పాటించాలనే విషయంలో పది రోజులో, పదిహేను రోజులో ట్రైనింగ్ ఏర్పాటు చేస్తే ఈ శాసన సభకు వన్నె తెచ్చే ప్రయత్నం చేస్తారని, ఈ పదవిని అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తారని భావిస్తున్నాను. మీకు మీ కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యం,

ఐశ్వర్యాలను ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరొక్కసారి అభినందనలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి ఉప్పులేటి కల్పనః అధ్యక్షా, నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు మీరు స్పీకర్‌గా ఒక ఉన్నతమైన పదవికి ఏకగ్రీవంగా ఎన్నిక కాబడినందుకు మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. మీరు వైద్య వృత్తి నుంచి రాజకీయ రంగంలోకి వచ్చినప్పటికీ ఆరు సార్లు ఎంఎల్‌ఏగా, దాదాపు ఏడు శాఖల్లో మంత్రిగా, అనేక దశాబ్దాల అనుభవం కలిగిన వ్యక్తిగా ఒక మంచి ప్రజా నాయకుడిగా నిరూపించుకున్నారు. అలాంటి ప్రజా నాయకుడికి ఈరోజు స్పీకర్ పదవి రావడం చాలా సంతోషంగా ఉంది. మా కృష్ణా జిల్లాకు ప్రక్కనే గుంటూరు జిల్లా వాసిగా మీకు మాతో పది సంవత్సరాల అనుబంధం ఉంది. ఒక మంచి వ్యక్తిగా, సమర్ధవంతులుగా అనేక విషయాల్లో విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తిగా మీరు ఈ పదవిలో రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాను. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ గారు, జాతిపిత గాంధీ మహాత్ముడు లాంటి అనేక మంది మహా నాయకుల స్ఫూర్తితో ఈ సభను చక్కగా నిర్వర్తించాలని కోరుకుంటున్నాను.

ఈ సభలో కేవలం 16 మంది మహిళలే ఉన్నట్లుగా భావిస్తున్నాను. గత ఎన్నో దశాబ్దాలుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడాము. గతంలో పోరాడిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉంది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి కూడా ఉంది. ఆ బిల్లు రాజ్యసభలో పాస్ కావడం లోక్‌సభలో పాస్ కాకపోవడం, ఇప్పుడు చూస్తే కేవలం 16 మంది అంటే 33 శాతం ప్రకారం చూసుకుంటే దాదాపు 56 మంది మహిళలు ఉండాల్సిన పరిస్థితి. కానీ దానిలో కేవలం మూడవ వంతు కూడా మహిళలు లేరు. గౌరవ ముఖ్యమంత్రివర్యులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కేంద్రంలో బీజేపీతో మీకు పొత్తు ఉంది కాబట్టి, ఈసారి ఖచ్చితంగా మహిళా బిల్లు పాస్ అయ్యే విధంగా ముఖ్యమంత్రివర్యులు గట్టిగా ప్రయత్నం చేయాలని, ఇక్కడ అల్పసంఖ్యాకులుగా ఉన్న మహిళలకు, ఇప్పుడే మంత్రివర్యులు పీతల సుజాత గారు కూడా చెప్పారు, మా వాయిస్ కూడా వినిపించే విధంగా, మాకు కూడా ఈ సభలో సముచితమైన స్థానాన్ని కల్పించాలని కోరుకుంటూ, గతంలో ఒక దళిత మహిళకు స్పీకర్‌గా అవకాశమిచ్చిన చరిత్ర గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఉంది. మరి నేను ప్రస్తావించవచ్చో లేదో గానీ డెప్యూటీ స్పీకర్‌గా ఒక మహిళకు అవకాశమిస్తే బాగుంటుందని మేము అభిలషిస్తున్నాను.

అదే విధంగా మీరు ఈ పదవిని ఎంతో చక్కగా నిర్వహిస్తూ ప్రతిపక్షాలకు, అధికార పక్షానికి నిస్పక్షపాతంగా పార్టీలకు అతీతంగా మా అందరికి ముఖ్యంగా మహిళలకు ఒక

పెద్దన్నగా మీరు న్యాయం చేకూరుస్తారని, చేకూర్చాలని కోరుకుంటూ మరొక్కసారి మా హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేసుకొంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ భూమా నాగిరెడ్డి : అధ్యక్షా, క్రొత్త రాష్ట్రం, మొదటి ముఖ్యమంత్రి, మొదటి ప్రతిపక్ష నాయకుడు, మొదటి స్పీకర్, క్రొత్తగా వచ్చిన సభ్యులందరం కూడా ఒక చరిత్రగా భావించాలి. ఈ రోజు మీరు ఆ కుర్చీలో కూర్చునందుకు మేమంతా గర్వంగా ఫీలౌతున్నాము. ఎందుకంటే మీ గురించి బాగా తెలుసు. తెలుగుదేశం పార్టీలో మీరు పడ్డ శ్రమ మీరు చేసిన సేవలు అన్నీ కూడా దగ్గరుండి మేము గమనించాం. మీరు కార్యకర్తలకు ఇస్తున్న ఇంపార్టెన్సు బహుశా ఏ రాజకీయ నాయకుడు కూడా ఇవ్వరని చెప్పకతప్పదు. కొన్ని సందర్భాల్లో కార్యకర్తల కోసం మీరు పదవులను కూడా ప్రక్కనబెట్టి ఆ కార్యకర్తలకు ఆ పనులు చేసేదానికి మీరిచ్చిన ప్రాథాన్యత మా అందరికీ ఆదర్శప్రాయమని తెలియజేస్తున్నాను. మేము కూడా నిజంగా చెప్పాలంటే వ్యక్తిగతంగా మీకు మేమంతా పెద్ద ఫ్యాన్స్ అధ్యక్ష. మా ప్రాంతంలో అప్పుడు ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా పార్టీని స్థాపించినప్పుడు మీ గురించి కథలు కథలుగా మా ప్రాంతంలో చెప్పుకునే వారు. అవన్నీ కూడా విన్నప్పుడు నాయకుడంటే ఇలా ఉండాలని ఆదర్శంగా తీసుకున్న వ్యక్తుల్లో నేనొకడిని.

మొన్న జరిగిన ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమాణ స్వీకారానికి చాలా గ్యాప్ ఉన్నది. తెలుగుదేశం పార్టీ నుండి ఎవరు ఎమ్మెల్యేలుగా గెలిచారని లిస్ట్ చూస్తున్నప్పుడు మా అందరికీ ముఖ్యంగా నాకు కనిపించింది మీరే అధ్యక్ష. చాలా సీనియర్‌గా ఆ పార్టీలో ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో మీ పేరు ఉంటుందని మేము అశించాము. కానీ మాకు ఒకరకంగా బాధకరంగా ఉన్నప్పటికీ కొంత ఆశ్చర్యం కూడా కలిగింది. మీరు ఆ మంత్రివర్గంలో లేరు అనే విషయం చూసి. తర్వాత ఇప్పుడు మీరు ఆ కుర్చీలో ఏకగ్రీవంగా ఎన్నికైనప్పుడు మా అందరి మనస్సులను చంద్రబాబునాయుడు గారు దోచుకున్నారని చెప్పకతప్పదని మనవి చేస్తున్నాను. ఎందుకంటే ఒక మంచి వ్యక్తిని ఈరోజు స్పీకర్‌గా మా ముందు ఉంచారు. మరి జగన్ మోహన్ రెడ్డి గారికి కూడా ప్రత్యేకమైన ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఒక మంచి వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి మాకు అవకాశం వచ్చినందుకు మేము కూడా ఆనందంగా ఉన్నాము. ఇకపోతే కొందరికి పదవుల వల్ల పేరు ప్రఖ్యాతలు వస్తాయి, కొందరు ఆ పదవులకు పేరు ప్రఖ్యాతలను తీసుకొచ్చేవారుగా ఉంటారు. మీరు ఆ రెండవ కోవకు చెందిన వారు అధ్యక్ష.

మీరు సాధారణంగా రూలింగ్ పార్టీ నుండి వచ్చినప్పుడు స్పీకర్‌గా ఉన్నప్పుడు మీ ఇబ్బందులు మీకు ఉంటాయి. మేము ప్రతిపక్ష హోదాలో ఉండి సమానంగా మమ్మల్ని కూడా

చూసుకోండని అడిగేది భావ్యంకాదేమో.. అటువైపు 60 శాతం చూస్తే ఇటువైపు 40 శాతం చూడాల్సిందిగా మేము కోరుతున్నాను. ఎందుకంటే పెద్దగా ఆశించడం లేదు. 40 శాతం మా మీద దృష్టి పెడితే మా పనులను మేము చేసుకోవడానికి సులభంగా ఉంటుందని మనవి చేస్తున్నాను. చాలా మంది సభ్యులు మాట్లాడుతూ ఈ అసెంబ్లీలో రెండు పార్టీలే ఉన్నాయని మాట్లాడారు. అచ్చంనాయుడు గారు అలాగే మా నాయకుడు మాట్లాడేటప్పుడు కూడా రెండు పార్టీలు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ మూడు పార్టీలు ఉన్నాయనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. గౌరవ బీజేపీ నాయకులకు ఒకే ఒక్క విన్నపాన్ని చేస్తున్నాను. ఇప్పుడే మీ పరిస్థితి ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచన చేసుకొని మీరు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా బీజేపీ నాయకులను కోరుతున్నాను. థ్యాంక్యూ.

శ్రీ పితాని సత్యనారాయణః అధ్యక్షా, నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి సభాపతిగా ఎన్నికైనందుకు సీమాంధ్రప్రజల తరపున నా తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను. ప్రజాస్వామ్యాన్ని కలిగిన ఈ దేశంలో ఈ రాష్ట్రంలో అత్యున్నత స్థానానికి ఎదిగిన మీకు మరొకసారి హృదయపూర్వకమైన అభినందనలను తెలుపుతున్నాను. ఈ రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువల్ని కాలరాసిన పరిస్థితులను మనం చూశాం. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను, ఈ రాష్ట్ర విభజన జరగకూడదని ఆలోచన చేసి అనేక తీర్మానాలను చేసినా కూడా, ఏదైతే పార్లమెంటు యొక్క అత్యున్నత విలువలను కాపాడాలని పార్లమెంటు వెధవరాలునని మనం మాట్లాడుకున్న పరిస్థితులను చూసి, ఏదైతే పార్లమెంటులో జరిగిన చీకటి అప్రజాస్వామ్య రాష్ట్ర విభజనకి ఆనాడు బాధపడిన మనమందరం కూడా ఈరోజు ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో చేయవలసిన తరుణంలో, మీరు ఈరోజు నూతనంగా ఎన్నికకాబడిన శాసన సభ్యుల ద్వారా ఈనాడు మీ ఎన్నికకు ప్రధానంగా సభానాయకుడు మా పార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఏదైతే ఒక సుదీర్ఘ రాజకీయాల్లో ఉండే వ్యక్తిని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా పార్టీకి అంకితమైన వ్యక్తిని మిమ్మల్ని ఎంపిక చేసినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ మోహన్ రెడ్డి గారు దానిని బలపర్చడం సుసాంప్రదాయాలకు నిదర్శనం. మొట్టమొదటగా అధికారపక్ష నాయకుడిగా చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక అభినందనలు. అలాగే జగన్ మోహన్ రెడ్డి గారికి కూడా, ఎందుకంటే ఈ ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఇరువురు మరి ఏ రకంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలనుకున్నారో అటువంటి సాంప్రదాయాలను మీరు కూడా కొనసాగించాలి, ఏదైతే చీకటి ఒప్పందంతోటి పార్లమెంటు విధానాలతోటి విభజించారో అటువంటి ప్రజాస్వామ్యం ఈ రాష్ట్రంలో కొనసాగకుండా చూడవలసిన బాధ్యత మన శాసనసభ పక్ష నేతగా మీకు ఉందనే విషయాన్ని చెబుతున్నాము.

అదే విధంగా విలువలను కాపాడటానికి నూతనంగా ఎన్నికకాబడిన శాసనసభ్యులు చాలా మంది ఈ సభలో ఉన్న విషయాన్ని మనం గమనిస్తే వారంతా కూడా ఈ సభ సాంప్రదాయాలను గానీ, పార్లమెంట్ విధానాలను గానీ కాపాడటంలో వారికి ప్రత్యేకమైన తర్ఫీదు గానీ, సభా నాయకుడిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు మీరు తమ భుజస్కందాలపై వేసుకోవాలని నేను కోరుతున్నాను. రాష్ట్ర విభజన జరిగిన తరువాత మనకు చాలా అన్యాయం జరిగింది. ఉదాహరణకు ఉమ్మడి శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి శాసనసభ భవనాన్ని కేటాయించాలి. కానీ ఎక్కడ శాసనసభ భవనాన్ని ఇవ్వకూడదో అక్కడ పాత శాసనసభ భవనాన్ని మనకు కేటాయించారు. అలాగే మంత్రుల నివాస భవనాల కేటాయింపులో కూడా మనకు అన్యాయమే జరిగింది. ముందుగా కోరుకున్న మంచి భవనాలను తెలంగాణ రాష్ట్ర మంత్రులకు కేటాయించి మరమ్మత్తులున్న క్వార్టర్లను మనకు కేటాయించి పక్షపాత వైఖరిని అవలంభించారు. వాళ్ల విధానం ఏలా ఉందంటే ఉదాహరణకు అప్పులను జనాభా ప్రాతిపదికన భరించాలి, జనాభా ప్రాతిపదికన ఉద్యోగులను విభజిస్తారు, అదే విద్యుత్ సరఫరా ఐతే యుటిలిటీ అంటారు. పరస్పర సహకారంతో ఇటు పాలకపక్షం అటు ప్రతిపక్షం ముందుకుపోతూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించాలని సభాముఖంగా కోరుతున్నాను.

అధ్యక్షా, రాష్ట్ర ప్రజల యొక్క ఆకాంక్షను నెరవేర్చే క్రమంలో ఎటువంటి భావోద్రేకాలకు లోను కాకుండా పరస్పరం సహకరించుకుంటే రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది. తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడటంలో మన సభ ప్రధాన భూమిక కావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. సభా సమయం వృధా కాకుండా కన్‌స్ట్రక్టివ్ మెజర్స్‌లో సభను నడిపించి హుందాగా ఈ వేదికను నవనిర్మాణసంద్రంగా మీరు మార్చగలరనే విశ్వాసం నాకుంది. రాజకీయాలకతీతంగా మీరు చట్ట సభలో క్రియాశీలక పాత్ర పోషించగలరనే దృఢమైన విశ్వాసం నాకుంది. తద్వారా మన రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందనే ప్రగాఢ విశ్వాసం కూడా నాకుంది. ఇందాక సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ గారు మాట్లాడిన సందర్భంలో కూడా నాకు కొంచెం బాధ కల్గింది. గత శాసనసభ సాంప్రదాయాలకతీతంగా జరిగింది. మనమంతా చూశాం. ఆనాడు శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వాన్ని దించాలనే ఉద్దేశంతో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాలు చూసినట్లైతే ఈరోజు మరొకసారి శ్రీ జలీల్‌ఖాన్ గారు మాట్లాడిన మాటలు గుర్తుకువస్తున్నాయి. అటువంటి కార్యక్రమాలు మాత్రం చేయవద్దని మేం చెబుతున్నాం. ఆరోజున ప్రదోభాలు పెట్టి ఆనాటి ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ప్రయత్నాలు చేసిన వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అటువంటి కార్యక్రమాలను మళ్లీ ఈనాడు కొనసాగించాలనే ప్రయత్నాలు చేయడం మంచిది కాదని హితవు చేస్తూ మరొకసారి ఈరోజున మీరు సభా నాయకుడిగా ఎన్నికకాబడిన సందర్భంలో ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: శ్రీ జి.వి.యస్.యస్. ఆంజనేయులు............

శ్రీ జి.వి.యస్.యస్. ఆంజనేయులు: థ్యాంక్యూ సార్...... మాట్లాడే అవకాశం కల్గించిన స్పీకర్ గారికి మొట్టమొదట ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: ఆంజనేయులు గారు దయచేసి మీరు కూర్చోండి. శ్రీ కోన రఘుపతి గారు మాట్లాడండి.

శ్రీ కోన రఘుపతి: అధ్యక్షా, మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ చట్ట సభలో మొట్టమొదటిసారిగా అడుగుపెట్టిన నాకు, నా జిల్లా వాసిగా మీకు అభినందనలు తెలియజేసే అవకాశం కల్గినందుకు ముందుగా సంతోషిస్తున్నాను. ఒక పేద కుటుంబంలో 1947వ సంవత్సరంలో జన్మించి కోడెల సంజీవయ్య, లక్ష్మీనర్సమ్మ గార్ల కుమారిడిగా మీ రాజకీయ జీవితంలో మంచి గుర్తింపు తెచ్చుకుని, అనేక పదవులు అధిరోహించి, ప్రతి పదవిలో కూడా మీ ముద్రను చూపించుకుంటూ జిల్లా అభివృద్ధి కోసం మీరు చేసిన ప్రతి కార్యక్రమం కూడా మాకందరికీ తెలుసు. ఆనాడు మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయిన తరువాత మన ఉమ్మడి రాష్ట్రానికి మొట్ట మొదటి స్పీకర్‌గా మన జిల్లా వాసి శ్రీ వెంకట్రామయ్య గారు, ఆ తరువాత నా తండ్రి గారైన శ్రీ కోన ప్రభాకర్ రావు గారు, శ్రీ వెంకటరత్నం గారు, శ్రీ నాదెండ్ల మనోహర్ గారు ఇప్పుడు మీరు సభాపతి స్థానాన్ని పొందడం అందరి అదృష్టంగా భావిస్తున్నాను. గత చరిత్ర కల్గిన మన జిల్లాను గుర్తించి మీకు ఆ బాధ్యతనప్పగించినటువంటి గౌరవ ముఖ్యమంత్రి గారికి అలాగే అందుకు సహకరించిన మా నాయకుడు శ్రీ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కొత్త రాష్ట్రం ఏర్పడింది. కొత్త రాష్ట్రంలో తొలి శాసనసభ సభాపతిగా మీరు ఆ పదవిని అలకరించడం మాకెంతో సంతోషకరం. ఆ క్రమంలో పదమూడు జిల్లాల అభివృద్ధికి మనం శాసనసభలో తీసుకునే ప్రతి నిర్ణయం కూడా అమలయ్యే విధంగా ప్రభుత్వం పైన, అధికారంలో ఉండే పార్టీకి మీరు తగిన సూచనలు, సలహాలిస్తూ, సభలో మంచి డిబెట్ జరగాలని, ఆరోగ్యకరమైన వాతావరణంలో మనం సభలో తీసుకునే ప్రతి నిర్ణయం కూడా ప్రభుత్వం అమలుచేసే విషయంలో మీరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను.

అధ్యక్షా, మన జిల్లా ప్రధానంగా వ్యవసాయపరమైన జిల్లా. జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు గురించి మీకు తెలియంది కాదు. దాదాపు 80% పూర్తయిన పరిస్థితుల్లో మిగతా 20% ప్రాజెక్టు నిర్మాణం కూడా త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని

ప్రత్యేకంగా మిమ్మల్ని కోరుతున్నాను.  అలాగే జిల్లాలోని కొండపాటూరు అభివృద్ధిలో మీరు చేసిన కృషి,, నిర్ణయం వర్ణణాతీతం. ఒక టూరిస్టు డిస్టినేషన్‌గా కొండపాటూరు ప్రాంతాన్ని అభివృద్ధి కార్యక్రమాన్ని మీరు ఆరోజున చేపట్టారు. అది చాలా సక్సెస్‌ఫుల్‌గా పూర్తికావడం జరిగింది. మన జిల్లాలోని రేపల్లె నుంచి బాపట్ల వరకు కేంద్రీకృతమైన కోస్తా తీరం ఒక అద్భుతమైన టూరిస్ట్ డిస్టినేషన్‌గా మార్చుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాని పైన కూడా మీరు ప్రత్యేకమైన దృష్టి పెడతారని నేను ఆశిస్తున్నాను. అలాగే ఈరోజున రాష్ట్రం విడిపోయిన తరువాత అగ్రికల్చర్ యూనివర్శిటీ మన ప్రాంతానికి వచ్చే క్రమంలో బాపట్ల నియోజకవర్గం నుంచి శాసనసభకు సభ్యుడిగా ఎన్నికైనటువంటి నేను ఈ సభ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి తెలియజేస్తున్నాను. ఏమిటంటే ఎంతో చరిత్ర కల్గినటువంటి బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ గురించి చాలా చెప్పాలి. దాదాపు 400 ఎకరాల విస్తీర్ణం కల్గి, అటు హోం సైన్స్ గానీ, ఇటు ఇంజనీరింగ్ కాలేజ్ మరియు ఎన్నో రిసెర్చ్ ఇన్స్టిట్యూషన్స్ కల్గినటువంటి బాపట్ల అగ్రికల్చర్ కాలేజీని యూనివర్శిటీగా కన్సిడర్ చేయాలని కోరుతున్నాను. అదే క్రమంలో మీ తోడ్పాటు కూడా ఉండాలని కోరుకుంటున్నాను.

అధ్యక్షా, సభలో ప్రతిపక్షం, అధికారపక్షం రెండూ రెండు కళ్లలాంటివని ఆ కనురెప్పగా మీరుండి రెండింటిని కాపాడుతూ, మంచి మార్గదర్శకాలివ్వాలని కోరుతున్నాను. ఆ క్రమంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి ప్రతిపక్ష సభ్యుడు చైర్మన్‌గా ఉండటం అనవాయితీ. అలాగే వివిధ రకాలైన కమిటీలు చట్ట సభల్లో ఉన్నాయి. వాటిల్లో కూడా సరైన ప్రాతినిధ్యం ప్రతిపక్షానికిస్తూ ఈ సభ చక్కగా నడిచేందుకు కృషి చేయాలని కోరుతున్నాను. 1941వ సంవత్సరంలో శ్రీ కోన ప్రభాకర్ రావు గారు శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన కాలంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ గుర్తుకువస్తున్నాయి.  పత్రికల్లో వచ్చిన మాటలను మరొకసారి ప్రస్తావించదలిచాను. ఏమిటంటే "మరొక సర్దార్ పటేల్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వచ్చినాడని" చెప్పినటు మాటలు మనకు గుర్తుకు వస్తున్నాయి. ఎన్నో కఠినమైన నిర్ణయాలు ఆనాడు వారు తీసుకునేవారు.  ఆ విధంగా మీరు  సభాపతి స్థానంలో మరింత కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవాలని కోరుకుంటూ మన గుంటూరు జిల్లా ప్రజల తరఫున, నా తరఫున, మా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరఫున మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆమంచి కృష్ణమోహన్ : అధ్యక్షా ఈ 14వ శాసనసభ ద్వారా మనకు  కొత్తగా ఏర్పాటైన ఈ రాష్ట్ర శాసనసభకు మొదటి స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మీకు ముందుగా నా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసుకుంటున్నాను. మీరు ఏ పార్టీలొ ఉన్నప్పటికీ మీలో ఉన్న స్ఫూర్తి, పోరాట పఠిమ, నిక్కచ్చిగా, నిజాయతీగా వ్యవహరించే తత్వం మీకుంది. దగ్గర, దగ్గర 60 సంవత్సరాలు వయస్సున్న మీరు కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురైన సందర్భాలలో

అర్థరాత్రైనా సరే నడిరోడ్డుపై నిలుచొనైనా సాధించుకునే తత్వం మీది. మాలాంటి కొత్తగా ఎన్నికైన మరియు కొత్తగా రాజకీయ రంగంలోకి వచ్చిన నాయకులుకు మీరు స్ఫూరిదాయకం.అధ్యక్షా, మీరు గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఉండి ప్రతిస్టాత్మకమైనటువంటి పదవులు నిర్వహించడం జరిగింది. హోం, పంచాయితీరాజ్ శాఖ కానీ ముఖ్యంగా తమకు అత్యంత ఇష్టమైనటువంటి వైద్యా , ఆరోగ్య శాఖను కూడా నిర్వహించారు. ప్రస్తుతం ఉన్నటువంటి రాష్ట్ర ప్రత్యేక పరిస్థితుల్లో అనుభజ్ఞులైన మీరు స్పీకరుగా ఎన్నికకావడం సంతోషదాయకం. తమ కుమారుడైన శివరామకృష్ణ గతంలో నా క్లాస్‌మెట్. వారి తండ్రిగారైన మీరు సభాధ్యక్షులుగా ఉండటం నాకు సంతోషదాయకం.

సహజసిద్ధంగా కోడెల శివప్రసాదరావు అనగానే వారు గంభీరంగానూ, చక్కటి పర్సనాలిటీ కలిగి ఉంటారనే నానుడి ఉంది. 1993వ సంవత్సరంలో హర్ష జూనియర్ కళాశాలలో నేను చదువుకునే రోజుల్లో అక్కడికి వచ్చిన మిమ్మల్ని చూసిన కొద్దిమందిలో నేను ఒకరిని. తోటి విద్యార్థులుతో మేము కోడెలశివప్రసాదరావు గారు అంటే చాలా సాదాసీదా వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి, మంచి పర్సనాలిటీ కలిగిన వక్తి అనుకునే వారం. అలాంటి మీరు కొన్ని వందల వేల సమస్యలున్న క్రొత్త రాష్ట్రానికి మొదటి సభాపతిగా ఎన్నికైనారు. ఈ సమస్యలకు సభద్వారానే పరిష్కారం చూసించే అనుభవమున్న మీరు సభాపతిగా ఉండటం అదృష్టం. నేను ఈ సందర్భంగా సభా ముఖంగా ఒక విషయాన్ని చెప్పతలచుకున్నాను. మీకు జీవితంలో ఎదురైన ఎన్నో ఇబ్బందుల్ని, కష్ట సుఖాలను ఎదుర్కొన్నారు, నష్టపోయారు. తమ కుటుంభంలో ఇద్దరు పిల్లలూ డాక్టర్లే. మీ రెండో అబ్బాయి రామగుండంలో డాక్టరుగా ప్రాక్టీస్ చేస్తూ రోడ్ ప్రమాదంలో మరణించారు. మేము అందరం కూడా బాధపడ్డ పరిస్థితి ఉంది. మీరు ఎన్నో ఇబ్బందులును ఎదుర్కొంటూ ప్రజాసేవలో నిలుచున్నారు. అది మాకు నిజంగా స్ఫూర్తి దాయకం.

ఈ సందర్భంగా ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకు రాదల్చుకున్నాను. గడచిన అసెంబ్లీ సమావేశాలు చూసినట్లైతే అనేక గందరగోళ పరిస్థితులు నెలకొన్న సందర్భాలు మనం చూశాం. ఒక ప్రక్క ముఖ్య మంత్రిగారు చనిపోయారు, ఒక ప్రక్క ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమాలు, మరొప్రక్క సమైక్యాంధ్ర ఉద్యమాలు జరగడం గత 13వ శాసనసభలో మనం చూశాం. మన జీవితంలో చూడనటువంటి దురదృష్టకరమైన సంఘటనలు ఈ సభలో చోటుచేసుకున్నాయి. గడచిన ఐదు సంవత్సరాలుగా మన శాసనసభ జరిగిన తీరు చాలా శోచనీయం. ఆ సభలో నేను కూడా సభ్యునిగా ఉన్నందుకు బాధ పడాల్సిన పరిస్థితి. ఒక్కరోజు కూడా సవ్యంగా జరుగలేదు. బిఏసీలో తీసుకున్న నిర్ణయం ఒకటి కాగా అందుకు భిన్నంగా సభలో సభ్యులు వ్యవరించే తీరు ఉండేది. కొత్తగా ఎన్నికైన మేము నేర్చుకుంది శూన్యమే అని చెప్పాలి. ఆ సభ, సభా

సాంప్రదాయాలను పాటించడం, గౌరవించే విధంగా జరుగలేదు. సభలో సభ్యులు ప్రత్యక్షంగా ఘర్షణ పడటం, ఒకరినొకరు చేతులు వేసి నెట్టుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. వీటన్నింటిని చూసి మా తోటి సభ్యుల్లో కొందరం ఇటువంటి సభకు వస్తేనేమి రాకుంటేనేమి, ఇటువంటి సభకు వస్తే లాబీలో కూర్చోవడమో లేదంటే సచివాలయంకు వెళ్లి ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులు చూసుకోవడమో లేదా నియోజకవర్గాల్లోకి వెళ్లి ప్రజల్ని కలుసుకోవడమో చేస్తే మంచిదని అనుకునే వాళ్లం.

ఈ సందర్భంగా తమకు విన్నవించుకునేదేమనగా ఎంతో అనుభవమున్న తమరు సభాపతిగా ఎన్నికవడం చాలా అదృష్టం. అన్నింటిని మించి అనుభవానికితోడుగా మీకు కమోండ్ చేసే శక్తి ఉంది. సభా సాంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరించబోయే సభ్యుల్ని మీకున్న అనుభం దృష్ట్యా అటువంటి సభ్యులను కనీసం ఒక దినమైనా సభనుండి భహిష్కరించాల్సిందిగా కోరుకుంటున్నాను. మన రాష్ట్రానికి అనేక సమస్యలున్నాయి. మన అదృష్ట వశాత్తు ఇకపై రాబోయే ఐదు సంవత్సరాల్లో ఎటువంటి ఎన్నికలు లేకుండా సూప్రీంకోర్టు సూచనలతో ఎన్నికల సంఘం అన్నీ స్థాయి ఎన్నికలు ఒకే సారి జరిపించి మంచిపని చేసింది. ఇకపై అన్నీ రాజకీయ పక్షాలు ఎటువంటి రాజకీయ అంశాలకు తావు లేకుండా రాష్ట్రాభివృద్ధిపైనే దృష్టి సారించి, సమస్యలపై సభలో చర్చించి సభకు సహకరించే విదంగా నడుచుకోవాలని కోరుతున్నాను. ఈ రోజు ప్రజల్లో అవేర్‌నెస్ పెరిగింది, విద్యాప్రమాణాలు పెరిగాయి. చట్టసభలో ఏం జరుగుతుంది, మన ప్రజాప్రతినిధులు ఏం చర్చిస్తున్నారు అనే విషయాల్ని స్పష్టంగా గమనిస్తున్నారు. అభివృద్ధిలో వెనుకున్న మన కొత్త రాష్ట్రం, ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధి మరచి రాజకీయాల్ని గురించి చట్ట సభల్లో మాట్లాడుకుంటే ప్రజలు అసహ్యాహించుకునే పరిస్థితి వస్తుంది.

అధ్యక్షా, ప్రత్యేకించి నామనవేమనగా ఈ సభను రాజకీయ వేదికగా కాకుండా ప్రజాసమస్యల్ని పరిష్కరించేవిదంగానూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడే విదంగాను, పార్టీలకతీతంగా సభ్యులందరూ పాటుపడాలని సభను, సభా సాంప్రదాయాల్ని గౌరవించే విదంగా సభ సజావుగా నడిపించే విదంగా ఉండాలని సభ్యులందరిని తమద్వారా కోరుకుంటున్నాను. మన రాష్ట్రం అభివృద్ధి పదంలో ముందుకు పోయే విదంగానూ, అనేక సమస్యల్లో ఉన్న మన రాష్ట్రాన్ని, అన్నీ రాష్ట్రాలతో సరిసమానంగా అభివృద్ధిచేయాలని పెద్దలు శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు సత్‌సంకల్పంతో ముందున్నారు. లోటు బడ్జెట్‌తో ఉన్న మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలనీ, వీలైనంత త్వరగా మన రాష్ట్రంలో మన ప్రభుత్వం మన ప్రజలకు అందుబాటులో ఉండాలనీ కోరుకుంటున్నాను.

చివరిగా నాదో చిన్న మనవి. మన రాష్ట్రంలో, దేశంలో చాలా వరకు ప్రజలకు అవగాహన లేదు. కల్తీమందుల విక్రయం, డ్రగ్స్ విక్రయాలపై దృష్టి సారించాలనీ, గౌరవ సభాపతిగారు సమయం, అనుభవం మరియు అందుకు అవసరమైన సమర్థత ఉన్నవారు కాబట్టి వీలైనంత త్వరగా డ్రగ్స్ మరియు కల్తీ మందుల్ని అరికట్టాలని సభాముఖంగా గౌరవ సభాపతిగారిని వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని వేడుకుంటూ, మరొక్కసారి ఈ సందర్భంగా వారికి నా అభినందనలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : నందమూరి బాలకృష్ణ గారూ...

శ్రీ నందమూరి బాలకృష్ణః అధ్యక్షా, క్రొత్తగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు తొలి సభాపతిగా ఎనుకోబడినందుకు మీకు నా అభినందనలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఆనాడు నాన్నగారు 'యువకులు, చదువుకున్నవారు, గ్రాడ్యుయేట్స్, లాయర్స్ ప్రజాసేవలోనికి రావాలి' అని ఇచ్చిన పిలుపుకి స్పందించి పార్టీలోకి వచ్చినవాళ్ళలో మీరూ ఒకరు. అలా వచ్చిన మీరు మానాన్నగారు మీమీద ఉంచిన విశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగి, ఎమ్మెల్యే నుండి వివిధ శాఖల మంత్రిగా... నీటిపారుదల శాఖ, హోం శాఖ, పంచాయితీరాజ్... ఇలా ఎన్నో శాఖలకు మంత్రిగా, ఎంతో సమర్థవంతంగా మీకు అప్పజెప్పిన బాధ్యతను మీరు నిర్వర్తించారు. అలాగే అటు రైతు పక్షపాతిగా, పేదల పక్షపాతిగా, ఒక డాక్టరుగా మీ వృత్తిని కొనసాగిస్తూ, ఎంతోమంది పేదలకు ఉచితంగా వైద్యసేవలనందిస్తూ, 'బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్'కి పూర్వ చైర్మన్‌గాను, మెంబర్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌గా, ఆసుపత్రికి అంతర్జాతీయ స్థాయిలోనే ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన వారిలో మీరూ ఒకరు. ప్రస్తుతం ఈ ఆసుపత్రికి నేను చైర్మన్‌గా ఉన్నాను. ఈరోజు మీరెంతో బాధ్యతైన బరువును మోస్తున్నారు. ఈరోజు మన రాష్ట్రం పరిస్థితి చూస్తున్నాం ... ఒక అనాథలా.... మళ్ళీ పునాదుల్నుంచి నిర్మించుకోవలసిన అవసరం ఉంది. ప్రజలు మనమీద నమ్మకంతో మనల్ని ఈనాడు ఈ శాసనసభకు పంపించడం జరిగింది. అందరం నిష్పక్షపాతంగా ఈ రాష్ట్ర అభివృద్ధికోసం కృషి చేయాల్సిన తరుణమిది. ప్రజల్లో మీకున్న వ్యక్తిగత ఇమేజ్ దృష్ట్యా, మీరు ఈ సభను ఎంతో సజావుగా, హుందాగా కొనసాగించాలని, ఆ భగవంతుడు కూడా మీకు ఆ శక్తి సామర్థ్యాలను ఇవ్వాలని కోరుకుంటూ, 'బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్' తరపున, నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రజల తరపున మీకు అభినందనలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : చింతల రామచంద్రారెడ్డి గారూ...

శ్రీ చింతల రామచంద్రారెడ్డిః అధ్యక్షా, ఆరుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికైన మీరు స్పీకర్ పదవిని చేపట్టడం చాలా సంతోషం. చాలాకాలం మంత్రిగా కూడా మీరు పనిచేశారు...

మిస్టర్ స్పీకర్ : వక్తలు ఎక్కువగా ఉన్నందున దయచేసి క్లుప్తంగా మాట్లాడవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ చింతల రామచంద్రారెడ్డిః ...అధ్యక్షా, ముఖ్యంగా ఈ రాష్ట్ర శాసనసభ చరిత్రను పరిశీలించినట్లైతే, అయ్యదేవర కాళేశ్వర రావుగారు, పిడతల రంగారెడ్డిగారు, రేబాల దశరథరామి రెడ్డిగారు, దివి కొండయ్య చౌదరిగారు, వేమారెడ్డిగారు, అగరాల ఈశ్వర రెడ్డి గారు, ప్రతిభా భారతి గారు, శ్రీపాదరావుగారు వంటి ఉద్దండులు, ఘనాపాటీలు ఈ స్పీకర్ పదవిని నిర్వహించారు. వారు ఈ పదవికి వన్నె తెచ్చారు. అలాంటి పదవికి మీరు ఈరోజు బాధ్యతలు స్వీకరించడం, మా వైఎస్సార్‌పార్టీకి కూడా చాలా గర్వకారణం. గుంటూరు జిల్లాలోనే కాదు, చుట్టుప్రక్కల కూడా ఒక మంచి సర్జన్‌గా వైద్యరంగంలో కీర్తి ప్రతిష్టలు పొందినవారు మీరు. మీకు సామాన్య ప్రజల నాడి తెలుసు. వారి కష్టాలు తెలుసు. ప్రజల వాణిని వినిపించడానికి, ప్రజల కష్టాలను వినిపించడానికి ఒక పవిత్రమైన దేవాలయం ఈ అసెంబ్లీ. ఈ అసెంబ్లీలో ప్రతిపక్షపార్టీకి తమ వాదనను, తమ వాణిని వినిపించడానికి సరైన అవకాశాలు ఇవ్వాలని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అంతేకాదు, కొత్తగా చాలామంది శాసనసభ్యులు ఎన్నికైనారు. వారందరికీ సభా సాంప్రదాయాలను, రూల్స్‌ను, వారి హక్కులను తెలుసుకునే విధంగా క్లాసులు నిర్వహించాలని నేను స్పీకర్ గారికి మనవి చేస్తున్నాను. అసెంబ్లీలో కార్యక్రమాలు ఏవిధంగా జరుగుతున్నాయి? అంటే.... శాసనసభ్యులు కొట్లాడుకుంటున్నారా? సమస్యలు తెలియజేస్తున్నారా? అని టి.వి.లలో ఇచ్చే లైవ్ ప్రసారాల ద్వారా ప్రజలు గమనిస్తున్నారు. కాబట్టి, ఈ శాసనసభలోనైనా సభ్యులందరూ హుందాగా ప్రవర్తించేవిధంగా, ముఖ్యంగా ప్రజలయొక్క సమస్యలను చర్చించేవిధంగా మీరు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని నేను మీకు తెలియజేస్తున్నాను. అంతేకాదు, మీరు మాకు ముఖ్యంగా మేము అడిగిన వెంటనే మాట్లాడే అవకాశాం ఇవ్వాలి. ఎందుకంటే మేము ఇంటివద్ద చెప్పుకొని వస్తాము... ఈరోజు కచ్చితంగా టీవీలో మేము కనబడతాము, మేము మాట్లాడతాము అని. మా భార్యాబిడ్డలంతా టీవీలు చూస్తూవుంటారు. అధ్యక్షా, మీరు గనుక అవకాశం ఇవ్వకపోతే మమ్మల్ని ఒకరకంగా అనుమానంగా, అవమానంగా చూస్తారు. దయచేసి మేము అడిగినప్పుడు మాకు అవకాశం ఇవ్వాల్సిందిగా నేను మిమ్మల్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ముఖ్యంగా, స్పీకర్ గారు ప్రజాస్వామ్యానికి ఇరుసులాంటి వారు. శాసనసభ్యుల హక్కులను పరిరక్షించడానికి, ముఖ్యంగా ప్రతిపక్ష శాసనసభ్యుల విషయంలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడకుండా, ప్రతిపక్ష శాసనసభ్యుల హక్కులను కాపాడడానికి మీరు ప్రయత్నం చేయాల్సిన అవసరముందని నేను మీకు తెలియజేస్తున్నాను. శాసనసభ్యులుగా మేము ఒక ఐఏఎస్ ఆఫీసర్ వద్దకో, ఒక ఐపిఎస్ ఆఫీసర్ వద్దకో వెళితే, మమ్మల్ని కావాలని నిరీక్షింపజేయమంటారు. మేము కూడా సుమారు రెండు లక్షలమంది ప్రజలకు ప్రతినిధులం. నియోజకవర్గ ప్రజల పనులకొరకు వివిధ సందర్భాలలో మేము సచివాలయానికి, అసెంబ్లీకి పోతుంటాము. అటువంటి సందర్భాల్లో కూడా మమ్మల్ని బయట నిరీక్షించమనడం చాలా బాధాకరమైన విషయం. కచ్చితంగా మీరు రూలింగ్ ఇవ్వండి. శాసనసభ్యులుగానీ, శాసనమండలి సభ్యులుగానీ వారి వద్దకు వెళ్ళినప్పుడు, ఐఏఎస్ ఆఫీసర్లు, ఐపీఎస్ ఆఫీసర్లు, ఆయా శాఖాధిపతులు వెంటనే అప్పాయింట్‌మెంట్ ఇచ్చి, తద్వారా శాసనసభ్యులను గౌరవించాలని ఒక రూలింగ్‌ను మీరు తప్పకుండా ఇవ్వాలని కోరుతున్నాను.

అదేవిధంగా ముఖ్యంగా మీ హయాంలో ఒక చారిత్రాత్మకమైనటువంటి నిర్ణయాన్ని తీసుకోవాలి. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు... అవి జీవోలు కావచ్చు, చట్టాలు కావచ్చు. అవన్నీ పూర్తిగా తెలుగులో ఉండే విధంగా.... తెలుగు భాషకు గౌరవం కల్పించాలంటే, మొట్టమొదటగా ఈ శాసనసభలోనే తెలుగు భాషను పూర్తిగా పాటించేవిధంగా క్రొత్త సాంప్రదాయానికి మీరు నాంది పలకండి. శాసనసభకు వచ్చే సమాచారం కావచ్చు, చట్టాలు కావచ్చు .... అది ఏమైనా కూడా అన్నీ కూడా పూర్తిగా తెలుగులోనే ఉండేవిధంగా మీరు రూలింగ్ ఇవ్వాలని నేను మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, లాస్ట్ పాయింట్ చెప్పి ముగిస్తాను. మీరు ప్రముఖ వైద్యులు. మీరు వైద్యవృత్తిని చేపట్టిన వారు. వైద్యవృత్తిలో ఉన్నటువంటి లోటుపాట్లు తెలిసినవారు. ఈరోజు ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు కాయకల్ప చికిత్స చేయాలి. ఏ ఆసుపత్రికి వెళ్ళినా కూడా, మందులు లేవంటారు. మందులుంటే వైద్యులుండరు. వైద్యులుంటే అక్కడ పరికరాలుండవు. ఈవిధమైన పరిస్థితిని నేను ప్రత్యక్షంగా అనేక ప్రభుత్వాసుపత్రుల్లో చూస్తున్నాను. చాలామంది ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందలేక, వైద్యం అందక, డబ్బులు లేకపోయినా అప్పులుచేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళుతున్నారు. మీరు ఎమ్.ఎస్.సర్జన్ చేశారు. ఎన్నో ఆపరేషన్‌లు చేశారు. ఎందరో ప్రజల ప్రాణాలను కాపాడారు. కాబట్టి, దయచేసి మొట్టమొదటిసారిగా పేద ప్రజలకు వైద్యం అందేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని తెలియజేస్తున్నాను. చాలా ఆసుపత్రుల్లో పాము కరిస్తే వ్యాక్సిన్ ఉండదు. పిచ్చికుక్క కరిస్తే వ్యాక్సిన్ ఉండదు. కనీసం దగ్గొచ్చినా, జలుబొచ్చినా కూడా చిన్న, చిన్న

మందులు కూడా లభించనటువంటి పరిస్థితుల్లో ఈనాటి ప్రభుత్వ ఆసుపత్రులు గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కునారిల్లుతున్నాయి. వీటన్నింటిని ప్రక్షాళన చేసి గాడిలో పెట్టాల్సిన అవసరముందని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు మరొకసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, మమ్మల్ని ఎన్నోమార్లు అడిగారు 'ఏందండీ, మీరు శాసనసభలో చిన్నపిల్లల మాదిరి కొట్లాడుకుంటున్నారు? మీరు హుందాగా ప్రవర్తించండి. అసలు శాసనసభ ప్రత్యక్ష ప్రసారాలు చూడాలంటే మాకు అసహ్యంగా ఉంది. ఆవేదనగా ఉంది. మేము మిమ్మల్ని గెలిపించి శాసనసభకు పంపిస్తే ... మైకులు విరగ్గొట్టడమేంది? పోడియం వద్దకు వెళ్ళడమేంది? గొడవలు చేయడమేందని అనేక సార్లు ప్రజలు నన్నడిగారు. గతంలో రెండు సార్లు శాసనసభ్యుడిగా పనిచేశాను. మూడవ సారి శాసనసభ్యుడిగా ఎన్నికైనాను. ఈ సభలోనైనా సభాసాంప్రదాయాలు పాటించి, హుందాగా, గౌరవంగా 'ఈ శాసనసభ బ్రహ్మాండంగా పనిచేసింది, భేషుగ్గా పనిచేసింది, అధికారపక్షం, ప్రతిపక్షం రెండూ కూడా సభాసాంప్రదాయాలను పాటించాయి' అనేటువంటి ఒక మెస్సేజ్‌ను, సందేశాన్ని ఈ సభ ద్వారానైనా మనం ప్రజలకివ్వాలని నేను మీద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. మరొక్కసారి మీకు ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీ రావెల కిషోర్‌బాబు గారు.

శ్రీ రావెల కిషోర్‌బాబుః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రానికి తొలి సభాపతిగా మీరు బాధ్యతలు చేపట్టిన ఈ చరిత్రాత్మక శుభ సందర్భంలో నా మనస్ఫూర్తి హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, తమరితో నాకున్న అనుబంధాన్ని కూడా జ్ఞాపకం చేసు కొంటున్నాను. ఎప్పుడు నేను మీకు తారసపడినా, ఆప్యాయతతో, ప్రేమతో ఏమమ్మా బాగు న్నావా అన్న మీ పిలుపు ప్రేమ, ఆప్యాయతల్ని గుర్తు చేస్తున్నాయి. మీ ఉదార స్వభావం గాని, ప్రేమించే మనస్తత్వం.. గతంలో ఒక సందర్భంలో ''గున్నకల్లు'' అనే గ్రామంలో మీకు సన్మానం జరిగినప్పుడు ఆరోజు యువకులు కేరింతలు కొడుతూ హాయ్ కోడెల, హాయ్ కోడెల అని అరుస్తూ ఉంటే యువకుల్లో మీపై ఉన్న అభిమానం, ఆదరణ, మీ ద్వారా పొందిన స్ఫూర్తి, ధైర్యం నిజంగా చాలా శ్లాఘనీయం అనిపించింది. గుంటూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది యువకులకు ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ యువ కార్యకర్తలకు మీరెంతో స్ఫూర్తినిచ్చారు. అంతేగాకుండా ఈ సందర్భంలో స్వర్గీయ శ్రీ బాలయోగి గురించి కూడా ఒక మాట చెప్పాలి. వారు మాకంటే ముందు ఆంధ్రా యూనివర్సిటీలో చదువు

కున్నారు. అమలాపురంలోని ఒక మారుమూల గ్రామంలో పుట్టిన దళిత యువకుడు శ్రీ బాల యోగి గారు. స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు స్థాపించిన పార్టీ, తెలుగుజాతి ప్రజల అభివృద్ధి, ఆత్మగౌరవం అనే అంశాల మీద వారు స్థాపించిన పార్టీలో బాలయోగి గారు చేరి అంచలంచెలుగా ఎదిగి, గౌరవ ముఖ్యమంత్రిగారు శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి ఆశీస్సులతో ఈ భారతదేశంలోనే లోక్‌సభ స్పీకర్‌గా అత్యున్నతమైన స్థానానికి ఎదిగారు. ఆ ఘనత, ఉదారస్వభావం కలిగిన మా నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికే దక్కింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక దళిత మహిళకు స్పీకర్ పదవి ఇవ్వాల్సి వచ్చింది. అలాగే ఆయనదగ్గర నేను అంతరంగిక అధికారిగా పనిచేసే సందర్భంలో "Speaker is the one, who speaks less and allow others to speak more" అనే సూత్రాన్ని వారు పాటించి, భారతదేశంలోనే మంచి లోక్‌సభ స్పీకర్‌గా పేరు సంపాదించుకున్నారు. అటు ప్రతిపక్షం, ఇటు అధికారపక్షం వాళ్ల ప్రేమను, ఆప్యాయతలను చూరగొన్నారు. అలాంటి స్నేహితులే మీకు కావలసినవారు. ఈ విషయం గుర్తొచ్చి ఈ సందర్భంలో చెప్పాను. మీరు కూడా ఈ అత్యున్నతమైన స్పీకర్ పదవికి న్యాయం చేకూరుస్తారనే నమ్మకం ఉంది. సుదీర్ఘమైన పరిపాలనా అనుభవం, రాజకీయ అనుభవం, మీరు చూపే ప్రేమ, ఆప్యాయతలు అన్నీ కూడా మహోన్నతమైన, ఉత్కృష్టమైన మూర్తిమత్వం. ఇవన్నీ కూడా తప్పకుండా ఈ పదవికి వన్నె తెస్తాయని తెలియజేస్తున్నాను.

చివరిగా, మా నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఇవాళ ఒక మహా యజ్ఞాన్ని మొదలుపెట్టారు. ఆ యజ్ఞం కొత్తరాష్ట్రం సమస్యల సుడిగుండం నుంచి తప్పించి, బయటపడవేసి, ఒక నవ్యాంధ్రప్రదేశ్‌ను, ఒక నూతన స్వర్ణాంధ్రప్రదేశ్‌ను పునాదులతో సహా నిర్మించటానికి ఆయన కంకణం కట్టుకున్నారు. ఈ యజ్ఞం కేవలం వారి ఒక్కరితో పూర్తి కాదు. ప్రతిపక్షం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఈ యజ్ఞాన్ని పూర్తిచేయటానికి సహకరించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఒకప్పుడు బ్రిటిష్‌వాళ్లు మన దేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు గాంధీగారి నాయకత్వంలో, స్వాతంత్ర్య పోరాటంలో కుల, మత, ప్రాంత, వర్గ విచక్షణ లేకుండా భారతీయులందరూ కదంతొక్కి, అందరూ కలిసి పని చేసి, త్యాగాలు చేసి, పోరాటాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చుకున్నారు. అలాంటి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి, చైతన్యం, పట్టుదల, దీక్ష తెలుగుజాతికి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఉండాలని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే, ఈ మహాయజ్ఞంలో ఇది ఒక ఉద్యమంలా భావించి, రాజకీయాలకు, మతాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా అందరూ కలిసి ఈ మహాయజ్ఞంలో పాల్గొనాలి. అందుకు ఈ శాసనసభలో మంచి చర్చ జరగాలి. అంతేగాకుండా ప్రజలందర్నీ ఈ అభివృద్ధిలో పాలుపంచుకోవాలి. అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ కలిసి మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు చేపట్టిన ఈ

మహాయజ్ఞాన్ని పూర్తిచేయడానికి సభాపతిగా మీ ఆధ్వర్యంలో ఈ సభను సజావుగా నడిపించి నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో చరిత్రాత్మక పాత్రను పోషిస్తారని విశ్వసిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, నమస్కరిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీ వి.వి. శివరామరాజు గారు.

శ్రీ వి.వి. శివరామరాజుః అధ్యక్షా, నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కి మీరు స్పీకర్‌గా ఎన్నికైనందుకు మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో శాసనసభ అధిపతిగా మిమ్మల్ని నియమించినందుకు మా నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు వైద్య వృత్తిని చేపట్టి పేదలకు ఎంతో సేవ చేశారు. తర్వాత పేదల కోసం ఎన్నో వీధి పోరాటాలు చేసి వారికి అండగా నిలబడ్డారు. తర్వాత రాజకీయంలో ఉన్నత పదవులు అధిరోహించి, ఎన్నో శాఖలను సమర్ధవంతంగా నిర్వహించి ఆదర్శప్రాయులుగా ఉన్నారు. గత పది సంవత్సరాలుగా పోరాటాలు జరిగినప్పుడు ప్రతీ పోరాటంలో మీరు ముందున్నారు. ప్రత్యేకించి రైతుల పోరాటంలో పాల్గొని వారికి అండగా ఉంటూ, మాలాంటి యువకులకు మీరు స్ఫూర్తిగా నిలబడ్డారు. సీమాంధ్ర ప్రజలందరూ కూడా సమాఖ్యంగా ఉండాలని పోరాటం చేసినప్పుడు మీరు ముక్కుసూటిగా చెప్పాల్సిన విషయాన్ని చెప్పి, మా అందరికీ ఆదర్శంగా ఉన్నారు. ఈ రోజు రాష్ట్రం విడిపోయి, మనం కొత్త రాష్ట్రంగా ఏర్పడి సమస్యల సుడిగుండంలో ఉన్నాం. మన నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు రాష్ట్రాన్ని పునఃనిర్మించాలని, అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్లాలని, నిధుల కొరత ఉన్నప్పటికీ దానిని ఎలా అధిగమించాలనే ఒక పట్టుదలతో ఉన్నారు. ప్రజలందరూ కూడా శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉండి ఈ సమస్యలను తీర్చగలుగుతారనే నమ్మకంతో ఉన్నారు. అదేవిధంగా శాసనసభలో ఉన్న సభ్యులందరూ కూడా ప్రజల సమస్యలను తీర్చాలి. నీతివంతమైన, సమర్ధవంతమైన పాలన ఇవ్వాలని, సభ్యులందరం కూడా పట్టుదలతో ఉన్నాం. సభాపతిగా మీ ఆధ్వర్యంలో మేమంతా ప్రజల సమస్యలను తీర్చడానికి ఎంతో ఉవ్విళ్లూరుతున్నాం. ఈ సమస్యలన్నిటినీ ప్రెజెంట్ చేసే సమయంలో ఎవరూ కూడా వ్యక్తిగతంగా వెళ్లకుండా, ప్రజల సమస్యలు తీర్చడానికి, ప్రజల సమస్యలు ప్రొజెక్ట్ చేయడానికి, ప్రజలకు ఉపయోగపడే చట్టాలు చేయడానికి మీరు అనుభవజ్ఞులు కాబట్టి, అన్ని విషయాల పట్ల మాకు సహకరించి, మీరు సభాపతిగా మంచి నిర్వహణ చేసి, మన నవ్యాంధ్రప్రదేశ్‌లో మీరు కీలక భూమికగా ఉండి, మా అందరికీ ఆదర్శప్రాయులుగా ఉండాలని ఆకాంక్షిస్తూ, మీరు మంచి పేరు, ప్రఖ్యాతలు గడించాలని మరొక్కసారి అభినందనలు తెలియజేస్తూ, నమస్కారం చేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీ పి. శ్రీనివాసరెడ్డి గారు.

శ్రీ పి. శ్రీనివాస రెడ్డిః అధ్యక్షా, ఈరోజు చాలా శుభ దినం. సభా నాయకులు, గౌరవనీయులైన శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఐదుకోట్ల ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు నూతనంగా ఏర్పడిన ఈ ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభలో సభాపతి ఎంపికలో వారు తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మీరు సభాపతిగా ఎన్నికైనందుకు మీకు ప్రత్యేకంగా శుభాభినందనలు తెలియజేసుకొంటున్నాను.

దాదాపు 25 సంవత్సరాల నుంచి మిమ్ములను, మీ పనితనాన్ని చూస్తున్నాం. గతంలో పవిత్ర పుణ్యక్షేత్రం అయిన కోటప్పకొండకు వెళ్ళడానికి రోడ్డు దారి లేదు. మహిళలు, పిల్లలు, ముసలివారు వెళ్ళాలంటే ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పరిస్థితులలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా, మీరు మంత్రివర్యులుగా ఉన్నప్పుడు కోటప్పకొండకు దారి వేసి, దాని అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 25 సంవత్సరాల నుంచి అక్కడ మేము అన్నదాన కార్యక్రమం చేస్తున్నాం. అది ఎంతో సంతోషించతగ్గ విషయం.

మీరు డాక్టర్‌గా నరసరావుపేట ప్రజలకు ఎంతో సేవలందించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, ఐదు పర్యాయాలు మంత్రి పదవి చేపట్టిన అనుభవజ్ఞులు. మిమ్ములను ఆంధ్రప్రదేశ్‌కు తొలి శాసనసభాపతిగా నియమించినటువంటి మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎటువంటి ఎన్నిక లేకుండా సహకరించిన ప్రతిపక్ష నాయకులకు, గౌరవ సభ్యులందరకూ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేసున్నాను. ఈ సభలో రైతుల సమస్యల మీద అర్థవంతమైన చర్చలు జరిపి, రైతుల ప్రయోజనాలు కాపాడాలని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ఉమ్మడి రాష్ట్రంలోనున్న భవనాలు, ఆస్తులు పంచుకోవడం, మనకు సెక్రటేరియేట్ లేకపోవడం, గౌరవ ముఖ్యమంత్రి గారికి కూడా సరైన వసతులు లేక మంత్రుల క్యాబిన్లు కూడా సరిగా లేని పరిస్థితిలో ఇప్పుడు మనమున్నాం. 10 సంవత్సరాలు ఉమ్మడి రాష్ట్రంలో ఉండాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నప్పటికీ, వీలైనంత త్వరలో సెక్రటేరియేట్, అసెంబ్లీ, ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని, శాసనసభ్యులకు క్వార్టర్ల నిర్మాణం జరగాల్సిన అవసరముంది. మా గురించి తెలంగాణ శాసనసభ్యులు అవమానకరంగా మాట్లాడుతున్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో కచ్చితంగా ప్రతిపక్ష నాయకుల సహాయసహకారాలు మా ముఖ్యమంత్రి గారికి

ఉండాలని సవినయంగా కోరుకుంటున్నాను. ఇవన్నీ జరగాలంటే 5, 10 సంవత్సరాలలో కావు, కనీసం రెండు దశాబ్దాల కాలం పడుతుంది. ఈ 20 సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉంటేనే ఈ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యం అవుతుందని, దానికి సభ్యులందరూ సహకరించాలని సవినయంగా కోరుకుంటూ మీకు మరొక్కసారి శుభాభివందనములు తెలుపుతున్నాను.

స్పీకర్ : డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి గారూ...

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిః అధ్యక్షా, నరసరావుపేట వాస్తవ్యులైన మీకు నరసరావుపేట శాసనసభ్యునిగా, మా నియోజకవర్గ ప్రజలందరి తరపున అభినందనలు తెలుపుతున్నాను. కండ్లకుంట గ్రామంలో జన్మించి, నరసరావుపేటలో ఎంతోమంది పేద ప్రజలకు వైద్య సేవలందించి, మంచి పేరు ప్రఖ్యాతులు గడించి, ఐదుసార్లు నరసరావుపేట నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికై ఎన్నోసార్లు మంత్రివర్యులుగా పనిచేసి, పలు అభివృద్ధి పనులు చేపట్టిన మిమ్ములను శాసనసభ స్పీకర్‌గా ఎన్నుకోవడం చాలా ఆనందదాయకం. నరసరావుపేటకు ప్రత్యేక స్థానం ఉంది. 1952లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు నరసరావుపేట వాస్తవ్యులైన శ్రీ నల్లపాటి వెంకట రావు గారు స్పీకర్‌గా పని చేశారు. అదే విధంగా ఈ రోజు నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు మరలా నరసరావుపేట వాస్తవ్యులైన మీకు ఈ రోజు స్పీకర్‌గా నియమించడం చాలా ఆనందకరం.

ఒక డాక్టర్‌గా కుల, మత, ప్రాంత భేదం లేకుండా వైద్యం చేశారో, అదే విధంగా శాసనసభను కూడా పార్టీలకు అతీతంగా, సభ్యులందరికీ సమానావకాశాలు కల్పించి మంచి నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

శాసనసభను న్యాయస్థానంలాగ భావిస్తే, స్పీకర్‌ను న్యాయమూర్తిగా భావిస్తున్నాం. న్యాయమూర్తి గారు ఎంతో ఓపికతో, భావోద్వేగాలకు గురికాకుండా అధికార పార్టీకి, ప్రతిపక్ష పార్టీకి సమానంగా చూసే పాత్ర మీరు పోషిస్తారని భావిస్తూ మీకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

స్పీకర్ః కె.జోగులు గారూ. . .

శ్రీ కె.జోగులుః అధ్యక్షా, నవ్యాంధ్రప్రదేశ్‌కు మొట్టమొదటి స్పీకర్‌గా ఎన్నికైన మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. సుదీర్ఘ రాజకీయానుభవం కలిగిన మీరు, ఆరు సార్లు

ఎమ్మెల్యేగా, 14 సంవత్సరాలు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. స్పీకర్‌గా చేయాలంటే చాలా ఓర్పు, సహనం ఉండాలి. అవి మీలో ఉన్నాయి. అందుకే మీకు స్పీకర్ స్థానం వరించింది.

2004లో నేను శాసనసభ్యునిగా ఉన్నాను. ఒక్కొక్కసారి కొన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురవుతుంటాయి. అలాంటి పరిస్థితులలో కూడా మీరు సభను సజావుగా నడిపించాలి. సభలో అన్ని పక్షాలను సమానంగా చూడాలి. గతంలో శాసనసభకు వస్తే హాస్టల్ ఉండేది, కాని రాష్ట్రం విడిపోయింది కనుక సభ్యులందరూ కూడా హోటల్స్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉంది. మీరు ఆ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నాను. సభ్యులకు క్వార్టర్స్ కూడా వెంటనే కేటాయించాలని, అందరికీ సమన్యాయం చేయాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్: అధ్యక్షా, ఈరోజు వ్యక్తిగతంగా చాలా సంతోషించదగ్గ అంశం. ఎందుకంటే ఎంతో మందిని రాజకీయల్లోకి తీసుకువచ్చి వాళ్లను రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత మీకే దక్కిందని చెప్పక తప్పదు. అంతేగాకుండా ఏ అంశాన్ని తీసుకున్నా ఆ అంశం పట్ల అత్యంత శ్రద్ధతో, నిబద్ధతతో ఆ అంశం పూర్తయ్యే వరకు కూడా పోరాడే పటిమ కల్గిన వ్యక్తి మీరు. ప్రజలతో ఎల్లప్పుడు మమేకమై ప్రజల ఆశిస్సులతో సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండి ఏ పదవిలో ఉన్నా, అటు ప్రతిపక్షంలో ఉన్నా, ఇటు పాలక పక్షంలో ఉన్నా మీకంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్న వ్యక్తి మీరు. అలాంటి వ్యక్తిని ఈరోజున తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మిమ్మల్ని శాసనసభ సభాపతిగా ఎంపిక చేసుకున్నందుకు వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఒక రకంగా చెప్పాలంటే ఈరోజున సభాపతి స్థానం కత్తిమీద సాములాంటిదే. గతంలో రెండు పర్యాయాలు శాసనసభలో సభ్యుడిగా నేను ఉన్నాను. సభా సమయం ఏ విధంగా వృధా అవుతుందో మనమంతా చూశాం. ఎత్తుకు పైఎత్తు అన్నట్టుగా మనం సభలో ఎత్తులు వేసుకుంటుంటే ప్రజలు మాత్రం ప్రచార సాధనాల ద్వారా మనల్ని గమనిస్తూ ఎంత సభా సమయం వృధా అవుతుంది, ఎందుకు సమయం వృధా అవుతుంది, ఈ సభ అవసరమా అనే భావన కల్గే విధంగా ఈనాడు సమాజంలో ప్రజలు అనుకుంటున్నారు. దానికి అతీతంగా మీరు ఒక కొత్త మార్గాన్ని, కొత్త పుంతనను, కొత్త దృక్పథంతో , ఒక కొత్త ఆశయంతో సభా కార్యక్రమాలను నడపేందుకు ఆ భగవంతుడు మీకు శక్తిని ప్రసాదించవల్సిందిగా కోరుకుంటున్నాను. ఎందుకంటే ఈ రాష్ట్రం సమస్యల వలయంలో చిక్కుకుంది. సమస్యలను పరిష్కరించుకునే విధానంలో సభ్యుల యొక్క గౌరవం, సభ్యులు గర్వపడేలాగ ఈ సభ ఉండే విధంగా మీరు తీర్చిదిద్దాలి. ఆ విధంగా నడపగల్గే శక్తి మీకు ఉందని సంపూర్ణంగా విశ్వసిస్తూ ఈరోజున మీరు నూతన సభాపతిగా తొలి

రాష్ట్ర శాసనసభకు ఎంపికైనందుకు ముఖ్యంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి యామినిబాల: అధ్యక్షా, నూతన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, నూతన రాష్ట్ర తొలి శాసనసభకు తొలి సభాపతిగా ఎంపిక కాబడిన మీకు అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ ప్రజల తరఫున ఆ నియోజకవర్గపు ఎమ్మెల్యేగా ముందుగా అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నూతన రాష్ట్ర ఆవిర్భావంలో అభివృద్ధి విషయంలో ఎదుర్కోబోయే సమస్యలను ఎంతో అనుభవం గడించిన గౌరవ ముఖ్యమంత్రి గారు అధిగమించగలరని ఆశిస్తున్నాను. విజన్ 2020తో ముందుకు దూసుకుపోయే వ్యక్తిత్వం గౌరవ ముఖ్యమంత్రి గారిది. రాష్ట్రాభివృద్ధిలో గానీ, సమస్యలను పరిష్కరించే దిశలో గానీ వెనకడుగు వేయడనే భావన మాలో ఉంది. రాష్ట్ర నిర్మాణంలో మొదటి కూలీగా నేను పనిచేస్తానని చెప్పిన నిగర్వి మన గౌరవ ముఖ్యమంత్రి గారు. వారి ఆధ్వర్యంలో నూతన రాష్ట్రం పురోగతి సాధించగలదని, అపురూపంగా రాష్ట్రం తీర్చిదిద్దబడుతుందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పిస్తూ సామాజిక న్యాయంతో ఉన్నతంగా మన రాష్ట్రం తీర్చిదిద్దబడుతుందని మేమందరం నమ్ముతున్నాం. ఈ సభలో కొలువుదీరిన ఎందరో మహానుభావులున్నారు. అందరికీ నా నమస్కారాలు. నూతనంగా ఎన్నికైన సభాధ్యక్షుల వారికి మరొకసారి శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. మొట్టమొదటి సారిగా శింగనమల శాసనసభ సభ్యురాలిగా ఎన్నికైనా నాకు సభలో ప్రసంగించే అవకాశం కల్పించిన సభాధ్యక్షుల వారికి మరొకసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఎత్తైన శిఖరం ఎవరెస్ట్ శిఖరమని అంటారు. కానీ మానవత్వం కల్గినటువంటి రాజకీయ నాయకులు కూడా ఉంటారని చెప్పడానికి మన స్పీకర్ గారే ఒక ఉదాహరణ. ఏ సహాయసహకారాలు అందనటువంటి ఒక వ్యక్తి క్యాన్సర్ జబ్బుతో బాధపడుతున్నప్పుడు నేను ఒక పర్యాయం మీకు ఫోన్ చేయడం జరిగింది. పరిస్థితి వివరించిన ఐదు నిమిషాల్లోనే స్పందించి క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి వైద్య సహాయం అందించిన మానవతా మూర్తిగా మీరు చిరస్థాయిగా నిలుస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు. నిరుపేదలకు సత్వర వైద్యం అందించడంతో పాటు అన్ని విధాల సహాయ సహకారాన్ని అందించే వ్యక్తి మీరు. సభలో మాట్లాడే అవకాశం కల్పించిన మీకు మరియు మా గౌరవ ముఖ్యమంత్రి గారికి శింగనమల నియోజకవర్గ ప్రజల తరఫున, నా తరఫున మీ పాదపద్మములకు శిరస్సు వంచి నమస్కరిస్తూ శెలవు తీసుకుంటున్నాను. సభాపతి గారికి మరొకసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

శ్రీ కొడాలి వెంకటేశ్వరరావు (నాని): అధ్యక్షా, ఈరోజు నూతనంగా ఏర్పడినటువంటి నూతన రాష్ట్రానికి  మొట్టమొదటి స్పీకర్‌గా ఏకగ్రీవంగా మీరు ఎన్నికైనందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. నేను 2004-2009వ సంవత్సర మధ్య కాలంలో శాసనసభలో సభ్యుడిగా ఉన్నాను. రాష్ట్ర సమస్యల పట్ల, క్లిష్ట పరిస్థితుల పట్ల అవగాహన కల్గిన వ్యక్తిగా నేను సభలో జరిగిన అనేక చర్చల్లో పాల్గొనడం జరిగింది.  సభలో జరిగిన లోటుపాట్లను దగ్గర్నుంచి చూసిన వ్యక్తిని నేను. మీరు ఆరు పర్యాయాలు శాసనసభ్యుడిగా, పద్నాలుగు సంవత్సరాలు మంత్రిగా, ముప్పై రెండు సంవత్సరాల నుంచి తెలుగు దేశం పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా అపారమైన అనుభవం గడించిన వ్యక్తి మీరు అని చెప్పడంలో సందేహం లేదు. మీరు శాసనసభను నిష్పక్షపాతంగా అధికార పక్షాన్ని మరియు ప్రతిపక్షాన్ని రెండు కళ్లుగా భావించి అందరికి సమన్యాయం చేస్తూ, ప్రజలకు మంచి చేకూర్చే కార్యక్రమాల్లో తర తమ భేదం లేకుండా చూస్తారని మేం విశ్వసిస్తున్నాం. ఇటు ప్రతిపక్షనాయకుడైన శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారికి అటు గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఇద్దరికీ సమ ప్రాధాన్యతనిచ్చి ప్రజాసమస్యల పరిష్కారానికి గాను మీ అనుభవాన్ని జోడించి, ఇబ్బందుల్లో ఉన్న సీమాంధ్ర ప్రజలకు న్యాయం చేస్తూ  రాష్ట్రాభివృద్ధికి పాటుపడతారని నేను ఆశిస్తున్నాను.  సభలో ప్రసంగించే అవకాశం కల్పించిన మీకు మరొకసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రతిపాదనకు గౌరవ ప్రతిపక్షనేత శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారు బలపర్చడం అంతిమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు, నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి శాసనసభలో మీరు సభాపతి స్థానంలో కూర్చోవడం జరిగింది. చాలా సంతోషం. మీలాంటి సీనియర్ రాజకీయ నాయకులు, విషయ పరిజ్ఞానం కల్గినటువంటి పెద్దలు గౌరవ సభాపతి స్థానంలో కూర్చోవడం చాలా సంతోషం. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరఫున మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మీరు రాజకీయాల్లోకి రాకముందు డాక్టర్‌గా పనిచేశారు. డాక్టర్ వృత్తిలో ఉన్న సమయంలో ప్రజలు మీదగ్గరకు వైద్యం నిమిత్తం వచ్చినప్పుడు   కులాన్నో, మతాన్నో, ప్రాంతాన్నో చూడకుండా ఇంకా చెప్పాలంటే వాళ్లు వైద్య ఫీజు ఇచ్చారా, లేదా అని చూడకుండా కొన్ని వేల మంది రోగులకు మీరు వైద్యం చేసి ఉంటారు. వైద్యం అందిన వ్యక్తులు తిరిగివెడుతూ రెండు చేతులు జోడించి  మీకు ఆత్మ తృప్తితో, సంతృప్తితో  పెట్టిన దండాన్ని మీరు ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి.

అధ్యక్షా, స్పీకర్‌గా కూడా  మీరు ఈరోజున రాగద్వేషాలకతీతంగా, పార్టీలకతీతంగా చక్కటి సమయపాలన పాటిస్తూ మీరు వేసే ప్రతి అడుగు, సభ సజావుగా జరగడానికి గాను మీరు తీసుకునే ప్రతి చర్య  శాసనసభ చరిత్రలో మిగిలిపోయే విధంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే నేను హైస్కూల్ నందు విద్యాభ్యాసం చేస్తున్న 1978-79వ సంవత్సర కాలంలో మా గ్రామాల్లోనే కాదు రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో కూడా టి.వి.లు ఉండేవి కాదు. కనీసం రేడియోలు కూడా కనబడేవి కాదు. కానీ  ఒక్కో గ్రామానికి, ఒక్కో పంచాయతీకి ఒక రేడియో సౌకర్యం ఉండేది.  తద్వారా శాసనసభలో జరిగిన అంశాల గురించి, చర్చల గురించి నిత్యం ఆ కాలంలో వ్యాఖ్యానాలు వెలువడేవి.

ప్రతి రోజూ సాయంత్రం వేళ ఆ రోజు అసెంబ్లీలో జరిగిన చర్చ మీద గంటపాటు వ్యాఖ్యానం ఉండేది.  ఆరోజుల్లో మేం హైస్కూలులో చదువుకునేటప్పుడు సాయంత్రం పూట మేం చదువులను పక్కనపెట్టి ఆ గంటపాటు గ్రామ పంచాయతీ దగ్గరికొచ్చి ఆ రోజు అసెంబ్లీలో సర్దార్ గౌతు లచ్చన్న గారు, పుచ్చలపల్లి సుందరయ్య గారు, వెంకయ్య నాయుడు గారు జైపాల్‌రెడ్డి గారు ఏం మాట్లాడారని ఆసక్తిగా వినేవారం. ఇంకా చెప్పాలంటే కరీంనగర్ జిల్లాకు చెందిన లోక్‌దళ్ శాసనసభ్యుడు జనార్ధన్‌రెడ్డి గారు ఏం మాట్లాడారనేది ప్రత్యేకంగా చెవులు రిక్కించి చాలా శ్రద్ధగా వినేవాళ్లం.  ఆరోజుల్లో స్పీకర్‌గా ఉన్నటువంటి దివి కొండయ్య చౌదరి గారు, కోన ప్రభాకరరావు గారు సభను చక్కగా నడిపించేవారు. కానీ  ఇటీవల శాసనసభలో చాలా వరకు చర్చలు పక్కదోవ పడుతున్నాయి. ఎంత దారుణమైన పరిస్థితి ఉన్నదంటే ప్రజలు మనల్ని ఎన్నుకొని శాసనసభకు పంపిస్తే చర్చను పక్కదోవ పట్టించడమే కాకుండా బయటకి రా, తేల్చుకుందాం, చూద్దాం అంటున్నారు.  ప్రజలు మనల్ని ఇక్కడికి పంపించింది వారి  సమస్యల మీద చర్చించడానికే గానీ, బయట తేల్చుకునే దాని కోసమైతే మనం సభ్యులుగా ఎన్నికై శాసనసభకు రావడమెందుకు?  ఈ శాసనసభలో హుందాగా, అర్థవంతంగా చర్చ జరగాలి. అధికారపక్షంతోబాటు మంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభలో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బాగుంటుందని మా నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారు చాలా స్పష్టంగా చెబుతున్నారు. ప్రభుత్వం మంచి పనులు, ప్రజోపయోగకరమైన పనులు చేస్తే స్వాగతిస్తాం, ప్రజావ్యతిరేక చర్యలు చేపడుతుంటే దానిని వ్యతిరేకిస్తామని చెప్పారు. వారు అందించిన స్నేహహస్తాన్ని అధికారపక్షం అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులున్నందున అధికారపక్షం, ప్రతిపక్షం ప్రజలకు మేలు చేసేలా సభలో చర్చిస్తే బాగుంటుంది. చర్చల గురించి మాట్లాడాలంటే కనీసం మూడు గంటల సమయం కావాలి. అది అందరికీ తెలిసినవే. ఈ పరిస్థితుల్లో అధికారపక్షం, ప్రతిపక్షం రెండూ కలిసి ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాల్సిన అవసరముంది.  సభ్యులు వ్యక్తిగత దూషణలకు, రాజకీయ బేషజాలకు,

పంతాలకు, పట్టింపులకు పోకుండా అందరం కలసికట్టుగా పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

చాలా సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు నాయకులు తరిమెల నాగిరెడ్డి గారు ఒక మాట చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీలలో చర్చ సక్రమంగా జరగకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. ఆ మాటలను ఒకసారి గుర్తుకు తెచ్చుకొని ప్రజాసమస్యలను, ప్రాంతాల సమస్యలను సంస్కారవంతమైన రీతిలో పాటించి వ్యక్తిగత దూషణలకు దిగకుండా పద్ధతిగా ముందుకు సాగాలని తెలియజేస్తున్నాను. 1999 నవంబర్ 11వ తేదీన అప్పటి శాసనసభాపతిగా ఎన్నికైన శ్రీమతి ప్రతిభా భారతి గారిని ఆ స్థానంలో కూర్చోబెట్టిన తరవాత మీరొక సభ్యునిగా చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు. స్పీకర్ స్థానం పూలపాన్పు కాదు, స్పీకర్ స్థానం ముళ్లతో కూడిన కిరీటమని చెప్పారు. ఆ మాటలు ఇపుడు మీకు కూడా వర్తిస్తాయని తెలియజేస్తున్నాను. అంతిమంగా ఒక మాట. ఈ దేశంలో చాలా మంది రాష్ట్రపతులు అయ్యారు కానీ చాలా మంది తరచుగా చెప్పే మాట ఏమంటే ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారు రాష్ట్రపతిగా ఎలా ఉన్నారో రాష్ట్రపతి అంటే అలా ఉండాలని చెప్పారు. మీరు ఎన్ని సంవత్సరాలపాటు స్పీకర్ స్థానంలో ఉంటారో, ఆ కాలంలో మీరిచ్చే రూలింగ్‌లు, చేపట్టే చర్యలు, మీ ఓర్పు, నేర్పు, అంకితభావం, సంయమనం కూడా చరిత్రలో మిగిలిపోవాలి. దేశంలో స్పీకర్ స్థానంలో ఉన్నవారు ఎలా ఉండాలంటే ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా డా.కోడెల శివప్రసాదరావు ఎలా వ్యవహరించారో అలా వ్యవహరించాలనే విధంగా ఉండాలి. మీరు శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మనస్ఫూర్తిగా కోరుకుంటూ, వైఎస్సార్ కాంగ్రెస్ శాసనసభాపక్షం నుంచి, నా నియోజకవర్గ ప్రజల పక్షాన మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తోట త్రిమూర్తులుః అధ్యక్షా, కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి సభాపతిగా ఎన్నికైన మీకు మనస్పూర్తిగా అభినందనలు తెలియజేస్తూ, మీ ఎంపికకు కారకులైన మన నాయకుడు చంద్రబాబునాయుడు గారికి, ప్రధాన ప్రతిపక్ష నాయకులు జగన్‌మోహన్ రెడ్డి గారికి కూడా నా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఈరోజు ఈ శాసనసభకు మీరు సభాపతిగా ఎన్నిక కావడం చరిత్రాత్మకమైన సందర్భంగా నేను భావిస్తున్నాను. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, గొప్ప రాష్ట్రంగా ఉన్నందున సమైక్య రాష్ట్రాన్ని రాజకీయ స్వార్థంతో విడదీసి దిక్కులేని పరిస్థితులలోకి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెట్టేసిన పరిస్థితిలో ఎన్నికలు జరిగాయి. అనేక సమస్యలలో ఉన్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌కు ఒక దశ, దిశ నిర్దేశించవలసిన సభకు శాసనసభాపతిగా ఒక సమర్ధవంతమైన నాయకుడిగా, అనుభవమున్న వ్యక్తిగా, శాసనసభ్యుడిగా, మంత్రిగా అపారమైన అనుభవజ్ఞులైన మీరు అవగాహన, నేర్పుతో

మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవాలని మనవి చేస్తున్నాను. ఈ రాష్ట్రానికి ప్రస్తుతం చాలా ఇబ్బందికరమైన సమస్యలున్నాయి. సమైక్య రాష్ట్రంలో శాసనసభను నిర్వహించుకొన్న భవనాన్ని 119 మంది సభ్యులున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించడం, 175 మంది సభ్యులున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ భవనాన్ని శాసనసభగా కేటాయించారు. ఇక్కడున్న పరిస్థితులు చాలా అవమానకరంగా ఉన్నాయి. మీ చొరవతో సీమాంధ్రను ఒక మంచి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి మనకు కావలసిన వసతులు, వనరులు ఏర్పాటుచేసుకొనేందుకు మీరు చర్యలు తీసుకొనే విధంగా ఈ సభ ఉండాలని మనవి చేస్తున్నాను. ప్రతిపక్ష పార్టీ, అధికారపక్ష సభ్యులు చాలా మంది మాట్లాడారు. చాలా మంది పెద్దలు చెప్పినట్లు ఈ సభ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. మిత్రులు, సోదరులు నాగిరెడ్డి గారు మాట్లాడుతూ సభా సమయంలో 40 శాతం తమ పార్టీకి కేటాయించాలని చెప్పారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను బట్టి ప్రాధాన్యత ఇవ్వాలి తప్ప వాటాల ప్రాతిపదికన అవకాశం ఇవ్వడం కాకుండా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సభ ఉపయోగపడాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. మీకు ఆ భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః ప్రతి సభ్యుడు రెండు నిమిషాలలో తన ప్రసంగాన్ని ముగించాలి. నక్కా ఆనంద బాబు గారు.

శ్రీ నక్కా ఆనందబాబుః అధ్యక్షా, ధన్యవాదాలు. సుదీర్ఘ రాజకీయ జీవితం, ప్రజా జీవితంలో ఉన్న మిమ్మల్ని నూతన శాసనసభ స్పీకర్ పదవికి ఎంపిక చేసినందుకు ముందుగా మన అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. గత 25 సంవత్సరాలుగా మీతో చాలా సందర్భాలలో కలసి పనిచేశాను. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాసమస్యలపై మీరు చేసిన పోరాటాలలో కలిసి పనిచేశాను. మీరు ఈ రాష్ట్ర ప్రజలకోసం పడే తపన, పేద ప్రజల సంక్షేమం కోసం మీరు చేసే కార్యక్రమాలు ఎనలేనివి. ఈ రోజున ఈ రాష్ట్రానికి దశ, దిశ లేని పరిస్థితి. ఇటువంటి రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మాత్రమే ముందుకు వెళుతుందన్న నమ్మకంతో రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి అధికారమిచ్చారు. అటువంటి పరిస్థితిలో ఈ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్షం నిర్మాణాత్మక కృషి చేయాలి తప్ప వాటాల ప్రస్తావన తెస్తూ పబ్లిసిటీ కోసం పాకులాడకూడదు. వాటాల ప్రస్తావన మొట్టమొదటి రోజే మొదలైంది. చంద్రబాబు నాయుడు గారే మైనారిటీలకు ఉన్నతపదవులిచ్చారు. చంద్రబాబు నాయుడు గారే ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి పేరును భారత రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించారు. కులాలకు, మతాలకు అతీతంగా పనిచేసే వ్యక్తి చంద్రబాబు

నాయుడు గారికి ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తిసామర్థ్యాలున్నాయి. వారికి ప్రధాన ప్రతిపక్షం నిర్మాణాత్మక సలహాలు అందించాలి. ఆ దిశగా ఈ సభ సజావుగా నడవడంలో మీరు సంపూర్ణ విజయం సాధించాలని  భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మరొకసారి అభినందనలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జంకె వెంకట రెడ్డిః అధ్యక్షా, నూతనంగా నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి స్పీకర్‌గా ఎన్నికైనందుకు మీకు శుభాభినందనలు, శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. మిమ్మల్ని ప్రతిపాదించిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, బలపరచిన మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారికి కూడా కృతజ్ఞతలు తెలియచేస్తూ ఈ గౌరవ సభకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకు రావలసిన ఆవశ్యకత మీ మీద ఉందని తెలియచేస్తున్నాను.

మీకు, నాకు 20 సంవత్సరాల అనుబంధం ఉంది. 1984వ సంవత్సరం నుంచి 2003వ సంవత్సరం వరకూ ఒకే పార్టీలో ఉండి నర్సరావుపేట అంతర్భాగంలో మార్కాపురం నియోజక వర్గం ఉన్నప్పుడు మీరు చేసిన కృషికి, మాకు తోడ్పాటు ఇచ్చినందుకు అభినందనలు. ఆరోజు  ఇండిపెండెంట్‌గా గెలిచి పదవ అసెంబ్లీలో సభ్యుడిగా ఉన్న నన్ను మీరు పార్టీలోకి ఆహ్వానించారు.  మొట్టమొదటిగా నీటిపారుదల శాఖామాత్యులుగా ఉన్న మీరు మాకు వెలుగొండ ప్రాజెక్టు కావాలి, మూడు జిల్లాల ముచ్చటైన కోరిక అది అని ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజక వర్గం నుంచి ఇండిపెండెంట్‌గా ప్రజలు పంపించిన బక్కరైతుల ప్రతినిధిగా నేను ఆనాడు శాసన సభ్యునిగా మాట్లాడినప్పుడు మీరు నవ్వి ముఖ్యమంత్రి గారితో చర్చించి, విశ్లేషించి మీరు ఆనాడు తేది. 05.03.1996న శంఖుస్థాపన చేయించారు. తరువాత దానిని పూర్తి చేయలేక పోయినా తరువాత చేస్తామని చెప్పారు. దానికి ఇప్పుడు అటవీశాఖ అనుమతులు వచ్చాయి. ఇప్పుడు దానిని పూర్తి చేయాల్సిన బాధ్యత మీ మీదుంది.

హోంశాఖా మంత్రిగా మీరున్నప్పుడు నియోజక వర్గంలో కొన్ని క్లిష్ట సమస్యలు వచ్చినప్పుడు మీరు ఎన్నో సమస్యలను పరిష్కరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులుగా ఉన్నప్పుడు కృష్ణా జలాలను సాగర్ నుంచి జూపాడు మీదుగా తీసుకు వచ్చి మా నియోజక వర్గంలో మంచినీటి సమస్య తీర్చిన ఘనత మీదే. అలాంటి మీరు ఈరోజు మొట్ట మొదటిగా నవ్యాంధ్రకు తొలి స్పీకర్‌గా ఎన్నికైనందుకు, ఒక మెట్టు పైకి ఎక్కినందుకు మా నియోజక వర్గ ప్రజల తరఫున మీకు శుభాకాంక్షలు తెలియచేస్తూ శుభాభినందనలు తెలియచేస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు గడించి గత అసెంబ్లీ స్పీకర్ల కంటే కూడా ఘనమైన చరిత్ర తీసుకు వస్తారని మిమ్మల్ని కోరుకుంటున్నాను. మీరు ఎల్లవేళలా నియోజక వర్గ ప్రజలకు ఈ సాంప్రదాయ సిద్ధమైన గౌరవాన్ని తీసుకు వస్తారని ఎల్లవేళలా మీకు అధికార, ప్రతిపక్షాలు

రెండూ రెండు కళ్లలాంటివి. ఆ కళ్లను సమానంగా చూస్తారని కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు.

శ్రీ ఎస్.వి.మోహన్‌రెడ్డిః అధ్యక్షా, నవ్యాంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటి శాసన సభకు స్పీకర్‌గా ఎన్నికైనందుకు మీకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మొదటి నుంచీ మా కుటుంబంతో మా నాన్నగారితో గానీ, శోభానాగిరెడ్డి గారి కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉండే మీరు ఆ స్థానంలో కూర్చున్నందుకు నిజంగా చాలా సంతోషంగా ఉంది. అంతే కాకుండా మొట్ట మొదటిసారిగా ఎన్నికైన శాసన సభ్యులం అందరం సంతోష పడుతున్నాం. ఎందుకంటే ఈరోజు శాసన సభ్యుల్లో మొట్ట మొదటి సారిగా ఎన్నికైనటు వంటి మా శాసనసభ సభ్యులందరికీ కూడా సముచితమైన అవకాశం ఇచ్చి మాకు ఈ శాసన సభలో మంచి తర్ఫీదు ఇచ్చి ఒక నాయకుడి లాగా తయారు చేయడానికి మీరు అవకాశం కల్పిస్తారని నూతనంగా ఎన్నికైన శాసనసభ సభ్యులందరికీ ఆశ ఉంది. సంతోషంగా కూడా ఉంది.

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మీరు నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చిన నాయకులు మీరు. మీరు హెల్తు మినిస్టర్‌గా ఉన్నప్పుడు పత్తికొండలో నేను ఒక హెల్తు క్యాంపును 120 మంది డాక్టర్లతో కండక్ట్ చేయడం జరిగింది. మీరు హెల్తు మినిస్టర్‌గా ఆ క్యాంపు ఇనాగరేషన్‌కు రావడం చాలా గొప్ప విషయం. ఆరోజుల్లో జూనియర్ డాక్టర్లందరూ స్ట్రైక్ చేస్తున్నారు. చాలా గొడవగా ఉన్నది. మంత్రి గారు వస్తే ఆయన కారు మీద మేము దాడి చేస్తామని వాళ్లు అనౌన్స్ చేసినప్పటికీ మారుమూల ప్రాంతం అయినప్పటికీ మా మీద ఉండే అభిమానంతో ఆరోజు ఆ క్యాంపు ఇనాగరేషన్‌కు రావడం మేము ఎప్పటికీ మరచిపోలేమని తెలియచేసుకుంటున్నాను.

గత శాసన సభలో అనేక పరిస్థితులు చూసాము. నేను కౌన్సిల్‌లో మెంబరుగా ఉన్నప్పుడు చాలా మంది మంత్రులు అసెంబ్లీలో వాళ్లకు క్వశ్చన్స్ లేకుండా, బిజినెస్ లేకుండా ఉండటం వలన మంత్రులు వచ్చి కౌన్సిల్‌లో కూర్చునేవారు. శాసన సభ సవ్యంగా జరగడం లేదు కాబట్టి మాకు పని లేదు కాబట్టి ఇక్కడకు వచ్చి కూర్చుంటున్నామని మంత్రులు చెప్పడం జరిగింది. ఆరోజు ఎన్నికైన కొత్త శాసన సభ్యులు కూడా శాసన సభ అర్ధ గంట కూడా జరగడం లేదు మేము ఎందుకు శాసన సభకు ఎన్నికైనామో మాకు అర్ధం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన పరిస్థితి ఉండేది. అటువంటి పరిస్థితి లేకుండా శాసన సభను సవ్యంగా, సమయ పాలన పాటించేలాగా మీరు నడుపుతారని సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రతిపక్ష పార్టీకి సముచిత సమయం ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను. ఎందుకంటే ప్రజా సమస్యలు గానీ, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బందికరమైన సమస్యలు ప్రస్తావించేందుకు గాను ముఖ్యంగా ఎక్కువ

సమయం ఇవ్వాల్సింది ప్రతిపక్ష పార్టీకి అనే విషయం మీకు తెలియనిది కాదు. కాబట్టి ప్రతిపక్ష పార్టీకి ఎక్కువ సమయం ఇచ్చి ప్రజా సమస్యలను ఈ శాసన సభలో ప్రతిబింబించే విధంగా మీరు ప్రతిపక్షానికి అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాము.

ఈరోజు అధికార పక్ష పార్టీకి సంఖ్యాబలం చాలా ఉంది. వారి సంఖ్యా బలం ఎక్కువ వుంది కాబట్టి ప్రతిపక్ష పార్టీగా మా మీద ఎక్కువ దాడులు చేసే అవకాశం ఉంది. వారి సంఖ్యాబలాన్ని నిలువరించి ఎక్కువ అవకాశం ప్రతిపక్ష పార్టీకి ఇచ్చి ప్రతిపక్ష పార్టీ హక్కులను కాపాడాలని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను. చివరిగా గతంలో స్పీకర్‌గా పనిచేసిన వాళ్లు ఈ రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటి శాసన సభకు స్పీకర్‌గా ఎన్నికైన మీరు భవిష్యత్తులో రాబోయే అందరి స్పీకర్లకు ఆదర్శవంతమైన సభాధ్యక్షులుగా రూలింగ్ చేయాలని కోరుకుంటూ గతంలో రెండవ స్పీకర్‌గా ఉన్న వ్యక్తి బి.వి.సుబ్బారెడ్డి గారు ఉప ముఖ్యమంత్రి కావడం జరిగింది. అలాగే గత శాసన సభలో స్పీకర్‌గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి గారు మధ్యలో ముఖ్యమంత్రి కూడా అయ్యారు. అలాగే తెలుగుదేశం పార్టీలో మీకు కూడా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కదిరి బాబూరావుః అధ్యక్షా, నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మీరు గౌరవనీయులైన నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో స్పీకర్‌గా ఎన్నిక కావడమనేది చాలా అభినందనీయము. మీకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

నేను 2004వ సంవత్సరంలో దరిశిలో ఎంఎల్ఏగా నిలబడ్డప్పుడు నేను నాన్‌లోకల్ అని స్థానిక తెలుగుదేశం పార్టీ సపోర్ట్ చేయకుండా ఉంటే మీరు అక్కడకు వచ్చి వాళ్లందర్నీ కాంప్రమైజ్ చేసారు. ఆరోజు నుంచి నాకు మీతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి మీతో అనుబంధం ఉంది. మిమ్మల్ని ఎప్పుడు కలిసినా నేను చాలా జూనియర్ని అయినప్పటికీ నాతో మీరు ఆప్యాయంగా మాటాడుతూ ఈ విధంగా చేయాలి, ఆ విధంగా చేయాలని చెప్పడం వలన మీమీద ఎంతో గౌరవం ఏర్పడ్డది. ఈరోజు మీరు స్పీకర్‌గా ఎన్నిక కావడం నేనెంతో సంతోషించదగ్గ విషయం. మీరు బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌కు మొట్టమొదట ఛైర్మన్‌గా ఉండి తరువాత మరలా బాలకృష్ణ గారు ఛైర్మన్‌గా ఉండటం వలన ప్రస్తుతం మీరు డైరెక్టర్‌గా ఉన్నారు. మన రాష్ట్రం విడిపోయింది, ఈ ఇండో అమెరికన్ హాస్పిటల్ తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోయింది కాబట్టి దీని బ్రాంచి గానీ, ఇంకొక  హాస్పిటల్ గానీ బాలకృష్ణ గారి ఆధ్వర్యంలో గానీ లేదా మీ ఆధ్వర్యంలో గానీ సీమాంధ్రప్రదేశ్‌లో కేన్సర్ హాస్పిటల్‌ను పెట్టించాల్సిన బాధ్యత

గానీ, పెట్టించాల్సిన అవసరం గానీ ఉంది కాబట్టి దయచేసి మీరు దాని పైన దృష్టి పెట్టాలని మిమ్మల్ని సభాముఖంగా కోరుకుంటున్నాను.

అంతేకాకుండా, మీరు భారీ నీటి పారుదల శాఖామాత్యులుగా ఉన్నప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు మీరు శంకుస్థాపన చేశారు. 2004వ సంవత్సరం తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టుకు కావాల్సిన నిధులను మంజూరు చేసి 2008 కల్లా మేము పూర్తి చేస్తాం మీకు పశ్చిమ ప్రాంతమైన  కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు మరియు ఎర్రగొండపాలెం ప్రాంతాలకు నీరందిస్తామని చెప్పడం జరిగింది. అనుకోని పరిస్థితుల్లో 2008వ సంవత్సరం వరకు వాళ్లు నీరందించలేకపోయారు. ఇప్పుడు కూడా మనకు అవకాశం ఉంది, వెలిగొండ ప్రాజెక్టు నీరు వస్తేనే తప్ప కనిగిరి ప్రాంతం గానీ ఒంగోలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి గానీ వేరే సోర్స్ నుండి నీరు వచ్చే పరిస్థితి లేదు. కాబట్టి దయచేసి ఆ దృష్టితో మీరు ఆలోచించి ఆ పశ్చిమ ప్రాంతానికి నీరు వచ్చే విధంగా మీరు చూడాల్సిందిగా కోరుతున్నాను.

అంతేకాకుండా మీకు ప్రకాశం జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. మీరు ఎన్నోసార్లు వివిధ సమావేశాలకు హాజరుకావడం, అబ్జర్వర్‌గా పర్యటించడం జరుగుతుంది. కాబట్టి ఆ అనుభవంతోనైనా సరే వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతాన్ని మీరు దృ ష్టిలో పెట్టుకొని అభివృద్ధి వైపు దృష్టిసారించవలసిందిగా మిమ్మల్ని కోరుకుంటూ మరొకసారి మీకు శుభాభినందనలు తెలియజేసుకొంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ గద్దె రామమోహన్ : మీకు శుభాకాంక్షలు సార్. పల్నాడుకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్రను మేము పాఠ్యాంశాల్లో పుస్తకాల రూపంలో చదవడం జరిగింది. తర్వాత మాకు భగవంతుడైన శ్రీ నందమూరి తారక రామారావు గారు చిత్రాల ద్వారా ఆ పల్నాటి చరిత్రను కళ్లకుకట్టినట్లు మాకు చూపించడం జరిగింది. పల్నాటి చరిత్రకు మూలం పౌరుషం. అలాంటి పౌరుషాన్ని మీరు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత మీ ద్వారా చూడటం జరిగింది.  మిమ్మల్ని పల్నాటి సింహం అనే వారు, గుంటూరు టైగర్ అనే వారు, నరసరావుపేట పులి అనే వారు. ఎప్పుడు కూడా King of the Animals తో మిమ్మల్ని పోల్చుతూ ఉండేవారు. మేము ఒక చిన్న కార్యకర్తగా ఉన్నప్పుడు, మీరొచ్చిన సమావేశాల్లో కార్యకర్తలందరూ కూడా నినాదాలు మారుమ్రోగేటట్లు మిమ్మల్ని పోల్చి స్లోగన్స్ ఇస్తూ ఉండేవారు.  ఒకరిద్దరు ఆ స్లోగన్స్‌కి ఈర్ష్యపడి పల్నాటి సింహం అనే బదులు ఆయన్ని కూడా అడవిలో ఒదిలేస్తే పోతుంది కదా అనేవారు. అది అందరికి తెలిసిన విషయమే. మీకు ఒక షేక్ హ్యాండ్ ఇస్తే చాలు, మీతో మాట్లాడితే చాలు అని మేము కార్యకర్తలుగా అనుకునేవాళ్లం. నా అదృష్టవశాత్తు 1994వ సంవత్సరం నుండి

ఇప్పటి వరకు రాజకీయాల్లో ఉంటూ మీతో.. మీరు కారులో ముందు కూర్చుంటే వెనుక సీట్లో కూర్చొని ప్రయాణించే అదృష్టం నాకు కలిగింది. మీరు అన్ని పదవులను అలంకరించారు. ఒక హోమ్ మినిష్టర్‌గా, హెల్త్ మినిష్టర్‌గా, పంచాయితీరాజ్ మినిష్టర్‌గా, ఇరిగేషన్ మినిష్టర్‌గా ఒక సక్సెస్‌ఫుల్ మినిష్టర్‌గా మిమ్మల్ని చూడటం జరిగింది. మరి ఈ రోజున సభాపతిగా మీరు రావడం మిమ్మల్ని ఆ ఛైర్‌లో చూడటం మా అదృష్టంగా భావిస్తున్నాం. 1994-99 మధ్య కాలంలో సభా నాయకుడిగా చంద్రబాబు నాయుడు గారు సభాపతిగా యనమల రామకృష్ణుడు గారు ఉన్నారు. అదే విధంగా 1999-2004 మధ్య కాలంలో సభా నాయకుడిగా చంద్రబాబు నాయుడు గారు, సభాపతిగా శ్రీమతి ప్రతిభా భారతి గారు ఉన్నారు. అప్పుడు మన తెలుగు జాతి యొక్క గౌరవం దేశ విదేశాలకు చాటిన సంగతి మనందరికీ తెలుసు. దురదృష్టవశాత్తు గత 10 సంవత్సరాల్లో మన తెలుగు జాతి గౌరవం మసకబారింది. కాబట్టి ఈరోజున మీరు సభాపతిగా, సభానాయకుడిగా నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మరలా మసకబారిన తెలుగు చరిత్రకి పునః ప్రతిష్ట చేయాలని మనస్పూర్తిగా కోరుకుంటూ మరొక్కసారి మీకు శుభాకాంక్షలను తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మొట్టమొదటి స్పీకర్‌గా ఎన్నికైనందుకు పల్నాడు ప్రాంతం నుంచి వచ్చిన మీకు ఆ ప్రాంత వాసిగా అభినందనలు తెలియజేస్తున్నాను. 1983 నుండి 1999 వరకు నరసరావుపేట శాసన సభ్యుడిగా ఉంటూ అనేక పదవులను చేపట్టి మంచి అనుభవం ఉన్న వ్యక్తి మీరు. ఇంత అనుభవం ఉన్న వ్యక్తి ఒక స్పీకర్‌గా రావడం మరియు విలువలకు, విశ్వసనీయతకు మారు పేరైన మా నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి గారు, మీ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు నిర్ణయం తీసుకున్నందుకు తమ ఇరువురినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

అలాగే తెలుగుదేశం పార్టీతో మీకున్న అనుబంధం విడదీయరానిది. మీరు దయచేసి స్పీకర్ పదవిలో ఉన్నంత కాలం మీరు ఏ పార్టీకి చెందని వ్యక్తిగా ఉండాలని నేను కోరుకొంటున్నాను. పెద్దలు ఒక మాట చెబుతూ ఉంటారు, ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార పక్షం ప్రతిపక్షం రెండు కూడా రెండు కళ్లలాంటివి, వాటికి కనురెప్పల్లాగా గౌరవ సభాపతి ఉండాలని చెబుతుంటారు. అధ్యక్షా గతంలో జరిగిన శాసనసభ సమావేశాల్లో స్వర్గీయ డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు కానివ్వండి, చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉంటూ రాజశేఖరరెడ్డి గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కానివ్వండి, అప్పుడు ఏ సమస్యలు వచ్చినా, ముఖ్యంగా రైతుల సమస్యలు, కార్మికుల సమస్యలు, మహిళల సమస్యలు ఏవి వచ్చినా కూడా సంపూర్ణంగా చర్చించే పరిస్థితి ఉండేది. అందరు ఎదురు చూస్తుంటారు. ఎప్పుడు

సమావేశాలు జరుగుతాయి ఎప్పుడు తమ సమస్యలకు ఒక పరిష్కారం ఎప్పుడు వస్తుందని ఎదురుచూస్తుంటారు. కాబట్టి మనం ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

ఆ రోజుల్లో అలాగే జరిగే పరిస్థితి. చాలా సమస్యలకు పరిష్కారం దొరికే పరిస్థితి ఉండేది. కానీ 13వ శాసనసభలో నేను కూడా సభ్యునిగా ఉన్నాను, కనీసం ప్రజల సమస్యల మీద పరిష్కారం కాదు కదా క్రొత్త సభ్యులుగా వచ్చిన మాకు కనీస గౌరవ మర్యాదలు కూడా ఉండే పరిస్థితి లేదు. అధికార పార్టీ నాయకులు అనధికారంగా ఇచ్చే హామీలను దృష్టిలో పెట్టుకొని అధికార పార్టీ మరియు ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిపక్ష సభ్యులను చులకనగా మాట్లాడే పరిస్థితి. మీ హయాంలో ఆ విధంగా జరగకుండా మీరు క్రొత్త సభ్యులకు గౌరవ మర్యాదలు ఇచ్చే విధంగా ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మన రాష్ట్ర విభజన జరిగిన తర్వాత క్రొత్త రాష్ట్రం, క్రొత్త సమస్యలు, క్రొత్త సభ్యులు అన్నీ కూడా కూలంకషంగా చర్చించే విధంగా చూడాలి. ఎందుకంటే అధికార పార్టీ నాయకులు పేదలకు, రైతులకు, మహిళలకు చాలా హామీలిచ్చి అధికారంలోకి రావడం జరిగింది. 14వ శాసనసభ గురించి అందరు ఎదురు చూస్తున్నారు. ప్రతి సమస్య గురించి ఇక్కడ చర్చ జరుగుతుంది, అధికార పార్టీ నాయకులు ఏ సమస్య పైన కూడా తప్పించుకోకుండా దాటవేసే దోరణి లేకుండా ప్రతి సమస్యకు ఒక పరిష్కార మార్గం సూచించే విధంగా మీరు ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందిగా నేను కోరుతున్నాను. అలాగే మీరు స్పీకర్‌గా ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాలని నేను మనస్పూర్తిగా కోరుకుంటూ మిమ్మల్ని మరొకసారి అభినందిస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ చింతమనేని ప్రభాకర్: అధ్యక్షా, నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి శాసనసభలో మొట్టమొదటి శాసనసభ సభాపతిగా ఎన్నికకాబడిన మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఒక హుందాతనంతో మీరు వ్యవహరిస్తారని, మీయొక్క అపారమైన రాజకీయ అనుభవంతో ఆరు పర్యాయాలు శాసనసభ్యుడిగా గెలవడం, మంత్రి పదవికి వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తిగా మిమ్మల్ని అభివర్ణించక తప్పదు. అధికారంలో లేకపోయినప్పటికీ మీరు అనేక రైతు సమస్యల విషయంలో అలుపెరగని పోరాటం చేసిన వ్యకి మీరు. రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న ఈ పరిస్థితుల్లో మిమ్మల్ని గౌరవ సభాపతి స్థానానికి ఎంపిక చేసినందుకు ప్రత్యేకంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా ఒక చిన్న మనవి చేయదలిచాను. తొమ్మిది నెలల కాలంలో రాజకీయ పార్టీని స్థాపించి తెలుగుజాతి పేరును, కీర్తిని దేశవిదేశాల్లో చాటి చెప్పేందుకు కృషి చేసిన వ్యక్తి స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు. వారి యొక్క చిత్రపటాన్ని డైనింగ్ హాల్‌లో ఆవిష్కరించవల్సిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, సభ సజావుగా జరగాలంటే అందుకు అందరి సహాయ సహకారాలు అవసరం. సభ సవ్యంగా జరగాలంటే ఆ రథానికి ఇరుసు మీరని, రెండు చక్రాల్లో ఒకటి పాలకపక్షమైతే రెండవది ప్రతిపక్షమనే విధంగా గౌరవ ప్రతిపక్ష నాయకులు ఇందాక చెప్పడం జరిగింది. అందుకు కావల్సిన జూట్‌ను, గ్రీజ్‌ను కూడా అందిస్తేనే ఇరుసు మీద భారం పడకుండా ఉంటుందనే విషయాన్ని అందరూ గ్రహించాలి. ఇటువంటి క్లిష్ట సమయంలో రాజకీయ విమర్శలు చేయకుండా, సద్విమర్శలు చేస్తూ నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలను మీకందించినప్పుడు మీ స్థానానికి సభ సజావుగా నిర్వహించే విషయంలో సులభతరంగా ఉంటుంది. ఆ రకంగా అందరూ పెద్ద మనస్సుతో సహకరించినప్పుడే మనమంతా అనుకున్న గమ్యన్ని సులువుగా చేరుకోగల్గుతామనే విషయాన్ని తెలియజేసుకుంటూ నాకు మాట్లాడే అవకాశం కల్గించినందుకు ప్రత్యేకంగా మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బోండా ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, నూతన రాష్ట్రంలో మొట్టమొదటి శాసనసభలో మొట్టమొదటి సభాపతిగా ఎన్నుకోబడిన మీకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈరోజున మాలాంటి యువకులకు ఒక అనుభవజ్ఞులైనటువంటి స్పీకర్‌గా, యువత పక్షపాతిగా, పేదల, రైతుల పక్షపాతిగా ఉన్నటువంటి మిమ్మల్ని సభాపతిగా ప్రపోజ్ చేసినటువంటి గౌరవ ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. గుంటూరు జిల్లా నర్సరావుపేటలో 2006వ సంవత్సరంలో జరిగినటువంటి ఒక సంఘటనను ఈ సందర్భంగా నేను సభ్యులందరికీ  గుర్తు చేస్తున్నాను. 2006వ సంవత్సరంలో శ్రీ అంజుబాబు అనే ఒక పార్టీ కార్యకర్తను  కొందరు దుండగులు హత్య చేసినప్పుడు ఆనాడు మీరు పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడి, రౌడీయిజానికి ఎదురొడ్డి నరసరావు పేట నుంచి గుంటూరు వరకు మీరు చేసినటువంటి మహా పాదయాత్ర అందరికీ స్పూర్తిదాయకం. అంతే గాకుండా పార్టీ చేపట్టిన అనేక కార్యక్రమాల్లో ముఖ్యంగా రైతు పోరుబాటలో గానీ, గత పది సంవత్సరాల కాలం నుంచి తెలుగు దేశం పార్టీ చేపట్టిన  అన్ని కార్యక్రమాల్లో ప్రజల పక్షాన  ప్రతిపక్షపార్టీగా మీరు పాల్గొన్న పోరాట పటిమ కూడా అందరికీ స్పూర్తిదాయకం. తొలి  శాసనసభలో గౌరవ సభాపతిగా మీరు బాధ్యతలు తీసుకున్న ఈ సమయంలో తొలిసారిగా శాసనసభ్యులుగా మేం మా వంతు సహకరించడం జరుగుతుందని సభాముఖంగా తెలియజేస్తున్నాను.  తొలి శాసనసభలో తొలిసారిగా అడుగుపెట్టిన మాకు మాట్లాడే అవకాశాలు ఎక్కువగా ఇస్తూ, అన్ని కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని కూడా కల్పిస్తారని సభాముఖంగా తెలియజేసుకుంటూ మరొకసారి శాసనసభ సభాపతిగా ఎన్నికైన మీకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ప్రసంగించే అవకాశం కల్పించిన మీకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Minister for Legislative Affairs...........

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, మొట్టమొదటగా ఈ నూతన శాసనసభకు సభాధ్యక్షులుగా ఎంపికైనందుకు మీకు అభినందనలు తెలియపరుస్తున్నాను అదే విధంగా శుభాకాంక్షలు కూడా తెలియపరుస్తున్నాను. దాదాపు 1983వ సంవత్సరం నుంచి మీతో పాటు కలిసి పనిచేసే అవకాశం కూడా నాకు వచ్చింది. శాసనసభ్యులుగా, మంత్రులుగా మనం పనిచేశాం. మీకున్నటువంటి అపార అనుభవం తప్పకుండా ఈ సభాపతి స్థానానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. డాక్టర్‌గా మీరు చాలా సక్సెస్‌ఫుల్, రాజకీయ నాయకుడిగా సక్సెస్‌ఫుల్, మంత్రిగా సక్సెస్‌ఫుల్, ఎమ్మెల్యేగా మీరు సక్సెస్ అయ్యారు, ఇప్పుడు స్పీకర్‌గా కూడా మీరు సక్సెస్ అవుతారనే భావన మా అందరిలో కూడా ఉంది. అదే ఉద్దేశంతో మా నాయకులు శ్రీ చంద్రబాబు నాయుడు గారు మిమ్మల్ని సభాపతి స్థానానికి ఎంపిక చేయడం జరిగింది. అయితే స్పీకర్ సీటు చూడటానికి చాలా బాగుంటుంది కానీ చాలా కష్టతరమైనటువంటి సీటు. స్పీకర్ సీటు గులాబి మొక్క లాంటిది. గులాబి మొక్క చూడటానికి ఎంత బాగుంటుందో దాని క్రింద కూడా ముళ్లుంటాయి. అందుచేత ఆ స్థానానికి ఉన్న ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను అధ్యయనం చేయాల్సిన అవసరముంటుంది.

అధ్యక్షా, మీకు ప్రత్యేకంగా ఏమి చెప్పనక్కర్లేదు. మీరు డాక్టరుగా రోగులకు అనేక సర్జన్లు చేశారు. ఇప్పుడు ఈ శాసనసభలో ప్రస్తుతమున్న ప్రొసీజర్స్‌కు కూడా ఆపరేషన్ చేయాల్సిన అవసరముంటుంది. తొలి శాసనసభకు నూతనంగా చాలా మంది కొత్త శాసనసభ్యులు వచ్చారు. చదువుకున్న వారు, అనుభవజ్ఞులు శాసనసభకు ఎన్నికైనారు. ఈనాడు మన శాసనసభ అంతా రూల్స్ ప్రకారంగా, పార్లమెంటరీ ప్రాక్టిసెస్ ప్రకారంగా ఎథికల్ వాల్యూస్ నిలుపుకుంటూ, డెమోక్రటిక్ వాల్యూస్ నిలుపుకుంటూ ప్రాపర్ డిబేట్స్ జరపడానికి అవకాశం ఉండే విధంగా ఈ హౌస్ నడవవల్సిన అవసరముంది. గత శాసనసభను చూశాం. కావల్సిన డిబేట్స్ జరగకపోవడాన్ని మనం చూశాం. శాసనసభలో డిబేట్ జరగకపోతే ప్రజలకే అన్యాయం జరుగుతుంది. డిబేట్లు జరిగే విధంగా, దాన్ని ప్రొటెక్ట్ చేయవల్సిన బాధ్యత శాసనసభ సభాపతి గారి పైన ఉంటుంది. అందుచేత శాసనసభ సభాపతిగా డిబేట్స్ ఎక్కువగా జరిగేట్టుగా చూడవల్సిన బాధ్యత కూడా మీపైన ఉంటుంది. ఎథికల్ వాల్యూస్ అనేవి మనకు చాలా ముఖ్యం. మనల్నందరినీ ప్రజలు ఎన్నుకున్నారు. ప్రజలు ఎన్నో ఆశలతో మనల్ని ఎన్నుకోవడం జరిగింది. ప్రజల ఆశలను తీర్చవల్సిన బాధ్యత కూడా శాసనసభ్యులుగా మనపైన ఉంటుంది. ప్రభుత్వం పైన బాధ్యత ఉన్నప్పటికీ శాసనసభ్యులుగా మన పైన కూడా బాధ్యత ఉంటుంది. దాన్ని ఎవరూ మరవకూడదు. శాసనసభలో సరిగా ప్రవర్తించడమనేది కూడా ఒక

బాధ్యత. సరైన రీతిలో వ్యవహరించడమనేది కూడా మన మీద ఉన్న బాధ్యత. సరిగా రెప్రజెంట్ చేయడమనేది కూడా ఒక బాధ్యత. డిబేట్‌లో పాల్గొనడమనేది ఒక బాధ్యత. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు అవసరమైతే ట్రైనింగ్ క్లాసెస్‌ను మీరు నిర్వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే చాలా మంది శాసనసభ్యులు రూల్స్, ప్రాక్టిసెస్, ప్రొసీజర్స్ గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందాక చాలా మంది సభ్యులు చాలా విషయాల గురించి ప్రస్తావించారు. **Speaker does not belong to a particular political party, once he got elected as a Speaker. He is the representative of the State Legislature.** అందుచేత ప్రజలందరికీ సంబంధించినటువంటి పోస్ట్ సభాపతి పోస్ట్. ప్రజలందరికి న్యాయం చేయాలంటే మీకు శాసనసభ్యులందరూ సహకరించాలి. ఎందుకంటే మీకు రూల్స్ ఉన్నాయి, పవర్ ఉంది గానీ స్పీకర్ గారికి సభ్యులందరూ సహకరిస్తేనే సభ సజావుగా నడిచేందుకు వీలుంటుంది. అందుచేత మెంబర్స్ కాన్సన్‌ట్రేషన్ అంతా కూడా మనం డిబేట్స్ పైన పెట్టుకుంటే బాగుంటుంది. రాజకీయాల కంటే సభలో డిబేట్స్‌కు అత్యధిక ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుంది. మనం క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నామనే విషయాన్ని చాలా మంది సభ్యులు ప్రస్తావించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఎదురౌతున్న క్లిష్టమైన పరిస్థితుల గురించి కూడా మనం సభలో డిస్కస్ చేయాలి. అతి త్వరగానే మన రాష్ట్రం అభివృద్ధి చెందినటువంటి రాష్ట్రంగా తయారుచేయడానికి అందరూ సహకరించవల్సిన అవసరముంది. మనవైపు చూస్తున్నప్పుడు వాళ్ల యొక్క aspirations కూడా మనం చేరుకోవల్సిన బాధ్యత కూడా ఉంటుంది కాబట్టి హౌస్ వైపు చూస్తుంటారు. అందుచేత చాలా అవకాశాలను ఉంచుకున్నాం. లైవ్ టెలికాస్ట్ ఎథికల్ వాల్యూస్ మెయింటేన్ చేయడానికి, డెమోక్రటిక్ వాల్యూస్ మెయింటేన్ చేయడానికి వీలుంటుంది. ముఖ్యంగా ప్రతి బడ్జెట్ సమావేశాలకు ముందు ఒక శిక్షణ క్లాస్‌ను మనం నిర్వహించుకుందాం. ఆ క్లాస్‌కు పార్లమెంట్ ప్రాక్టిసెస్‌కు సంబంధించిన ప్రముఖులను, అనుభవజ్ఞులను పిలిపించడం జరుగుతుంది. గతంలో కూడా చాలా పర్యాయాలు శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ప్రతి సెషన్‌కు కొత్తగా శాసనసభ్యులుగా ఎన్నికైన వాళ్లు వస్తుంటారు. వారికి కూడా అన్ని విషయాలు తెలియాలి. ఎప్పుడైతే లైవ్ టెలికాస్ట్ ఉందో అందరి దృష్టి శాసనసభ వైపు ఉంటుంది. మన ప్రవర్తనంతా కూడా ప్రజలు ఈనాడు చూస్తుంటారు. సభ్యుల ప్రవర్తన కూడా చాలా ముఖ్యం. అందుచేత స్పీకర్ గారు సభను కంట్రోల్ చేయడానికి పవర్ ఉన్నాకూడా మెంబర్స్ కూడా సహకరించాల్సిన అవసరముంటుంది. తప్పకుండా అందరం మీకు సహకరిస్తాం. ఎక్కువగా డిబెట్స్ జరిగే విధంగా మన దృష్టిని సారిద్దాం. ఎవరికీ ఏ విధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూసే బాధ్యత మీపైన ఉంటుంది. మీరు అనుభవజ్ఞులైన వారే కాబట్టి సభ నిర్వహణలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే దాదాపు ఆరు పర్యాయాలు మీరు సభలో ఎమ్మెల్యేగా ఉన్నారు. కాబట్టి ఇక్కడ ఉన్న ప్రాక్టిసెస్ గానీ, సిస్టమ్స్ గానీ, రూల్స్ మీకు తెలుసు. ముఖ్యంగా మనమంతా ఒకటే ఆలోచించాలి. అందరికీ న్యాయం

జరిగేలా, డిబెట్ సజావుగా జరిగేలా చూడాలి. మరీ ముఖ్యంగా మనం ఆలోచించాల్సింది ఈ రాష్ట్రానికి ప్రజలకు న్యాయం జరిగే విధంగా మన శాసనసభ సమావేశాలు నడవాలని ఆశిస్తూ మరొకసారి నూతనంగా ఎన్నికకాబడిన శాసనసభ సభాపతిగా మీకు మరొకసారి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : సభా నాయకులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి, ప్రతిపక్ష నాయకులు శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి గారికి, మంత్రివర్గ సభ్యులు, శాసన సభ్యులందరికీ శాసనసభకు ఎన్నికైనందుకు ముందుగా మీకందరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అధికారపక్షం, ప్రతిపక్షం నుంచి మీరందరూ సహకరించి నన్ను ఏకగ్రీవంగా సభాపతిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. నాకు గతం గుర్తుకొస్తుంది, 1983వ సంవత్సరంలో శాసనసభకు ఎన్నికైనప్పుడు మొదటిగా ఇదే చోట సభ సమావేశమైనది. అంతేకాకుండా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విడిపోయినప్పుడు మొట్టమొదటి శాసనసభ సభాపతిగా నర్సరావుపేట నియోజక వర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైన శ్రీ ఎన్. వెంకట రామయ్య చౌదరి గారు ఉన్నారు. అదే విదంగా ఈరోజు సమైక్యాంధ్రప్రదేశ్ నుండి  రాష్ట్రం విడిపోయి మొట్టమొదటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాసనసభ సభాపతిగా నేను ఏకగ్రీవంగా ఎన్నికవడం నాఅదృష్టంగా భావిస్తున్నాను.  శాసనసభను గురించిగానీ శాసనసభ ప్రాముఖ్యతను గురించి గానీ విశిష్టతను గురించి గానీ, ఎవరు చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రాష్ట్రం యొక్క బడ్జెట్ గానీ, ప్రజా సమస్యలపైగానీ, చట్టాల రూపకల్పన గానీ, బిల్లులుగానీ, ప్రభుత్వ జమా ఖర్చుల వివరాల గురించి చర్చ జరిగేది ఈ పవిత్రమైన వేదిక నుంచే. వివిధ  ప్రాంత ప్రజలకు సంబంధించి  మనం చేసే చట్టాలు, బిల్లులు, తీర్మానాలు నిర్దిష్టంగా జరగాల్సిన అవసర ఉంది. ముఖ్యంగా ఈ రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో మనకు జరిగిన అన్యాయం గురించి కానీ, జరిగిన రాజకీయాలపై మాట్లాడాల్సిన అవసరం లేదు.

కానీ మనం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నాం. మనకు కావల్సిన మౌలిక వసతులుగానీ, నిధులు గానీ, కేంద్రప్రభుత్వం  చేసిన వాగ్దానాలు గానీ, వాటిని అమలుచేసే తీరును గానీ వాటన్నింటిని కూడా మనందరం కలిసి సమిష్టిగా పోరాటం చేసి నిర్ణయాలు చేసి సాధించుకుంటే తప్ప ఒనగూరే పరిస్థితులు లేవు. అందుచే నేను కోరేదేమనగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించి, ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించి తప్పులు లేకుండా వాటియెక్క కార్యక్రమాలను రూపకల్పన చేసి ప్రజలకు అందించాలని కోరుకుంటున్నాను. ఇంతకు ముందే గౌరవ సభ్యులు చెప్పినట్లు Speaker should speak less and allow others to speak more. If I start speaking more then I am a failure.  అలాంటి పరిస్థితి రాకుండా సహకరించమని మిమ్మలందరిని కోరుతున్నాను.

ఈ రోజు సభకు ఎన్నికైన సభ్యుల్లో సుమారు 40మంది కొత్తగా ఎన్నికైనవారు. వారందరు కూడా చట్టాలు గురించి, సభ గురించి, సభా సాంప్రదాయాలు పనితీరు గురించి తెలుసుకోవల్సిన అవసర ఉంది. వారికి సంబంధించి వారికి రావల్సిన బెనిఫిట్స్ గురించి, హక్కులు గురించి తెలుసుకునే విదంగా వారందరిని ఎఫెక్టివ్‌గా పనిచేసే విదంగా చర్యలు తీసుకుంటామని తెలియజేసుకుంటున్నాను. అదేవిదంగా మనం సభలో మాట్లాడే తీరు మనల్ని ఎన్నుకున్న ప్రజలు రాష్ట్ర ప్రజలు మెచ్చుకునే విదంగా ఉండాలి. ప్రజలు లైవ్ టెలికాస్ట్ ద్వారా మనల్ని ప్రతినిమిషం గమనిస్తుంటారు. మనకు గల విషయ పరిజ్ఞానం, హావభావాలతో ఏవిధంగా పనిచేస్తున్నామో గమనించే అవగాహనా శక్తి ఈనాటి ప్రజలకుంది. ఇవన్నీ ప్రజలు గమనిస్తుంటారు కాబట్టి వారి పట్ల మీరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మనవి చేస్తున్నాను. అధికారపక్షం పైన ప్రతిపక్షం, ప్రతిపక్షం పైన అధికారపక్షం పైచేయిగా ఉండాలని ప్రయత్నించడం సహజమే అయినప్పటికీ, ఆ ప్రయత్నం ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ప్రజలు హర్షించే విధంగా ఉండాలని కోరుకుంటున్నాను.

ప్రభుత్వం తప్పులుచేస్తే ప్రతిపక్షాలు విమర్శించవచ్చు. ప్రతిపక్ష తీరు బాగులేనప్పుడు ప్రభుత్వపక్షం ఎత్తిచూపచ్చు. కానీ ఇంతకు మునుపే గౌరవ సభ్యులు చెప్పినట్లుగా బయట ప్రజలు మనల్ని గురించి అసహ్యహించుకునేటట్లు మనం వ్యవహరించకూడదు. దానిద్వారా శాసనసభ యొక్క స్థాయి, విలువలు తగ్గిపోతాయి కాబట్టి ఆవిదంగా వ్యవహరించకూడదు. గతంలో మీరు చూసినట్లైతే నేను మొదటిసారి 1983వ సంవత్సరంలో శాసనసభకు వచ్చినప్పుడు సూచించిన పద్దులపై కూలంకషంగా సభలో చర్చ జరిగేది. చర్చానంతరం ఆమోదం జరిగేది. కాలానుగుణంగా పద్దులపై చర్చలు జరగకుండానే చాలా వరకు ముగుస్తున్నాయి. Deemed to have been granted అయిపోతున్నాయి. పద్దులపై చర్చజరిగితే వాస్తవాలు బయటపడతాయని పద్దులన్ని గిలిటెన్ అయ్యిపోతున్నాయి, అది వాంఛనీయం కాదు. సభలో పద్దులపై చర్చ జరిగితేనే ప్రజలకు మంచిది.

మన పనితీరును ప్రజలు మెచ్చుకునే విధంగా పనిచేద్దాం. గౌరవ సభ్యులు మాట్లాడుతూ, అధికార, ప్రతిపక్షాలు రెండూ రెండు కళ్లవంటివి అన్నారు. రాజకీయంగా వేరు కావచ్చు కానీ ఒకసారి సభాపతి స్థానంలో కూర్చున్న తరువాత నా బాధ్యతలు ఏమిటో నేను చేయాల్సిన పనితీరు ఏమిటో నాకు తెలుసు. అదే విదంగా మీరుకూడా హద్దులు మీరకుండా నియమ నిబంధనలు పాటించాల్సి ఉంది. అనేకమంది మనకు ముందు ఈ స్థానాల్లో కూర్చున్నారు. చట్టాలు తెచ్చారు. సాంప్రదాయాలు నెలకొల్పారు, విలువలు పాటించారు. ఆ విలువలను మనం కూడా పాటించినట్లైతే, మన సాంప్రదాయాల్ని పాటించిన వాళ్లమవుతాము.

మన స్థాయి పెరుగుతుంది. మనకున్న ఎమోషన్స్‌ను గానీ, అభిప్రాయాల్ని కానీ వ్యక్తపరచే తీరుతెన్నులు చట్టబద్ధంగానూ, ప్రజలకు మేలు చేసేవిధంగాను ఉండాలని కోరుకుంటున్నాను. ఆ క్రమంలో ఈ రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపు దిద్దుకోవాలంటే మనందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఈ సభలో రెండోసారి సమావేశమయ్యాము, మొదట ఇక్కడే కూర్చొని కొత్త శాసనసభా హాలులోకి వెళ్లి మళ్లీ ఇక్కడకే వచ్చాం. నేను కోరుకునేదేమనగా వసతులు తక్కువైనా మన రాష్ట్రంలో మన అసెంబ్లీ ఉండాలి, మన సచివాలయం ఉండాలి. అతి త్వరలోనే మన ప్రజలకు దగ్గరలోనే మన పరిపాలన ఉండాలని కమిట్‌మెంట్‌తో ప్రజా పరిపాలన ఉండాలని కోరుకుంటున్నాను. సభలో ప్రశ్నావళిపై కూలంకషంగా వివరించేందుకు మంత్రివర్యులు తయారై రావాల్సిందిగా సభ్యులను కోరుకుటున్నాను. నా బాధ్యతల నిర్వహణలో లోపాలు లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని తెలియజేస్తున్నాను. ఈ శాసనసభలో సభాపతిగా పనిచేసే అవకాశం కల్పించిన మీ అందరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియపరుచుకుంటున్నాను.

MR. SPEAKER: I am to announce that some Members have not subscribed the Oath in proper form. Now, I request them to take the Oath.

| Sl.No. | Name of the Member | Name of the Constituency | Language in which Oath was taken (Telugu/English) |
|---|---|---|---|
| 1 | Sri K. S. Jawahar | Kovvur | Telugu |
| 2 | Sri Chevireddy Bhaskar Reddy | Chandragiri | Telugu |
| 3 | Sri Buggana Rajendranath | Dhone | Telugu |
| 4 | Sri M Venkataramana | Tirupati | Telugu |
| 5 | Sri Pochimareddy Ravindranath Reddy | Kamalapuram | Telugu |

## ANNOUNCEMENT

MR.SPEAKER: I am to announce to the House that I have received a letter dated 20.6.2014 from the President of YSRCP, intimating that Sri Y.S.Jagan Mohan Reddy is the Leader of the Y.S.R. Congress Legislature Party. Accordingly, Sri Y.S.Jagan Mohan Reddy is recognized as the Leader of the Opposition.

Now, the House is adjourned to meet again at 8.55 a.m. tomorrow.

**(The House then adjourned at 1.08 p.m. to meet again at 8.55 a.m. on Saturday, the 21st June, 2014.)**